ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక




'పళ్ళు బిగువు'


—ఫొ. చి, ఆర్. కృష్ణ.

24-12-47 ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY వెల 4 అణాలు


ఎన్. జి. ఓ.ల సమ్మె




మద్రాసు హైకోర్టు ప్రాంగణంలో మురాలు మురాలుగా చెట్లకింద చేరిన సమ్మెదార్లు.




సివిల్ సప్లయి ఆఫీసు వ్యవసాయ సహకారశాఖల ఉద్యోగులు కొందరు.



కాంటీను దగ్గర చేరిన పి. డబ్ల్యు. డి. ఆఫీసు ఉద్యోగులు.



ఎలెక్ట్రిసిటీ డిపార్టుమెంటునుండి షికారు బయలుదేరిన ఎన్. జి. ఓ.లు



సమ్మెచేసి సివిల్ సప్లయి ఆఫీసుకు వస్తూన్న కోర్టు ఆఫీసుల ఎన్. జి. ఓ.లు

ఆంధ్రపత్రిక

సంవత్సర చందా రు. 12-0-0
విడిప్రతిక అణాలు 0-4-0

ప్రతిబుధవారమున ప్రకటింపబడును

సంపుటము **40**
సంచిక **15**

ఒరు లేయవి యొనరించిన నరవర! యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్. (మహాభారతము)

Founder: K. NAGESWARA RAO.

సర్వజిత్తు సంవత్సర మార్గశీర్ష శుద్ధ ద్వాదశి బుధవారము



భానుమతి



ఆంధ్రపత్రిక

1947-వ సం॥ డిసెంబరు నెల 24-వ తేది బుధవారము

భారత సమాఖ్య-హైదరాబాదు సంస్థానం

ఆత్మ వినాశనానికి సిద్ధపడినవారే ఈ ప్రజాస్వామిక యుగంలో ప్రజాభిప్రాయాన్ని అలక్ష్యం చేయ సాహసింపగలరని సంస్థాన శాఖామాత్యుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ హైదరాబాదు సంస్థాన వ్యవహారాలను విమర్శిస్తు గత వారం జయపూర్‌లో జరిగిన ఒక బహిరంగ సభలో చేసిన ఉపన్యాసంలో విస్పష్టం చేశారు. సంస్థానంలో బాధ్యతాయుత ప్రభుత్వమును నెలకొల్పాలని హైదరాబాదు ప్రజలు కోరడం సబబేననీ, అలా కోరడానికి ప్రజలకు హక్కున్నదనీ సర్దార్ పటేల్ వివరించాడు. యథాతథపు ఒడంబడికవల్ల సంస్థానప్రజలు గత అయిదారు మాసములుగ సాగిస్తున్న పోరాటమునందెట్టి మార్పూ రానవసరము లేదనీ, సంస్థానము భారత సమాఖ్యతో చేరిపోయి, సంస్థానమున బాధ్యతాయుత ప్రభుత్వమేర్పడువరకు పోరాటము జరుగవలసియే యుండునని లోగడ తెలిపి యుంటిమి. ఇటీవల సంస్థాన కాంగ్రెస్ కార్యాచరణ సంఘమువారు చెన్ననగరములోను, బొంబాయిలోను సమావేశమై ఇట్టి నిర్ణయమునే చేసిరి. యథాతథపు ఒడంబడికవల్ల సంస్థానకాంగ్రెస్ ఉద్యమలక్ష్యములు సిద్ధింపలేదు. సంస్థాన ప్రజలు ఎన్నడు ఇట్టి తాత్కాలికపు ఏర్పాట్లకు సుముఖముగ లేరు. హైదరాబాదు సంస్థానమునకును భారత సమాఖ్యకును జరిగిన యథాతథపు ఒడంబడిక కేవలము ఆ రెండు ప్రభుత్వముల పరిపాలనా సౌకర్యమునకు సంబంధించినదేగాని ప్రజల అభిమతమునకు హక్కులకు, కోరికలకు సంబంధించినది కాదు.

యథాతథపు ఒడంబడిక కేవలము యుద్ధ విరమణ ఒడంబడిక వంటిదేగాని 'శాంతి సంధి' వంటిది కానేరదు. శాంతి ఒడంబడిక జరిగిననాడే అసలు సమస్య పరిష్కారమైనట్లు భావింపవలసి యుండును. యథాతథపు ఒడంబడిక కాలపరిమితి పూర్తి యగులోపున సంస్థానము భారత సమాఖ్యకు రక్షణ, రవాణా, వైదేశిక వ్యవహారములకు సంబంధించి నంతవరకు అధికారమును దఖలుపరిచి ఇతర సంస్థానములవలెనె అధికార దఖలు పత్రముపై సంతకము చేయగలదని తమకు సంపూర్ణ విశ్వాసమున్నదని అధినివేశ ఉపప్రధాని ప్రకటించెను. బ్రిటన్‌వంటి బ్రహ్మాండమైన శక్తి గల రాజ్యమే ప్రజాభిప్రాయ మప్రతిహతమని గుర్తించి భారత దేశమునుండి వైదొలగినప్పుడు, అందుకు భిన్నముగ తాము వ్యవహరింపగలమని నిజాం ఎట్లు భావింపగలడని సంస్థాన శాఖామాత్యుడు ప్రశ్నించుచున్నారు. నిజాం సంస్థానమున ప్రజాభిప్రాయము వ్యక్తమగుటకు ప్రత్యక్ష పోరాటము వినా మార్గములేదు. వాక్ స్వాతంత్ర్యము, ముద్రణా స్వాతంత్ర్యములు సంస్థానమున మృగ్యము. ప్రజలకు సంగతి సందర్భములు తెలియకుండునట్లు చేసి, ప్రజల నజ్ఞానము నందుంచి తమ స్వాతంత్ర్యమును నిలుపుకొన చూచుచున్నది హైదరాబాదు ప్రభుత్వము. యథాతథపు ఒడంబడికను చేసుకొనుటద్వారా సంస్థాన ప్రభుత్వము యథేచ్ఛా ప్రవర్తనకు అధినివేశ ప్రభుత్వమునుండి అధికార పత్రమును పొందినట్లు భావించుచున్నది. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయపూర్‌నందు చేసిన విస్పష్ట ప్రకటనవలన నిజాం ఇప్పటి భ్రమనుండి బయటపడి వాస్తవ స్థితిగతుల గ్రహింపగలడని విశ్వసిస్తున్నాము.

సంస్థానమున కొత్తగ ఏర్పడిన ప్రభుత్వమునకు అవకాశం ఇచ్చి చూడాలని సర్దార్ పటేల్ ప్రకటించినందున భారత అధినివేశ ప్రభుత్వ విధానము తమ నిరంకుశ పరిపాలనకు అనుకూలముగ నున్నదను అపోహాలో లాయక్ అలీ ప్రభుత్వము పడరాదు. ఆ యవకాశమును దుర్వినియోగము చేసుకొనిన, అందువలన సంప్రాప్తం కాగల దుష్ఫలితములను సంస్థానము యావత్తు అనుభవింపవలసి యుండును. ఇప్పటి ఉద్యమమును తీవ్రతరము చేయుటకు బహు ముఖముల సాగించుటకు సంస్థానకాంగ్రెస్ నిశ్చయించుకొన్నది. సంస్థానమున అశాంతి, అరాచకము ఏర్పడిన అట్టి పరిస్థితుల నెదుర్కొనుటకు భారతప్రభుత్వ సహాయమును యథాతథపు ఒడంబడిక షరతుల ననుసరించి ఆశింపగలమని అధికారులు భావించుచుండవచ్చును. కాని ప్రజాఉద్యమమును అణచుటకు భారత అధినివేశ ప్రభుత్వ మెన్నటికి సమ్మతింపదను సామాన్య విషయమును సంస్థానాధికారులు గ్రహింపవలెను.

బాధ్యతాయుత ప్రభుత్వమును కోరుటకు ప్రజలకు హక్కున్నదని సర్దార్ పటేల్ అంగీకరించెను. ఆ కోరికను సాధించుటకు జరుగు పోరాటము న్యాయమైనదనికూడ ప్రచ్ఛన్నముగ సర్దార్ పటేల్ ప్రకటించెను. ప్రజాభిమతమును పాలించమని సంస్థానాధీశ్వరునకు సలహా నిచ్చెను. హిందూ-ముస్లిం సమ ప్రాతినిధ్యమును గురించి ప్రస్తావించువారు బాధ్యతా విరహితముగ ప్రవర్తించుచుండిరని కూడ సంస్థాన శాఖామాత్యుడు ప్రకటించి యుండెను. అధినివేశ ప్రభుత్వము ప్రజాభిమతమునుబట్టి తన విధానమును నిర్ణయించుకొనునుగాని సంస్థానాధీశ్వరుల సౌకర్యమునుబట్టి కాదని జునాఘడ్ కాశ్మీర్ ఒరిస్సా సంస్థాన సంఘటనలు స్పష్టము చేసినవి. ఇట్టి పరిస్థితులలో హైదరాబాదు సంస్థానాధీశ్వరునకు అనుసరణీయమైన మార్గము ఒక్కటే గలదు. ఇప్పటి నామమాత్రపు తాత్కాలిక ప్రజాప్రభుత్వమును రద్దుపరచి, సంస్థానమునందలి అత్యధిక సంఖ్యాకులకు ప్రాతినిధ్యం వహింపగల సంస్థానకాంగ్రెస్ అధ్యక్షుని ఆహ్వానించి ప్రజాస్వామిక సూత్రముల ననుసరించి బాధ్యతాయుత ప్రభుత్వమును ఏర్పాటు చేయవలసిందిగ కోరవలెను. మత తత్వమును మత దురభిమానమును, సంకుచిత దృష్టి, దృక్పథమును విడనాడి, ప్రజాస్వామిక సూత్రముల ననుసరించి నూత్న రాజ్యాంగ విధానమును తయారు చేయుటకు ప్రజాప్రభుత్వ అధ్వర్యమున ప్రజా పరిషత్తును ఏర్పాటు చేయవలెను. అన్యమార్గమును అనుసరించిన సంస్థానము తీవ్ర అశాంతికిలోను కావలసివచ్చును. సౌమ్యముగ పరిష్కారము కావలసిన సమస్య సాయుధ సంఘర్షణల ద్వారా పరిష్కారము కావలసిన అవాంఛిత స్థితి ఏర్పడగలదు.

పారిశ్రామిక రంగంలో 'అవహారం'

వస్తూత్పత్తి వృద్ధిఅయితేనే గాని ప్రజల జీవిత పరిమాణం వృద్ధికావడానికి వీలులేదు. పనివారి వేతనములు వృద్ధిచేసిననేగాని సమ్మెలు తగ్గి వస్తూత్పత్తి వృద్ధికాదు. అధిక వేతనాలు, అధిక ఉత్పత్తి పరస్పరాధీనములు. కనుక యజమానులు, పనివారుకూడ సహకార భావముతో లక్ష్యసిద్ధికి దీక్షతో పనిచేయకున్న ఈ విషమ గుండాన్ని విచ్ఛేదం చేయడం సాధ్యం గాదు. కనుకనే భారత అధినివేశ ప్రధానామాత్యుడు పండిట్ జవహరలాల్ నెహ్రూ అఖలభారత పారిశ్రామిక మహాసభలో ఉపన్యసించుచు పారిశ్రామిక రంగమునందు కొంత కాలము అమలునందుండగల 'అవహారమును' ఏర్పాటు చేసుకొనవలెనని పనివారికీ పారిశ్రామికులకు విజ్ఞప్తిచేసెను. మహాసభయందు పాల్గొన్న వివిధ కార్మికసంస్థల ప్రతినిధులు, పారిశ్రామిక ప్రముఖులు ప్రధానామాత్యుని విజ్ఞాపనను పాలించి మూడు సంవత్సరములు అమలులోనుండగల అవహారమును ఏర్పాటు చేసుకొనుచు తీర్మానించిరి. ఇట్టి నిర్ణయమును చేసినందుకు ఉభయులు అభినందనార్హులు. కాని సమావేశమునందు కొందరు ప్రతినిధులు సూచించినట్లు తీర్మానము తృప్తికరముగా నున్నను, తీర్మానమును పాలించుటలో అన్నిపక్షములవారు సవ్యముగ ప్రవర్తింతకున్న మహాసభ ఆశించిన ఫలితములు సాధ్యముగావు. బొంబాయిలో సోషలిస్టు నాయకులు తలపెట్టిన సూచనమాత్రపు సమ్మెను సాగింపవలదని పండిట్ నెహ్రూ విజ్ఞప్తి చేసెను. కాని సోషలిస్టుపక్ష నాయకులు సమ్మెను సాగించుటకే తీర్మానించిరి.

కార్మిక ప్రతినిధి సంఘములందు ఐకమత్యములేదు. అందుకు కారణము సంఘముల నడుపు నాయకుల లక్ష్యములు భిన్నముగ నుండుటె. ప్రస్తుతము భారతీయులందరి లక్ష్యము, వారు ఏ వర్గమునకు చెందినవారైనప్పటికిని, ఒక్కటిగనె యుండవలెను. స్వతంత్ర భారత దేశము అఖిల ఆసియా నాయకత్వమును వహించి ప్రపంచ శాంతి నిర్మాణమున ప్రముఖ భూమికను నిర్వర్తింపగల శక్తివంతమైన రాజ్యము కావలెను. అందుకు పారిశ్రామికముగ దేశము అభివృద్ధి చెందవలెను. దేశమున సంపూర్ణ శాంతి ఏర్పడవలెను. మరొక మహాప్రళయము వచ్చుటకు పూర్వమె ఇది జరుగవలసి యున్నదని నెహ్రూ హెచ్చరించెను. పారిశ్రామిక మహాసభ తీర్మానమును సహృదయతతో ఆచరణలో పెట్టిననె ఇది సాధ్యము కాగలదు.

విదేశాలలో ఆంధ్రులు :

మారిషస్ దీవులలో ఆంధ్రుల దుస్థితి

శ్రీ యస్. కె. రామస్వామి పైడయ్య
(మారిషస్ ద్వీపవాసి)

మారిషస్‌లోనున్న అనేక వేల మంది "ఆంధ్రుల దుస్థితి"పై పలుమారు, 1929 సం. నుండి 1932 సం॥ వఱకు, 'ఆంధ్రపత్రిక'లోను, 'త్రిలింగ'లోను, నేను అనేక లేఖలు వ్రాసి యుంటిని. మా 'ఆంధ్రదేశం' లోనున్న జనసంఖ్య మా ఆంధ్రజనులకు దెలియును. కొన్ని నా లేఖలు అనేక పత్రికలలో: అనగా 'తెనుగు సమాచార్' (బొంబాయి) లోను, 'రాష్ట్రీయాంధ్రులు' (ఖర్గపురం) లోను, మరల ప్రచురింపబడినవి.

1929 వ సం॥ సెప్టెంబరు నెల 11 వ తేది 'ఆంధ్రపత్రిక'లో ప్రచురింపబడిన నా ప్రథమ లేఖ "మారిషస్‌లో ఆంధ్రుల దురవస్థలు" అని ఇట్లు వ్రాసియుంటిని.

"......ఈ దేశమున గల తెలుగువారిలో విద్యావంతుల కెల్లరకును గూడ తెలుగు భాష రాదనియే నేను చెప్పగలను. గత 50 సంవత్సరములనుండియు నీదేశమున వేల కొలదిగ తెలుగువారు నివాస మేర్పరచుకొనినను గూడ యిప్పటికిని తెలుగుపాఠశాల యొకటైనను యిచ్చట నెలకొల్పబడలేదు.

ఈ దేశమున 3,75,000 మొత్తము జనసంఖ్య కలదు. అందు ఆంగ్లేయులు, ఫ్రెంచివారు, చీనావారు మున్నగువారు 1,1000, గలరు. తక్కిన 2,65,000 మంది యు భారతీయులే. ఇచ్చటగల భారతీయుల జనసంఖ్య యొక్క వివరములను యీ క్రింద పొందుపరచుచున్నాను:

90,000 హిందుస్థానివారు, 55,000 తెలుగువారు, 50,000 తమిళులు, 47,000 మహమ్మదీయులు, 23.000 మహారాష్ట్రీలు మున్నగువారు మొత్తం 2,65,000. . .

భారతీయులలో తెనుగువారికి తప్ప తదితర జాతులవారికి విద్యా, సాంఘిక, సంస్థలు గలవు. వానిమూలమున ఆయా జాతులవారు సాంఘిక, నైతిక, రాజకీయ, ఆధ్యాత్మిక విషయములందభివృద్ధి నొందుచున్నారు. భారతదేశము నుండి వేదాధ్యయన సంపన్నులు, సనాతన ధర్మబోధకులు, మౌల్వీలు అప్పుడప్పుడు ఈ దేశమునకు వచ్చుచుండు నాచారము గలదు. వారి ప్రచారము వలనను, వారి ప్రబోధము వలనను కొన్ని జాతులవారు అభివృద్ధి నొందుచున్నారు.

ఆంధ్రుల దుస్థితి

ఇచ్చటగల భారతీయులలో కెల్ల తెలుగువారు మిక్కిలి హీనమగు దురవస్థలో నున్నారని చెప్పుటకు నేను చాల విచారించుచున్నాను. ఆంధ్రదేశమునుండి యెవ్వడైనను ఒక ఆంధ్ర మిషనరీ ఇచ్చటకు వచ్చి ఇచ్చట గల ఆంధ్రులకు ఆంధ్రజాతిని గురించియు, ఆంధ్రత్వమును గురించియు, ఆంధ్రచరిత్ర, ఆంధ్రదేశముల గురించియు ప్రబోధము సలిపియుండుట లే మెఱుంగము.

భారతదేశమునుండి యిచ్చట కప్పుడప్పుడు వచ్చుచుండు మిషనరీలలో నొక్కడైనను ఆంధ్రుడు లేడు. ఇచ్చట ఆంధ్రులలో వివాహములు మున్నగువానిని హిందూస్థానీవారు హిందీ భాషలోనే మంత్రముల నేకరువు పెట్టి జరుపుచున్నారు. ఇది మిక్కిలి శోచనీయమగు విషయము. ఇండ్లలోనైనను, బయటనైనను తెలుగువారు వచ్చిరని హిందీ భాషలో మాటాడుచున్నారు. ఇది మిగుల లజ్జాకరమగు విషయము. నేను తెలుగువాడను. సుప్రసిద్ధాంధ్ర జాతిని తలచుకొని నేనెంతయు గర్వించుచున్నాను. ప్రాచ్యదేశపు ఇటలీ భాష యని పేర్గాంచిన మృదు మధురమగు ఆంధ్రభాష యీ దేశమున మిక్కిలి ప్రమాదకరమగు దురవస్థలో నున్నందులకు నేను కంట నీరు పెట్టని క్షణ మొకటైనను లేదు. భారతదేశమునగల నా ఆంధ్రసోదరులను ఈ దేశమున ఆంధ్రభాషను సంరక్షింప వలసినదని నేను వినయపూర్వకముగ ప్రార్థించుచున్నాను. అట్లు చేయుట ఆంధ్రుల కర్తవ్యమని నేను వేరుగ చెప్పనవసరము లేదు. మాతృదేశమున గల ఆంధ్రులు తమ కర్తవ్యమును నెరవేర్చుటకు వెంటనే తగిన చర్య గావించకుండినచో ఇచ్చటగల ఆంధ్రులు అనతికాలముననే హిందూస్థానీవారలలోనో లేక తదితర భారతీయసంఘములలోనో ఏకమై పోయి తమ జాతిని భాషను రూపుమాపు దురవస్థ సంభవించగలదు. ఇప్పటికే తెలుగువారిలో అనేకులు హిందూస్థానీవారి ఆచారములను అవలంబించిరి. ఈ దురవస్థను గనుగొనినచో తన జాతిభాషలయం దభిమానముగల ఏ యాంధ్రుడు దుఃఖింపడు? మాతృదేశము నందుగల ఆంధ్రులు తమ పూర్వ చరిత్రను పూర్వ ప్రతిభను, పూర్వ పాండిత్యమును, గద్య పద్య రూపకముగ వేనోళ్ల పొగడుచున్నారు. కాని ఈ దేశమున వేల కొలది గల ఆంధ్రుల దురవస్థను తొలగించి వారికి తమభాషయం దభిమానాదరణములు పెంపుజేసి, వారిని నిజమగు ఆంధ్రులను గావించుటకు ఇప్పటికే ఆంధ్రుడును పూనుకొనకుండుట మిక్కిలి విషాదకరమగు విషయము. ఇచ్చటగల 55 వేల మంది ఆంధ్రులలో నొక్కడైనను మతబోధకుడు లేడు. పురోహితుడు లేడు. అనేక సంవత్సరముల నుండి భారతీయ మతగురువులలో ఆంధ్రుడు తప్ప తదితర జాతులవారు మా దేశమునకు వచ్చి మత ప్రబోధమును గావించుచుండిరి. వారి ప్రబోధమువలన ఆయా సంఘము లభివృద్ధి గాంచుచున్నవి. అందు ఆర్యసమాజ ప్రచారకులు గలరు. కాని తెలుగువారికి ప్రబోధమొనర్చుట కొక ఆంధ్రుడైనను, మందునకైన కాన్పింపకున్నాడు. తెలుగువారిలో తప్ప తదితర భారతీయసంఘములందు అనేకులు బారిస్టర్లు, డాక్టర్లు, శాసనసభాసభ్యులు, గొప్పవర్తకులు, ప్రభుత్వమున ఉన్నతోద్యోగులుగ నున్నారు. మహారాష్ట్రులును, తమిళులును గూడ ప్రభుత్వోద్యోగములను తదితర ఉన్నత స్థానములను బడయుచున్నారు. హిందీ భాష ప్రభుత్వ పాఠశాలలందును, తదితర పాఠశాలలందు నుగూడ నేర్పబడుచున్నది. మహమ్మదీయులకు ఒక కళాశాల గలదు. అనేక పాఠశాలలును గలవు. ఈ వివరములు తెలుగువారు తప్ప తదితర భారతసంఘములు వారెట్టి అభివృద్ధిని గాంచుచున్నారో నిరూపించుచున్నవి. వారి యభివృద్ధికి కారణము విద్యావ్యాప్తియే. విద్యా వ్యాప్తికి ముఖ్యకారణము ఆయా సంఘముల నాయకులయొక్కయు, మతగురువులయొక్కయు ప్రచారము, వారు సలిపిన ప్రబోధముమాత్రమే.

విదేశము లందుగల ఆంధ్రుల యభివృద్ధికొరకింతవరకే యాంధ్రుడైన శ్రద్ధ వహించెనా? 'ఇండియన్ రెవ్యూ' పత్రికా సంపాదకులగు జి. ఏ. నటేశను గారు భారతీయులను "విదేశములందుగల భారతీయులయెడల మీరు అశ్రద్ధ వహించెదరా." అని ప్రశ్నించునటుల "విదేశములందుగల ఆంధ్రులయెడల మీరు అశ్రద్ధ వహించెదరా" అని నేను మాతృదేశము నందుగల ఆంధ్రులను ప్రశ్నించుచున్నాను. విదేశము లందుగల ఆంధ్రుల యభివృద్ధిని కోరి తన్నిమిత్తమై పాటుపడుట మాతృదేశమునందు గల ఆంధ్ర సోదరుల ముఖ్యకర్తవ్యములలో నొకటిగ పరిగణింపవలెనని వారిని నేను కోరుచున్నాను. "మేమేమి చేయగలము" అని" వారడుగవచ్చును. ఇందులకు నే నీ క్రిందివిధముగ జవాబొసగుచున్నాను. ఆర్యసమాజము, బ్రహ్మసమాజము మున్నగు మత సమాజములవంటి సమాజమత ప్రచారకులవలన నిచట ఆంధ్రులలో ఆంధ్ర భాషాభివృద్ధి గలుగగలదనుట నిస్సంశయము. అట్టివారు యిచ్చట ఆంధ్రవిద్యాసంస్థలను నెలకొల్పుట కెంతయు తోడ్పడగలరు. ఇచ్చట ఆర్యసమాజశాఖలు నూటికి మించి యున్నవి. తమిళులకు తమిళ సంఘ మొకటి గలదు. హిందు సభ శాఖలుగలవు. ఇటువంటి సంస్థలెన్నియో ఆయా సంఘముల అభివృద్ధికి తోడ్పడుచున్నవి. ఆంధ్రులమాత్రము వర్ణనాతీతమగు దురవస్థకు పాల్పడుచున్నారని పైని వివరించిన విషయములే చెప్పక చెప్పుచున్నవి. వారి గతిని కాపుటకు మాతృదేశమందలి ఆంధ్రులు తమ శక్తి వంచనలేక పాటుపడెదరని మేము ఆశించుచున్నాము."

... ...

1929 సం॥ సెప్టెంబర్ నెల, 12 వ తేదీన మీద జెప్పినలేఖ ప్రచురింపబడిన పిమ్మట 'ఆంధ్రపత్రిక' సంపాదకులు కీ॥ శే॥ శ్రీ విశ్వదాత, దేశోద్ధారక, నాగేశ్వరరావుపంతులు గారు మారిషస్ ఆంధ్రుల విచారకర పరిస్థితిని గురించి వ్రాసి ఆంధ్రనాయకులు వారికి సహాయము చేయవలసిన బాధ్యత వున్నదని ఉద్ఘాటించిరి. నేను కోరినట్లు మారిషస్‌కు కొందరు ఆంధ్ర ప్రచారకులను పంపుటకు కూడ కొన్ని ఏర్పాట్లు చేసిరి. ఇచ్చటి పరిస్థితులను వివరముగా తెలియజేయనుని ఆంధ్రనాయకులు చాలమంది నన్ను కోరియుండుటచే "A Short History of the Indians in Mauritius with a Special Chapter on the Andhras" అను పుస్తకము వ్రాసి యివ్వ ప్రయత్నించితిని. త్రిలింగ సంపాదకులు శ్రీ వెంకటేశ్వర శాస్త్రులు ఆ పుస్తకం ఇంగ్లీష్‌లోను, తెనుగులోను ముద్రించి ఆ కాపీలు ఇండియాలో నున్న పేర్గాంచిన ఆంధ్రనాయకులకు ప్రతివారికి ఒక్కొక్క ప్రతియచ్చెదనని అంగీకరించిరి. ఈ పని జరిగినదో లేదో నేను జెప్పలేను. ఆ పుస్తకంయొక్క పది ఇంగ్లీషు ప్రతులు మాత్రము నాకు పంపినారు. నేనివియే యెఱుగుదును.

మారిషస్‌కు రావలసిన ఆంధ్రప్రచారకుల గురించి ఒకరొకరితో అనేక ఉత్తరప్రత్యుత్తరముల జేసుకొనినపిమ్మట చీరాలలోని ఒకమహాను భావుడు, 1936 సం॥లో మారిషస్‌కు వచ్చుటకు అంగీకరించెను.

అయితే దురదృష్టవశాత్తు, అప్పుడు జరుగుచుండిన 'సత్యాగ్రహం'వలన పాస్‌పోర్టు దొరకక ఆ ప్రచారకుడు మారిషస్ రాలేకపోయెను.

ఆ ప్రచారకుడు సులభముగా మారిషస్‌కు వచ్చుటకు, ఒక పాస్‌పోర్టు ఇప్పించుటకు ఇండియా సర్కారుతో నే ననేక పత్రవ్యవహారములు జరుపుచున్న సమయములో, రెండవ ప్రపంచయుద్ధము ప్రారంభించెను. అందువలన అప్పటికి ఆ ప్రయత్నము విరమించితిమి. ఇప్పుడు మా ఆంధ్రదేశము శాంతిగా నున్నదని నే జెప్పగలను.

మా హిందూమాత తన స్వాతంత్ర్యమును జయించుకొన్నది. తన స్వరాజ్యము గెల్చుకొన్నది. మహానందమేగదా!

ఆంధ్ర ప్రచారకులను శీఘ్రముగాను అవశ్యముగాను మారిషస్‌కు పంపవలసిందని మా ఆంధ్రదేశనాయకులకు మేము లక్షకోటి విజ్ఞాపనలు జేయుచున్నాము. నేను మీద దెల్పిన సంగతి 1929 సం॥న వ్రాసియున్న పత్రము లోనిది. 1929 సం॥లోనున్న దుర్దశలోనే మా ఆంధ్రులు ఈవఱకు న్నారు. మన ఆంధ్రులలో నున్న ముసలివారు మాత్రము తెనుగు జదువుచున్నారు, మాట్లాడుచున్నారు, తగినరీతిగా నడుచుచున్నారు; యువకులు, పిల్లలు తెనుగు భాష బొత్తిగా నేర్చుకొనటంలేదు.

మన తెలుగు చదువు పూర్తిగా విడిచిపెట్టినందుకు మనకు ఎట్టి హానికరపరిణామ మయ్యెనో మీకు సులభముగా దెల్పినట్లు మారిషస్‌లో జరిగిన సంగతిపై వివరముగా ఒక ఉదాహరణ మిచ్చుచున్నాను.



బాపట్ల సమీపమునగల వెదుళ్ళపల్లి అనే కుగ్రామములో స్థాపింపబడిన గాంధిజీ విగ్రహము, మందిరము.

1948 సం॥లో జరుగబోవుచున్న ఎన్నికలలో శాసనసభ్యులను ఎన్నుకొనుటకు బ్రిటిష్ ప్రభుత్వమునుండి వయోజనవోటింగ్ పద్ధతి బహుభాగ్యముగా దొరికెను. మనము మన తెనుగుభాష నేర్చుకొనక మన మాతృభాష నుపేక్ష చేయుట వలన మనకు శాసనసభలో తెనుగు 'ప్రతినిధి' లేనందున, ఈ మూడవ పెద్ద ఆంధ్రజాతిని సర్కారువారు ఒకే గీటుగీసి చంపివేసిరి. మనము మన ఆంధ్రమాతను సేవించక యున్నందుకు, మనలను రాజకీయ పౌరసత్వ హక్కుల (Political and Civic rights) నుండి బొత్తిగా విహీనపఱచినారు. అన్ని జాతులలో నున్న స్త్రీ పురుషులకెల్లను, తెనుగుభాషగాక ఇతర ఏభాషలోనైనను వ్రాయగలవారికి వోటింగ్ హక్కు యిచ్చినారు. ఏ యే భాషలలో వ్రాయుట కధికారము దొరికెనో నే జెప్పుచున్నాను: ఇంగ్లీషు, ఫ్రెంచి, హిందీ, తమిళం, ఉర్దూ, గుజరాతీ చైనీస్ భాషలు.

మన ఆంధ్ర భాషయే మాత్రము పనికి రాకపోవుట విచారకరము. హిందుస్థానివారుగాక మీద జెప్పిన అన్నజాతులు ఆంధ్రజాతికన్నా సంఖ్యలో తక్కువైయున్నారు. మన ఆంధ్ర జాతి అధికసంఖ్యగా యుండినప్పటికిని మనము మన అధికారమునుండి ఇంతమట్టుకు విహీనపఱచబడినామా? నా మతమునకు, మహా లజ్జాకరమైన విషయమిది. ఇది మనకు అవమానము గలుగజేసినది. మన ఆంధ్రజాతికి అపకీర్తి కలుగజేసినది. నేను ఈ విషయంపై సర్కారుకు విజ్ఞప్తిచేసినాను. సర్కారువారు నా యొక్క విజ్ఞాపన బ్రిటిష్ ప్రభుత్వ సెక్రెటెరి ఆఫ్ స్టేట్‌కు పంపినారు.

మా ఆంధ్రజాతి అభ్యున్నతి కొఱకు పని చేయ ఒక "ఆంధ్రమహాసభ" ను ఏర్పరచినాము. సర్కారువారు మా "ఆంధ్రమహాసభ" కు ఒక చార్టరు యిచ్చి గుర్తించినారు. నేను ఇచ్చట ఒక "Andhra Cultural Association" ఏర్పరచినాను.

శ్రీయుతులు ప్రకాశం పంతులు, డా. పట్టాభి, ఆచార్యరంగా, శంభుప్రసాద్, రామస్వామిరెడ్డి, సుందరరావు నాయుడు, రామస్వామి నాయుడు, ఇతర పెద్దలు తమ స్వకర్తవ్యమని భావించి పరదేశములలో నున్న ఆంధ్ర జనులయొక్క ఆంధ్రభాష, ఆంధ్ర నడత ఆంధ్ర కళ, ఆంధ్ర తత్వము, ఆంధ్ర చదువు వెలలేని ఆంధ్ర సాంప్రదాయము, ఎచ్చటెచ్చట మా ఆంధ్రజను లున్నను కాపాడుటకు పూనుకొనవలయును.

మా ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ కమిటీ, ఆంధ్ర మహాసభ మొదలైన సంస్థలు మాపై శ్రద్ధ కలిగియుండవలసిన దని ప్రార్థించుచున్నాము. అయితే, మారిషస్‌లో నున్న మన ఆంధ్రజనుల స్థితి గమనించుటకు తక్షణమే ఒక ప్రతినిధి వర్గాన్ని మారిషస్ పంపవలసిన దని నేను ప్రార్థించుచున్నాను.

నవల

నారాయణభట్టు

శ్రీ నోరి నరసింహశాస్త్రి

33

విజయాదిత్యుని గ్రీష్మ మందిరము

ఎండలు ముదిరెను. ఎండాకాలము రాజమహేంద్రపురములో తన ప్రభావము స్పష్టపరచుచుండెను. వడగాలి ఈ చెవినుండి యా చెవిలోని కీడ్చి పీచుచు జీవకోటులను నీరసప్రాయులనుగా జేయుచుండెను. ఆ పట్టణమును పాలించిన రాజు లెందరో మారిరి కాని ఋతురాజులు మాత్రము ఎవరికోయుక వారి ప్రభుత్వము నిర్విఘ్నముగా నెగపుచుండిరి.

పట్టణ మంతటను ప్రపలు నెలకొల్పిరి. అందు ఎండ బాధకు తాళలేనివారికి నియిన నీడయేగాక దాహము తీర్చుకొనుటకు చల్లని నీరమును మజ్జిగయు పుష్కలముగా లభించును. ప్రధానము లగు చతుష్పథములందెల్ల నట్టి ప్రపలు కలవు. అవి విశేషభాగము రాజస్థాపితములే; కాని ధనవంతులగు ధర్మాత్ములు పెట్టినవికూడ గలవు.

ప్రపాదులు ఎండబాధను కొంత యుపశమింపజేయు సాధనములే కాని యవి రాజమహేంద్రపురి ఎండబాధ నెట్లు తీసివేయగలవు! అందును సామాన్యుల మందిరములలో వాతాయనములు తక్కువ. మహాపట్టణములో యిండ్లు దగ్గర దగ్గరగా నున్నందున ప్రకృతి సిద్ధముగా నెండవేడి ఎక్కువ ప్రసరించు నచ్చటి గృహములు వాససౌఖ్యము లేకుండెను. జనములకు హృదయములలో నావేదన పెరుగ నారంభించెను.

కావిశేష ధనాఢ్యులకు ఋతుభేదమును బట్టి ప్రత్యేక సౌకర్యములు గల వేర్వేరు మందిరము లుండెను. రాజరాజును రాజబంధువులును వారి వారి గ్రీష్మ మందిరములలో ప్రవేశించిరి. విజయాదిత్యు డావాడు విశాలమగు తన గ్రీష్మ మందిరములో ప్రవేశించెను.

అది యొక చక్కని యుద్యాన మధ్యమున నున్నత ప్రదేశమున గలదు. అచ్చటనుండి గోదావరీ ప్రవాహము కనిపించును. ఆ మందిరమునకు వాతాయనము లనేకము లున్నవి. వాతాయన పార్శ్వముల జలయంత్రములనుండి నీటి తుంపురులు చల్లగా పడుచుండెను. వేడిగాడ్పు లోనికి రాకుండ ద్వారములకు వట్టివేరు తడకలు వ్రేలవేసి వానిని నిరంతరము తడుపుచుండిరి. కృత్రిమముగా నా మందిరమున నెండవేడి ప్రవేశింపకుండుట కెన్నియేని కల్పనలు చేసిరి.

విజయాదిత్యుడు సుఖాసనముపై సుఖాసీనుడై యుండెను. ఇరువురు యవన మత్తకాశినులు చామరములు పట్టి మందమందముగా విసరుచుండిరి. మరియొకతె మేనికి చందనచర్చ చేయుచుండెను. అతని మనస్సు చల్లబడి అన్నగారి ప్రేమాతిశయమును గూర్చి యాలోచించుచు శక్తివర్మను వెంటనంపెను.

నావధ్యక్షపదవి వేంగిరాజ్యములో మండలాధిపత్యము కంటె నున్నతమగు పదవి. సముద్రయానము చేయు ప్రవహణములకును నదీప్రయాణము లొనర్చు నావలకును వాహినుల తరించు తరులకును నావధ్యక్షుడే యధికారి. దేశములోనికి దిగుమతి యగు సరకు లన్నిటి మీద పన్ను వసూలు చేసి వరాహముద్రిక యతడే వేయును. అతని యనుజ్ఞాపత్రము లేనిదే నావయు నదీప్రయాణము చేయరాదు; ఏ తరియు తరింపరాదు; ఏ ప్రవహణమును బయలుదేరరాదు. ఈ శాసనము ధిక్కరించినచో క్రూరదండనకు పాత్రులగుదురు. ప్రజల ప్రయాణములు చాలభాగము నావధ్యక్షుని యధికారమునకు లోబడి యుండును. అత డాజ్ఞాపించినచో దేశములో రాకపోక లన్నియు కట్టుబడిపోవును. అందుచే నావధ్యక్షపదవి బహువిశ్వాసపాత్రుడు, అనుభవశాలి, అప్రమత్తుడు నగువాని కిచ్చునాచారము.

అట్టి యున్నతపదవి రాజరాజు తనకుమారున కిచ్చినాడు. అందులో నది యయాచితముగ ననుకొనకుండగ లభించెను. ఈ పదవి శక్తివర్మ సామర్థ్యముతో నిర్వహించిన నతనికి వేంగిరాజ్యమంతట విశేషగౌరవము పలుకుబడి రాగలదు!

అదియునుగాక ఆ సమయములో రాజధానీ నగరమునను వేంగిరాష్ట్రమునకు జరుగుచున్న గుసగుసలు విజయాదిత్యుని చెవి జేరకున్నవా? సముద్రములో తుపాను రేగుటకు ముందు కనుపడునట్లు రాజ్యమంతటను గొప్పయలజడి జరుగు ప్రయత్నములతో రాజమహేంద్రపురము కడుపు నిండి యుండెను.

అంతలో నతనికి విజయవాడ కెదురుగా ఉండవల్లి రేవునొద్ద స్కంధావారములో నాతడు కనిన స్వప్నమును స్వప్నవేత్త చెప్పిన వాక్యములు నతనికి జ్ఞప్తివచ్చెను. రాజరాజనరేంద్రుని యనంతరము తానే వేంగిరాజ్యాధిపతి కాగలడని కాదా యాతడు చెప్పినది! ఒక్కనిమేషకాల మా భావనాసౌఖ్యములో లోలుడై యానందించెను. కాని యు తరక్షణముననే యాతని హృదయము శూలముతో పొడిచినట్లయ్యెను. సాక్షాత్తు పితృతుల్యుడగు తన యన్నగారి రాజ్యమును కాంక్షించు తానెంత దుర్మార్గుడు! ఎంత కృతఘ్నుడు! ఎంత విశ్వాసఘాతుకుడు! రాజపుత్రుడు ఖడ్గము పట్టి చేసిన ప్రమాణము తప్పునా! విజయాదిత్యుడు రాజరాజుతో సంధి చేసికొనినప్పుడు ఖడ్గము పట్టి రాజరాజునకును అతని సంతతికిని విశ్వాసపాత్రుడై సేవ చేయునట్లు ప్రమాణము చేసెనే! అట్టియెడ అన్నగారి రాజ్యపదవియందు లోభము కలుగుట—ఒక్కనిముషము మానసికముగానె యినను—ఎంత నీచము! ఛీ!— అతని దేహము అప్రయత్నముగా జలదరించెను!

చామరము వేయుచున్నవారిలో నొక యవనయువతి యాది గమనించి 'జలయంత్రములోని శైత్యము తగ్గింతునా?' అని ప్రశ్నించెను.

'అవసరములే'దని విజయాదిత్యు డుత్తరమిచ్చి దేహమును ప్రయత్నపూర్వకముగా స్వాయత్త మొనర్చుకొనెను. అప్పుడు ప్రతీహారి వచ్చి మల్లప్పరాజపుత్రుడు దర్శనార్థము వేచియున్నాడని నివేదించెను. కొంచె మాశ్చర్యపడుచు వెంటనే యాతని ప్రవేశపెట్ట ననుజ్ఞ



70,000 ఎన్. జి. ఓ.లతో సమ్మెచేసిన అధ్యక్షులు జగదీశయ్యర్ గారు

అట్టి సమయములో నావధ్యక్షునికి చాల పని కలుగును. అత డా సమయమున తీవ్రముగా జాగరూకుడై విధి నెరవేర్చనిచో అల్లరి యడచుట సాధ్యము కాదు. విశ్వాసపాత్రులగు రాజభటులకు శీఘ్రగమనమునకు సౌకర్యములు సంపాదింపవలెను. రాజశత్రువులగు విప్లవకరులకు అడుగు కదల్పకుండ జేసి, ప్రమాదవార్తలు ప్రాకకుండ నరికట్టవలెను. ఈ క్లిష్ట పరీక్షాసమయమున శక్తివర్మపై నీ భారముంచుట ఆలోచించిన కొలదియు విజయాదిత్యునికి సంతోషముతో పాటు కొంత భయముకూడ కలిగించెను. శక్తివర్మ విధి నిర్వర్తింపనిచో నెంత ప్రమాదము! యువరాజుపై నీ భార ముంచక తన కుమారునిపై మహారాజీ భారమెందు కుంచినాడు?

ఈ స్థితిగతులలో యువరాజును చోళరాజ్యమునకు పంపుట శుభమే. కీడెంచి మే లెంచుట రాజనీతి. రాజమహేంద్రపురిలో నుపద్రవమేదేని సంభవించి రాజరాజునకు, యువరాజునకు నొక్కేసారిగా నపాయము కలిగిన ప్రమాదము కాదా! ముందు యువరాజును సురక్షితముగా కాంచీపట్టణము చేర్చుట క్షేమమే. అయినను అయినను ఇట్టి విపత్సమయములో నపాయము నెదుర్కొనుట నేర్చుకొననిచో యువరాజు మరెప్పుడు నేర్చుకొనును! ఈ వేంగిరాజ్యమును అవిచ్ఛిన్నముగా మూడుతరములు పాలించినవారెవరు?

యొసంగెను. ప్రతీహారి మల్లప్పను ప్రవేశపెట్టి నిష్క్రమించెను.

ఇప్పుడు మల్లప్ప యథాప్రకారము స్వస్థుడై యుండెను. విజయాదిత్యుని వయస్సునకును పదవికిని అర్హమగువిధమున నతనికి మల్లప్ప వంగి నమస్కరించెను. విజయాదిత్యునిచే ననుజ్ఞాతుడై యాత డాసన మలంకరించెను.

కుశలప్రశ్నాదిక మైనది. మల్లప్ప యిట్లనెను "ఇన్నాళ్ళకు శక్తివర్మ శక్తికి అర్హమగు నుద్యోగము లభించినది. మా కందరికి నందుకెంతయు నానందమైనది. మీ కుమారునికి గౌరవము లభించుట మాకు లభించినట్లే మా సోదరులమందరము భావించి యానందించుచున్నాము."

ఆమాటలకు విజయాదిత్యుడు సంతోషముతో పొంగిపోయెను. కాని చిరకాలాభ్యస్తమగు నాత్మనిగ్రహముతో పొంగుకనుపరపక, "అపురైన మీ రానందించుటలో వింత యేమున్నది! కాని యత డా పదవి నిర్వహించినప్పుడు గదా మన బోటి యాప్తుల మెక్కువ సంతోషించునది!" అనెను.

మల్లప్ప: "అందుకు సందేహమా! పితృసహజమైన యాధైర్యముతో మీ రట్లనుచున్నారు. కాని శక్తివర్మకును మీకును తలచుకొన్నచో సాధ్యముకానిదేమున్నది! సాక్షాత్తు మీ రిరువురు రాజరాజునకును యువరాజునకును తుల్యులాయెను!"

వెంటనే విజయాదిత్యుడు సవరించెను, "అంతమాట స్తోత్రములోకూడ ననరాదు. ప్రభువులతోడను ప్రభుపుత్రుని తోడను సామ్యమెంతవారికి గూడ కూడదు!"

ఆనాడు మల్లప్ప సంభాషణ మంతయు నా తీరుననే యుండెను. విజయాదిత్యుని పలుకులు గూడ నా విధముననే అవకాశ మీయకుండ నుండెను.

మల్లప్పకు అశ్వమెక్కుటలో గలిగిన ప్రమాదముచే కలిగిన బాధ తచ్చికిత్స విషయములు విజయాదిత్యుడు ప్రశ్నించెను. మల్లప్ప యా సంగతులు వివరించి తనకు కలిగిన ప్రాణాపాయము కేవలముగా సంఘారామము లోని వైద్యులు పోసిన ప్రాణముల వలననే తప్పినట్లు చెప్పెను. మరియు—

ఆ అశ్వము తెచ్చిన సైంధవుడు, పాపము, తస్కరుడు కానేకాడట! సంతకు వచ్చిన యశ్వవర్తకుని యశ్వశిక్షకుడట! రాజానుమతితో కేవలము క్రీడార్థము వచ్చిన వానిని తస్కరునిగా బంధించి యింత కాలము నధికరణస్థానమునకు గూడ రాకుండజేయుట విదేశవర్తకుల కలజడి కలిగించుచున్నది. ఇది రాజరాజులకు మనవి చేయవలె నని యున్నది." అనెను.

"మంచిది! ధర్మకరణమునకు రాజరాజనరేంద్రులు వెనుదీయువారు కారు. నేను చిన్నరద!" నుండి యెరుగుదును గదా! ఎప్పుడు నింతేము అని విజయాదిత్యుడు ధైర్యము చెప్పెను.

మల్లప్ప: "నిజమే కాని రాజరాజుల మతి విరుచువారున్నారు. వా రందరకు నట్టి ధర్మబుద్ధి యున్నట్లు తోచుటలేదు. చూడరాదా! యువరాజు ప్రమాద మని మా సోదరు లందరు కన్నులార చూచి చెప్పుచున్నదానికి మా సోదరులలో గాండీవివంటి వానిని శిశుపాలు చేసిరి!— ఈ సందర్భమున నా కేమి చేయవలెనో తోపకున్నది."

విజయా: "ఆ విషయము మీ కంత బాధ కలిగించుటకు కారణ మేమి?"

మల్లప్ప: అతడు "నిర్దోషి యని నాకు సంఘారామములో చికిత్స నొందుచుండుగా నిశ్చయముగా తెలియ వచ్చినది. ఆ సైంధవ వర్తకుడు తన యశ్వశిక్షకాగ్రేసరుడు లేనందున నశ్వము లన్నియు నీరు మేత ముట్టక క్షీణించిపోవుచున్నవని ఘోష పెట్టని దినములేదు. జనఘోష యాలకింపనిచో మనకు మాత్రము శుభమా!"

విజయా: అట్లగుచో నా విషయము మీరే రాజరాజులతో ప్రస్తావింపక పోయితిరా? ఇన్నాళ్ళు నపరాధిని అధికరణస్థానమునకు తేకుండుట మాకును వింతగనే యుండును. కాని యందేదో కీలక ముండవచ్చును!"

మల్లప్ప: "ఏమియు లేదు. నిర్లక్ష్యము! నైర్ఘృణ్యము!"

విజయా: "ఐనచో మీ రావిషయము వెంటనే రాజరాజులకు నివేదించుట యుత్తమము! ఆలసింపవలదు!"

(19-వ పేజీ చూడుడు)

ప్రపంచ సుస్థిరతకు అమెరికా ప్రణాళిక

లూయీ ఫిషర్

ఫ్రాన్సు, ఇటలీ, బర్మా, తదితర దేశాలలో కమ్యూనిస్టులకు ప్రభుత్వంలో స్థానం చిక్కనందుకు అమెరికన్ అధికారవర్గాలు చాలా సంతోషించాయి. ఈ బహిష్కరణ కొనసాగేందుకు వాళ్లూ (అమెరికన్ ఉద్యోగులు) తమ తమ శక్తులను వినియోగించారు. కాని ఇంతే కాదు. అభివృద్ధినిరోధక రాజకీయపక్షం వాడైన, జనరల్ నెపోలియన్ జర్వా గ్రీకు మంత్రి వర్గంలోకి రాకుండా వెనుకకు తగ్గేందుకు కూడా కావలసినంత పనీ చేశారు.

అతివాదులైనవారు, ఎరుపు కానీ, నలుపు కాని, మరే బూడిదశాఖ వాళ్లైనా కానీ; విదేశ ప్రభుత్వాలు తమ అండను నిలుపుకో కూడదని ఉద్బోధించటమే, తన విధానంగా పెట్టుకున్నాడు, అమెరికా రాజ్యాంగ కార్యదర్శి జార్జిమార్షల్. వాషింగ్టన్ అధికారులు మాధ్యస్థ ప్రాబల్యమైన ప్రభుత్వాలనే ఆదరిస్తున్నారు. సంయమవిధానులైన మాధ్యమికుల చేతుల లోనే, రాజకీయాలకు స్థావరం చిక్కుతుందని, తద్వారా ఆర్థిక స్థావరాన్ని అమెరికాసహాయంతో నిర్మించుకో వచ్చుననీ, వారి వాదన.

ట్రూమన్ ప్రభుత్వ ఉన్నత అధికారవర్గాలు సూచించే ఆచరణ మిది: రాజకీయ తరంగ ఫలకంలో మధ్యమస్థాయి చూసుకొని కొద్దిగా వామపక్షానికి మొగ్గి, కమ్యూనిస్టేతర భావుకుల నందరిని కూడకట్టుకు రావటం. మళ్ళీ మధ్యకి జరిగి కొంత కుడిపక్షానికి మొగ్గి, కమ్యూనిస్టేతర వామపక్షీయులతో కలిసి పని చెయ్యటానికి సిద్ధంగా ఉన్న వాళ్లను కూడకట్టుకొని రావటం. ఇల్లా, కుడి ఎడమల సమన్వయం చేసుకొని, మాధ్యమిక స్థాయి నందుకోటం.

ఉదాహరణకు: ఈ ఆచరణ ప్రకారం, ఫ్రాంసులో, కమ్యూనిస్టులకూ, డీ గాల్లి పక్షీయులకూ కూడా, స్థానం లేకుండా పోతుంది. అసలు ఇతరులందరూ అపోహ పడటమేతప్ప, అమెరికాకు డీగాల్లి మూకమీద సానుభూతి ఏ మాత్రమూ లేదు. బ్లమ్ సోషలిస్టు అయినప్పటికీ, డీ గాల్లి ధనిక వాదం వాడైనప్పటికీ, డీ గాల్లి కన్నా, లియోల్ బ్లమ్మే అధికారంలో ఉండాలనే వాషింగ్టన్ వర్గాలు వాంఛిస్తాయి.

అతివాదు లెటువారైనా, హింసో విధానాలకు పూనుకొంటారనీ, అంతర్యుద్ధ ఫలితం తప్పదనీ గట్టి నమ్మకం ప్రాపకంగానే అమెరికా తన ఈ విధాన మవలంబిస్తోంది. అదీ కాక, అతివాదులు, తమ ప్రతివాదుల నందరినీ అణిచేసి నియంతృత్వానికే దోవ తీస్తారు.

ఒక కొమ్మున అతివాద పక్షం పెరగటంతో రెండవ కొమ్మున అతివాద పక్షంకూడా అంత బలీయంగానే పెరుగుతుందని, నవీన చరిత్ర మన అనుభవానికి తెచ్చింది. ఉదాహరణకు గ్రీసులో రాజును మళ్లీ సింహాసనంమీద కూర్చోపెట్టేటప్పటికి, కుడిపక్షం ప్రాబల్యం హెచ్చింది. వెంటనే అటు కమ్యూనిస్టులకు అవతల కొమ్మున బలం బాగా చిక్కింది. తత్ఫలితంగా ఈనాటి నిరంతర అంతర్యుద్ధం సాగివచ్చింది.

అసలన్నిటికన్నా కూడా, విదేశాలలో, అంతర్యుద్ధము, అంతః కలహములు, అరాచకాలు వస్తవేమో, తత్ఫలితంగా, ఆర్థిక పునర్నిర్మాణం సాగక, అమెరికన్ సౌభాగ్యానికికూడా ఘాతం కలుగుతుందేమో నన్న విషయమే అమెరికన్ ప్రభుత్వా న్నెక్కువ అలజడి పెట్టోంది. విదేశాలలో సంయమిత విధానులైన మాధ్యమిక పక్షా లొకదానితో ఒకటి సహకరించి, సహన సౌశీల్యాలతో ముందంజ వేయటం కన్నా, అమెరికన్ రాజకీయవేత్తలకు ముదావహమైన విషయ ముండదు.

దీనితోపాటుగా, ట్రేడ్‌యూనియన్ ఉద్యమాల విషయంలోకూడా, యూరప్, ఆసియా లాటిన్, అమెరికాలలోని, అమెరికావిదేశాంగ శాఖాధికారవర్గాలు చాలా శ్రద్ధవహించి జాగ్రత్తగా పరిశీలిస్తున్నాయి. ట్రేడ్ యూనియన్లు కమ్యూనిస్టుల ఆధిపత్యంలోకి పోయేపక్షంలో కూడా, సహన శీల విధానులైన మాధ్యమిక మంత్రివర్గాలకు కాలు చేయాడనీకుండా చేసి దేశం మొత్తంగా తీవ్రమైన విషమ పరిస్థితులు ఏర్పడవచ్చును.

విదేశాల ట్రేడ్‌యూనియన్ ఉద్యమాల్లో అమెరికన్ ప్రభుత్వం జోక్యం కలగ జేసుకోదు. అయితే అమెరికన్ కార్మిక సంస్థలలో కెల్లా పెద్దదయిన అమెరికన్ కార్మిక ఫెడరేషను సంస్థ, కమ్యూనిజానికి వీర శత్రువుగా నిలుస్తూ, విదేశ కార్మిక, సోషలిస్టులతో సహకరించాలని ఉద్యుక్తమై యుండటం చాలా అమెరికన్ ప్రభుత్వానికి చాలా మనశ్శాంతిగానే ఉంది. అమెరికన్ కార్మిక ఫెడరేషన్ సంస్థ, ఈ మాసంలో సమావేశమైనప్పుడు తన విదేశ కార్యాచరణను తీవ్రతరం చేసి, అన్ని చోట్లా కమ్యూనిస్టేతర కార్మికసంస్థలకు ధనసహాయంకూడా చెయ్యాలని తీర్మానించింది. పశ్చిమార్థగోళమంతటా వ్యాపించేటట్లుగా ఒక పెద్ద నూతన ట్రేడ్‌యూనియన్ ఫెడరేషనును స్థాపించి, రాంబర్టో లొంబార్డో తిడానో నాయకత్వాన కమ్యూనిస్టు ఆధిపత్యంలో ఉన్న లాటిన్ అమెరికన్ ఫెడరేషనును కలదన్నాలి అని, వీరి ప్రప్రథమమహాసంకల్పం. పెరూదేశం, లిమాలో, ఈ నూతనోద్యమ ప్రారంభం వచ్చే జనవరి 10 తారీఖున జరుగ బోతున్నది. అమెరికన్ కార్మిక ఫెడరేషనువారు, తమ ప్రతినిధి బలగాన్ని గట్టిగా సమకూర్చి, ఈ ప్రారంభ సమావేశానికి పంపుతున్నారు.

మొన్న మొన్నటిదాకా, పారిశ్రామిక సంస్థల కాంగ్రెసుకూడా, కొన్నిశాఖల నాయకత్వం మొదలైన వాటిల్లో, చాలా మటుకు కమ్యూనిస్టు ప్రభావంలోనే ఉండేది. పూర్వపు అమెరికన్, కార్మికుల ఫెడరేషన్ సంస్థకన్నా, పారిశ్రామిక సంస్థల కాంగ్రెస్, చిన్నదైనా, ప్రపంచ ట్రేడ్ యూనియన్ల ఫెడరేషను సభ్యత్వం కలిగిఉండీ, ఎక్కువ పలుకుబడి ఉంటూనే ఉంది. ప్రపంచ ట్రేడ్‌యూనియన్ల ఫెడరేషను, కమ్యూనిస్టు ఆధ్వర్యంక్రింద నడుస్తోందనే అనుకోటం పరిపాటి అయింది.

గతనాల్గు నెలల్లో, పారిశ్రామిక సంస్థల కాంగ్రెస్ యూనియన్లలో నుంచి చాలా మంది కమ్యూనిస్టు నాయకులను వెలివేశారు. ఈ పదిహేను రోజుల్లో, యునైటెడ్ ఆటో మొబైల్ కార్మిక సంస్థలోని కమ్యూనిస్టులూ, కమ్యూనిస్టు అభిమానులూ అయిన నాయకులంతా యూనియన్ సంవత్సరాంతపు ఎన్నికల్లో సంపూర్ణంగా ఓడిపోయారు. ఈ నాడు, ప్రపంచంలో కెల్లా పెద్దదయిన ఈ ట్రేడ్ యూనియన్ సంస్థకు అధ్యక్షుడు, వాల్టరు రూథర్. నలభై ఏళ్ల పైచిలుకు వయస్సు. మేధావంతుడు, కార్యకుశీలుడు, దక్షుడు; లిబరల్ సోషలిస్టు అని చెప్పవచ్చు. కమ్యూనిస్టులకు తీవ్ర ప్రతికూలుడు. ఇది ఈనాటి ఈ సంస్థరూపము.

ఇప్పటికీ పారిశ్రామిక సంస్థల కాంగ్రెస్‌లో రెండుమూడు శాఖలు కమ్యూనిస్టు నాయకత్వంలోనే ఉన్నాయి. కాని కమ్యూనిస్టుప్రవాహం తీసబట్టింది. ఇంక ప్రపంచ ట్రేడ్‌యూనియన్ ఫెడరేషనులో పారిశ్రామిక సంస్థల కాంగ్రెసు, తన పూర్వపద్ధతికి భిన్నమైన నూతన వ్యవహారకాండకు పూనుకోవలసిఉంది. ప్రభుత్వ ఉపాంగాలుగా ఉంటూన్న సోవియట్ ట్రేడ్ యూనియన్లూ, ఇతరదేశాలలోని కమ్యూనిస్టు ట్రేడ్ యూనియన్లూకూడా, ఇకనుంచీ పారిశ్రామిక సంస్థల కాంగ్రెసు, ధాటీని ఎదుర్కోవలసిఉంటుంది. వాషింగ్టన్ అధికారవర్గాలు ఈ ఉత్తేజనాన్ని బహుకుతూహలంతో పరికిస్తూన్నారు.

అసలు ఈ పారిశ్రామిక కాంగ్రెస్‌లో ఈ మార్పు కలగటానికి, అమెరికన్ కమ్యూనిస్టులు, సోవియట్ రాయబారవర్గాలూకూడా, ఉద్ధృతంగా మీదిమీదికి రావటమే ముఖ్యకారణం. ఘోరంగా అమెరికన్ ప్రాతికూల్యం మాస్కో చూపించటంతో అమెరికాలో మాస్కోకు మిత్రబలం సన్నగించింది. హెన్రీవాల్లేసుకు అనుచరబలం తగ్గటానికికూడా ఇదే కారణం.


పారిశ్రామిక సంస్థల కాంగ్రెస్ ప్రతినిధులు ఇప్పుడు ఫ్రాంసు పర్యటనంలో ఉన్నారు. తక్కిన ఐరోపీయ దేశాలకుకూడా వెళ్లనున్నారు. కమ్యూనిస్టుల కిదంత ఆశాజనకంగా కనుబట్టదు. అసలే, నూత్న తత్వంతో, కమ్యూనిస్టు ప్రతికూల విప్లవాన్ని, నానా దేశాల ట్రేడ్‌యూనియన్లలో చెలరేగ కొట్టేందుకే, పారిశ్రామిక సంస్థలకాంగ్రెస్, బహుశ్శాపజీ చేయవచ్చును. అట్లా అయే పక్షంలో, దేశాలలో అరాచక శక్తులూ, నిరోధక శక్తులూకూడా సన్నగిస్తాయి. ఈ అభివృద్ధి జరిగితే, అమెరికా పశ్చిమయూరపులమధ్య ఆర్థిక బాంధవ్యాలు బలీయమై సరళంగా నడువవచ్చు నని వాషింగ్టన్ అధికారవర్గాలు అంచనా వేస్తున్నాయి.

యూరప్ పునర్నిర్మాణానికి అమెరికా కాంగ్రెస్, పెద్ద మొత్తాలను వెచ్చించ బోతున్నది. ఇందుకు సిద్ధంగా ఉందనే విషయంలో ఏమీ అపనమ్మకాలు లేవు. కాని యూరప్‌కు జార్జి మార్షల్ ప్రణాళిక వాస్తవరూపం దాల్చి, యూరప్‌లో పరిస్థితులు కొంత దోవకు వచ్చి రావటంతో, తక్కిన ఖండాలవిషయం అమెరికా అవసరం కొద్దే ఐనా ఎక్కువ శ్రద్ధ తీసుకోంటుంది.

అమెరికాను డాలర్లు అడుగుతూన్నవారు చాలామంది ఉన్నారు. అమెరికా సహాయం అక్కర లేదనే ఏ దేశా అప్పు పుచ్చుకోకన్ని తప్పదని వత్తిడి చెయ్యటం ఏమీ ఉండదు. కాని ఇవాళ కాకపోతే మరొకనాటికైనా, కేవలం పశ్చిమయూరప్ మాత్రానికే సంకుచిత పరచుకు కూర్చుంటే, ఆదేశాల సైశాల్యము, జనసంఖ్య, దేశసంపద మొదలైన అన్ని విధాలా, చూచినా స్వల్ప భూభాగంతో తమ ఋణ వ్యాపారం సాగించుకోటం, తమ నిత్య ఖర్చులకు ఏటేటా ఋణాను వ్యవహారంగానే పరిణమించక తప్పదని అమెరికన్ రాజకీయజ్ఞులు గ్రహిస్తారు. ఆనాడు మళ్ళీ ఆర్థిక నిపుణులు, మార్షల్ ప్రణాళికను, యావత్ప్రపంచ విస్తృతంగా చేసుకొని, ఉత్తర ఆఫ్రికా, మధ్య ప్రాచ్య, ఆగ్నేయ ఆసియా, లాటిన్ అమెరికాలను కూడా కలుపుకోటం అవసరమని విధానాలు ఆలోచించవలసి ఉంటుంది. కాస్త దూరదృష్టితో, విస్తృత ప్రణాళికగా చేసుకొంటే, సంకుచిత ప్రణాళికకన్నా చివరికి చూసుకొంటే తక్కువ ఖర్చున్నూ లాభదాయకమూ కూడా అవుతుంది.


అయిన, ఈ ప్రపంచ విస్తృత ప్రణాళికను, మార్షల్ ప్రణాళిక యూరప్‌లో, ప్రప్రథమ విజయమన్నా పొందేదాకా, ఆచరణలోకి తేవడానికి, ప్రస్తుతం అమెరికన్ పౌరులు ఒప్పుకొనే మనస్థితిలో లేరు. ఈ విజయం కూడా, బైటికి పోయే అమెరికన్ డాలర్ల మొత్తంమీది కన్నా, ప్రాశ్చాత్య యూరపియన్ ప్రభుత్వాల రాజకీయ తత్వం మీదే ఎక్కువ ఆధార పడి ఉంటుంది.

"మాకు స్థావరం చిక్కేందుకు సహాయం చేయవలసిం"దని యూరప్ అమెరికా నడిగింది. "తప్పకుండా అల్లాగే సహాయం చేస్తాం. కాని, అతివాదులమురాలను తోసేసుకొని మీరే స్థావరం చిక్కించుకొంటే, ఇంకా ఎక్కువగా సహాయంచేయగల్గుతాం." అంటుంది అమెరికా. దీన్నిబట్టి విదేశ ప్రభుత్వ రాజకీయాలలోనూ, కార్మిక రాజకీయాలలోనూ అమెరికా జోక్యం కల్గించుకోటమే అమెరికన్ పరిస్థితిగా గోచరిస్తుంది. కేవలం విదేశరాయబారులు, విదేశాంగ మంత్రులూ, కూడి సంధిపత్రాలూ, ఋణాలు ఘణాలూ మొదలైన అంతర్జాతీయ వ్యవహారాలను గూర్చి, సావధానంగా మర్యాదగా కూర్చుని సంప్రదించుకొనే రోజులు పోయినాయి. ఈనాడు ప్రపంచ రాజకీయాలు కుస్తీల గోదాలుగా తయారయాయి. పరస్పరదూషణలతో వెఘ్న పుట్టించే సంకీర్ణ వాతావరణంలో, రాజకీయపక్షాలు ఓట్లకోసం పెనగులాడుకొంటూ, కార్మికనాయకులు అధికారదాహంతో రంకెలేస్తూ, మంత్రివర్గాలను పేలేస్తూ కూలుస్తూ, ఇల్లాబీభత్సంగా మురుగెత్తిపోయాయి ఈ అంతర్జాతీయ సమావేశాలు. అమెరికన్ ఎన్నికల మీద, దేశాలభవిష్యత్తులు ఆధారపడి నిలిచి ఉన్నాయి. అమెరికన్ విదేశాంగనీతి, విదేశాలలో ఎన్నికలమీద అధారపడి ఉంది. పరదేశాంతరంగికవ్యవహారాల్లో అమెరికా ప్రభావముండటం న్యాయమని ఎవరూ అనేందుకు వీలులేదు. కాని అమెరికన్ సహాయము వల్ల ఆ దేశాలు అమెరికన్ జోక్యాన్నికూడా తోసేసుకో గలిగినంత బలీయం కావాలని మాత్రమే ప్రతివారమూ ఆశించగలము. క్యూబా తదితరలాటిన్ అమెరికన్ జాతులలో, ఈ పరిణామ మప్పుడే సిద్ధించింది.



అధినివేశ శాసనసభ తొలిరోజు సమావేశానికి ఆక్టింగ్ గవర్నరుజనరల్ శ్రీ రాజగోపాలచారిగారు హాజరైనారు. రాజేన్‌బాబు, పండిట్ నెహ్రూ, వారిని సభాస్థలికి తోడుకువస్తున్నారు.

రాయలసీమ ఆర్థికాభ్యుదయము



శ్రీ కల్లూరు సుబ్బారావు, యం. యల్. ఏ.

రాష్ట్రపరిపాలనా సమస్యలలో ప్రభుత్వము వారికి బరువుగను, బాధాకరముగను నుండునది రాయలసీమలో సావర్త మేర్పడుచుకొని ప్రజల పీడించి, కృశింపజేసి, నశింపచేయుచుండు దుర్భరక్షామపరిస్థితి యొకటి. మదరాసు రాష్ట్రప్రజలు యీ ప్రాంతీపూర్వచరిత్రను వైభవమును, నేటి దుస్సహదారిద్ర్య కారణములను గ్రహించుటవసరము. ఆంధ్రావనిలో చరిత్ర ప్రసిద్ధికెక్కిన గొప్ప భూభాగ మీ రాయలసీమ. త్రేతాకాలమున దండకారణ్యప్రాంత మీ ప్రదేశమని ప్రసిద్ధి. అనాటి పంప నేటికిని పవిత్ర తీర్థముగ విలసిల్లుచున్నది. ఈ సీమలోని కిష్కింధ, శ్రీశైల, శేషాచల పర్వతములు ప్రఖ్యాతివడసిన యాత్రాస్థలములు. కిష్కింధ పర్వత పంక్తి ప్రదేశమున శ్రీమాధవ విద్యారణ్యులు విద్యానగర రాజ్యమును పావనతుంగభద్రానదీతీరమున స్థాపించిరి వారి హరిహర బుక్కరాయలు ప్రథమ పరిపాలకులు. వంశ పరంపర మారినను యీ రాజ్యము నేలిన ప్రభువులను రాయలపేర పిలుచుటాచారము. ఈ యటవీ ప్రదేశముల జీవన పదములగు పెద్ద తటాకములను, జానపదులకు నివాసయోగ్యములగు గ్రామములను, శిల్పకళాసౌందర్యస్థానములగు దేవమందిరములను, యీ రాయలవారు నిర్మించి ప్రజలసౌఖ్య సౌభాగ్యాభివృద్ధికిని సర్వకళా విసలపనమునకును, ఆధ్యాత్మికోన్నతికిని కృషి సల్పి పేర్గాంచిరి. ఆ రాయలలో పేరెన్నికగన్న పెద్ద శ్రీకృష్ణదేవరాయలు. అతని పాలన కాలమున యీ సీమ విత్తములో, విభవములో, విద్యలో, విశ్వవిఖ్యాతి గాంచిన విదేశయాత్రికుల నేకుల నాకర్షించినది వారి మన్ననల నందినది. ఆనాడు రాయలసీమ "ఆంధ్రకీర్తి, ప్రతాపములకు నిలయము. ఆంధ్రభాషాయోషామణికి అలంకారములకూర్చి నాట్య మాడించిన నెలవు. కళాకౌశలమునకును, సౌందర్యమునకును మందిరము" అని వేనోళ్ళ చాటబడినది. కాని పెరుగుట విరుగుట కొరకే! వ్యక్తియొక్క లేక దేశముయొక్క, ఉన్నతి, అవనతి, పరమేశ్వరాధీనములు. భారతదేశపరాధీనతతోపాటు యీ భూభాగము అనేక పోరాటములకు లోబడి ప్రజాపీడకు గురియైనది. విజయనగర రాజులనుండి మైసూరునకు, మైసూరునుండి నిజామునకు వారినుండి కంపెనీవారికి యీ భాగము దత్తము కాబడుటచే 'దత్తమండలము'లను పేర కొంతకాలము పిలువబడుచుండెను. ఆపేరునకు బదులు యీ దత్తము చేయబడిన భూభాగమునకు తోడుగ చిత్తూరు జిల్లా పూర్తిగా చేర్చి, (బళ్ళారి, అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు) రాయలనాటి పూర్వ ప్రసిద్ధిని, ప్రావీణ్యమును, పరాక్రమమును స్మరించి వారి జ్ఞాపకార్థముగ రాయలసీమ పేరిట యిరువది సంవత్సరములుగ వ్యవహరించుచున్నారు. ఈ సీమ వైశాల్యము 31,956 చ. మైళ్లు. జనసంఖ్య సుమారు 70 లక్షలు. ఉత్తరమున నిజాము, దక్షిణమున మైసూరు, పడమట బొంబాయి రాష్ట్రము, తూర్పున మదరాసు, తూర్పుజిల్లాలు సరిహద్దులు.

దక్కను పీఠభూమికి చెందిన ఉన్నత భాగమీ సీమ శీతోష్ణస్థితులు సమములు. వాయవ్య, ఈశాన్య ఋతుపవనము లీ ప్రదేశముల కురియవలసియున్నవి. ఇచ్చిటికి వచ్చువేళకు జీవశక్తి తగ్గి సన్నగిల్లుచున్నది. మదరాసు రాష్ట్రమున కురియు వర్షము నలుభైనాలుగు పదునులు. ఈ ప్రాంతమున మాత్రము 19 నుండి 25 పదునులకు మించదు. అయ్యదికూడ నల్పస్వల్పముగను, యొక్కొక్కప్పుడు కుంభవృష్టిగను పడుటవలన అతివృష్టి, అనావృష్టి, నిశ్చయములేని యకాల వృష్టికిలోనై, పంటలు పండక, కొంతమాత్రము పండినవి, యెండి, పలువిధ కాటకములకు గురియై ప్రజలలో కండ, కళ తగ్గి, అన్నపానాదులు లేక పరితపించుచున్నారు.

ఈ భాగమున బ్రిటిష్ పాలనా చరిత్ర, కాటక చరిత్ర తప్ప మరేమియులేదు. 19, 20 వ శతాబ్దములలోని ఈ సీమక్షామచరిత్ర చదివిన గుండె నీరగును. ప్రజలదౌర్భాగ్యమో, ప్రభువుల అనాదరణయో, యేదైనను ప్రతిరెండుసంవత్సరముల కొక కరువు తప్పినదికాదు. 19 వ శతాబ్దిలో 1804, 24, 33, 49, 64, 66 సంవత్సరములలో గొప్ప క్షామములు సంభవించెను. వానికితోడు 1876, 90, 96, 1900, సంవత్సరముల కరువులు తప్పలేదు. 20 వ శతాబ్దములో 1901 మొదలు 47 వరకు పది పెద్ద కరువులు వచ్చినవి. 42-43 సంవత్సరముల క్షామదురాగతము చెప్పశక్యముకాదు. క్షామవిచారణసంఘనివేదికలో "42 లోని వాయవ్య ఈశాన్యఋతుపవనములు చెడిపోయినందున ఈ జిల్లాలలో విపరీతమగు కరువు వ్యాపించినది. రమారమి యిరవైలక్షల ప్రజ బాధపడినది. నాలుగులక్షలమందికి మాత్రము క్షామసహాయము లభించినది. యిరవై వేల టన్నుల జొన్నలు ఈ కరువు ప్రాంతములకు పంపబడినవి. క్షామనివారణపనుల ఖర్చు 2 కోట్ల 18 లక్షలు" అని వ్రాసినారు. సంభవించిన ప్రతికరువులోను క్షామనివారణపనుల ఖర్చు, భూమిశిస్తు మినహాయింపు, ప్రభుత్వమునకు యీ శతాబ్దిలో 10 కోట్లకు మించినది. దానికి తోడు నిరాహార అల్పాహారములవలన ప్రజలకు సంభవించిన రోగముల ఖర్చులు మిక్కుటములు. బి. యన్. గంగూలీ చెప్పినట్లు "భారత క్షామచరిత్రలో దక్కను ప్రాంత మొక నల్లని మచ్చ." నిరంతర క్షామములకు గురియై సౌఖ్య సౌభాగ్యములు కోలుపోయి దేశము దరిద్రమైపోయినది. ఒక కరువునుండి తప్పించుకొని తెప్పరిలునప్పటికి మరియొక క్షామము మీద బడుచున్నది. ప్రజలు నిర్వీర్యులు, నిరుత్సాహులు అయినారు.

ఈ దుర్భర, దుస్సహ స్థితినుండి ప్రజల సంరక్షించి కరువులు కరవుచేయుటకు, ప్రభుత్వము వారు చేసినదేమి? చేయవలసినదేమి? అను ప్రశ్న. బొక్కసమునకు భారమైనను కోట్లకొలది డబ్బు తాత్కాలికక్షామనివారణకే వెచ్చించినారు. కరువున బాధానివారణకు యింత యెక్కువ డబ్బు అవసరమైనను అదంతయు యితర ప్రాంతములనుండి పన్ను చెల్లించు వారిపై గొప్ప బరువుగనుండునని తలంతురు. కాని శాశ్వతముగ కరువులు రాకుండచేయు కార్యక్రమము నిర్ణయించు వరకు యీ ఖర్చు తప్పదు. ఫలవంతములగు ప్రదేశములనుండి పన్నులు వసూలు చేసి, లేద ప్రాంత ప్రజల రక్షించుట ప్రభుత్వ కనీసధర్మము. కావున తగురక్షణ కార్యమునకు పూనవలెను.

మదరాసు ప్రభుత్వం వారు 1927 లో శ్రీ ఆరోగ్యస్వామి కమిటీని—1937 క్షామ నివారణ కమిటీని యేర్పరచి రిపోర్టులు వ్రాయించినారు. ఏ కార్యమునూ ఆచరణకు తేలేదు. రిపోర్టులతో విచారణలతో లాభము లేదు. బాధ్యత వహించి పట్టుదలతో పనిచేయు కార్యాచరణసంఘము కావలెను. నేటి దత్తమండల "ఆర్థికాభివృద్ధి సమితి" సలహా సంఘము మాత్రమే. దాని స్థానే వెంటనే అమెరికాలోని "టెన్నిసీవ్యాలీ అథారిటీ" వంటి సంఘమును, చట్టరీత్యా యేర్పరచి వలయు మూలధనమును, సిబ్బందిని ప్రత్యేకించి వెంటనే పనికి పూనవలయును. కనీసము 5 కోట్ల రూపాయలు నేటి నిలువయున్న రిజర్వు నిధినుండికాని, లేదా అప్పుచేసికాని విడిగా ఆ సంఘఅధికారమునకీయవలెను. 5 కోట్లపై వడ్డీ క్షామనిధినుండి యేటేట జమకట్టవచ్చును. ఏ ప్రాంతమున బీదరిక మున్నను సమిష్టి ప్రజాసౌఖ్య సౌభాగ్య సమృద్ధులకు అడ్డు తగులును. "Poverty any where constitutes a danger to prosperity every where" అను సూత్రమును మరువరాదు.

ఈ ప్రాంత సర్వవిధఆర్థికాభ్యుదయమునకు పంచవర్ష ప్రణాళికను వ్రాయుంచి అత్యవసరముగ ప్రభుత్వము వారు చేయవలసిన కార్యములు.

(a) తుంగభద్ర, సంగమేశ్వర ప్రాజెక్టులను నిర్మించి, పరిశోధనల చేయించి, తుంగభద్ర కృష్ణా జలముల పెన్నానదిలోనికి ప్రవహించునట్లు చేయుట.

(b) కడప, కర్నూలు కాలువను చక్కగా మరమ్మతు చేయించి వీలగుచోట్ల ప్రక్క కాలువల త్రవ్వించి సాధ్యమైనన్ని చెరువుల నింపుట. నిర్బంధచట్టము ద్వారా కె. సి. కెనాలు, నీరు తీసుకొనునట్లు చేయుట.

(c) పెన్నారు, కుముద్వతి, పేరూరు, మధ్యపెన్నారు, గండికోట, పాపఘ్ని, హాగరి, చిత్రావతి, సగిలేరు, మున్నగు ప్రాజెక్టులు వడ్డీరేటు గిట్టకున్నను, కట్టించుట.

(d) చెరువులు, వాటి దరువులు రిపేరీలు చేయించుటకు. T. R. S. పార్టీని వెంటనే మంజూరుచేసి పని ప్రారంభించుట.

(e) 1902 ఇరిగేషను రిపోర్టు సూచనమేరకు అన్ని యేటిగట్టులలోను పంపులనుపెట్టి నీరు తోడించి రైతుల కొసగి నీటితీర్వ వసూలు చేయుట.

(f) ప్రతి 5 ఎకరములకు ఒక బావిని త్రవ్వించు కొనటకు రైతుల ప్రోత్సహించి సగముఖర్చు సబ్సిడీక్రింద సహాయము చేయుట.

వ్యవసాయము: ఫలవృక్షముల పెంపకము: పశుసంపద

భూమి సారవంతమైనది కలదు. నల్లరేగడి, మంచి పటువగల రొట్టభూమి ఎకరముల కొలది బీడుపడినది, మిక్కుటముగ నున్నది. తుంగభద్ర మున్నగు ప్రాజెక్టుల క్రింద సాగునకు వచ్చు భూమిని సహకారపద్ధతుల మీద సాగించవలెను. అందులకు వలయు మరనాగళ్ళు మున్నగు ఆధునిక యంత్రములు ప్రతితాలూకాకు సరఫరా చేయవలయును. ఆహారపంటలకే కాక ఫలవృక్షముల కనువగు ప్రదేశము లనేకములున్నవి. కోడూరు నారింజ, పాణ్యం మామిడి, పెనుగొండ ద్రాక్ష, దానిమ్మ, హిందూపుర మజామ పేరు పొందిన ఫలము లున్నవి. వాటి పెంపకమునకు వలయు మొత్తమును కంతుల మూలమున తకావీ లోనంగి ఫలమునకు వచ్చిన తరువాత క్రమపద్ధతిని వసూలు చేయవలెను. నీళ్ళుతోడుటకు పంపులు మంజూరు చేయుట అవసరము. వర్షము తక్కువైనా యేటువాలు భూములగుటచే పడిన నీరునైనా అడ్డగించు గట్లు లేనందున భూములు నీరు పారలి నిస్సారము లగుచున్నవి. నిర్బంధముగా సాగులాయఖు భూములకు గట్లు వేయించు చట్టమును ప్రభుత్వము వారు జారీచేయవలెను. పశుసంపదభివృద్ధికి వలయు సౌకర్యము లెన్నేని గలవు. పశుపోషణాలయముల స్థాపించి పోషించుట ముఖ్య ధర్మము.

పరిశ్రమలు: గనులు

పరిశ్రమలకు వలయు ముడిపదార్థములు విరివిగా యీ భూభాగమున లభించుచున్నవి. మదరాసు రాష్ట్రములో పండు ప్రత్తిలో పాతిక భాగము, నూనెగింజలలో మూడవ భాగము యిక్కడ పండును. వాటి నుపయోగించుటకు వలయు చిన్న పెద్ద పరిశ్రమలు స్థాపించుటకు 'ఇండస్ట్రీసు బోర్డు' నేర్పాటు చేయుట భావ్యము. ఆపరిశ్రమలకు వలయు మూలధనములో మూడవవంతు ప్రభుత్వమువారు షేర్ల మూలకముగ సహాయ మొనరింపవలెను. అప్పుడు మిగత రెండుభాగము లాప్రదేశములో లభించగలవు. ఉత్తమరకపు ప్రత్తిని పండించుటకును, నూనెగింజల పరిశోధనకును శాస్త్రీయపద్ధతిని జ్ఞానార్జన చేయుటకు పరిశోధనాలయమును, కళాశాలను ప్రారంభించవలెను. ఖాదీ ఉత్పత్తికి యీ గడ్డ ముఖ్యకేంద్రము. ప్రభుత్వము వారే ప్రత్యేకశాఖను నియమించి ఖాదీఉత్పత్తిని విరివిగా చేసి వినియోగించవలెను. నూలు మగ్గములు వేనవేలిందు కలవు. వాటికి నూలు తయారుచేయించు పెద్ద పరిశ్రమలను ప్రోత్సహించుటయే కాక, వీలగుచో, చిన్ననూలువడుకు యంత్రమును యింజనీయర్ల ద్వారా తయారుచేయించి పంచిపెట్టుట ముఖ్యము.

గనులు

రాయలసీమ రత్నాలసీమ. మగగాలు మొదలు ముగ్గురాళ్ళదాకా యిందు దొరకుచున్నవి. ఏయే ప్రాంతమున యేయే రకముగు రాయి మట్టి యెందుకుపయోగపడగలదో శోధించి తెల్పుటకు భూగర్భపరిశోధన చేయించు టవసరము. అనంతపురమున స్థాపింపనున్న ఇంజనీరింగు కళాశాలలో భూగర్భపరిశోధనావిద్యకు ప్రత్యేక ప్రాముఖ్యత యివ్వవలసియున్నది.

కుటీర పరిశ్రమలు

గాజులు, కంబళ్ళు, పలకలు, కాగితములు, గంపలు, చాపలు తయారుచేయించుటకు అనువగు ప్రదేశములు యెక్కువగానున్నవి. వాటి వుత్పత్తి వినియోగములు సహకారపద్ధతుల నడపుటకు సంఘముల స్థాపించి పనికి పూనవలయును. ఈ విధముగా యెన్ని చిన్నపరిశ్రమలైనను అభివృద్ధిజేసి ప్రజల స్వయంపోషకులుగ స్వయంసమృద్ధివంతులుగ చేయతగు అవకాశము లెన్నేని కలవు.

విద్యుచ్ఛక్తి

పై పరిశ్రమల, గనుల, పంటల అభివృద్ధికి అత్యవసరమైనది విద్యుచ్ఛక్తి. మైసూరునుండియో, తుంగభద్రనుండియో వచ్చుదాక వేచియుండ నవసరములేదు. ప్రతిజిల్లాకును ఒక విద్యుచ్ఛక్తి వుత్పత్తి కేంద్రమును స్థాపించి ఆయా జిల్లాలకు వలయు దివ్యదీపశక్తిని లభింపజేయు టావశ్యకము.

ఈ కార్యక్రమనిర్వహణకు యిప్పుడే యేర్పాటు చేసియుండు కమిషనరుకు తోడు కార్యాచరణసంఘమును ప్రభుత్వము వారు వెంటనే యేర్పాటుచేసి వలయుధనము ప్రత్యేకించిన, ఈ ప్రాంత మంతయు సౌఖ్యవంతముగ, సౌభాగ్యవంతముగ, సంతృప్తికరముగ శోభిల్లగలదు. ఏ నాడు ప్రజల ఆర్థికస్థితి పెంపొందగలదో, ఆనాడు నూతనోత్సాహ శక్తి, ఉల్లాస శక్తి వర్ధిల్లగలదు.

(ఆలిండియా రేడియోవారి సౌజన్యంతో)

నేటి ప్రపంచం


మాలటోవ్

[లండన్‌లో అగ్రరాజ్య విదేశమంత్రుల సమావేశ వైఫల్యం; రష్యా తేనబబు కోర్కెలు కోరుతున్న దని బ్రిటన్ అమెరికా విదేశమంత్రుల ఆరోపణలు; పాలస్తీనాలో అరబ్ రాజ్యాలన్నీ ఏకమై నిలచి ఎంతకాలమైనా 'ధర్మయుద్ధాన్ని' సాగించాలని అరబ్ లీగ్ యుద్ధసంఘ నిర్ణయం; ఇండొనీసియాను చీల్చి పశ్చిమజావాలో 'కీలుబొమ్మ' ప్రభుత్వస్థాపనకు డచ్చివారు కుతంత్రాలు పన్నుతూ మరొక సంఘర్షణకు సైనికబలాలను సమాయత్తపరచడం; చైనా అంతర్యుద్ధంలో భీషణపరిస్థితి; కమ్యూనిస్టుబలాల తీవ్రవిజృంభణ ఇవీ ఈవారం గమనార్హమైన అంతర్జాతీయ సంఘటనలు]

మనస్సులో ఎంతో, సోదిలోనూ అంతే నని మన సామెత. అగ్రరాజ్య విదేశ మంత్రుల సమావేశం సరిగా ఇదేవిధంగా పరిణమించింది. మనస్సులో పుట్టెడు విభేదాలు పెట్టుకొని బ్రిటన్, అమెరికా, ఫ్రాన్స్, రష్యాల విదేశ మంత్రులు లండన్‌లో నవంబరు ఆఖరువారంలో సమావేశం ప్రారంభించారు. జర్మనీ ఆస్ట్రియాలతో జరగవలసిన శాంతి ఒడంబడికలను తయారు చేయాలనీ, యుద్ధ నష్ట పరిహార సమస్యలను పరిష్కరించాలనీ తద్వారా యూరప్ ఖండ శాంతికీ, ప్రపంచ శాంతికీ తోడ్పడం చేయాలనీ ఉద్దేశించారు. ఉద్దేశాలైతే ఉన్నతమైనవే. కాని, పరస్పర విరుద్ధమైన నీచ స్వార్థాలు అడ్డుపడి సమావేశం విఫలమైపోయేటట్లు చేసినవి. మూడు వారాలకు పైగా దీర్ఘ సంప్రతింపులు జరిపిన అగ్రరాజ్య విదేశమంత్రులు ఏ ఒక్క ప్రధానాంశంమీదా ఏకాభిప్రాయాన్ని సాధించలేక డిసెంబరు 15-వ తేదీ రాత్రితో సమావేశాన్ని వాయిదా వేశారు. తిరిగి ఫలానా తేదీకి కలుసుకుందా మనే నిర్ణయంకూడా లేకుండా హఠాత్తుగా చర్చ లన్నిటినీ కట్టిపెట్టి ఎవరి దేశానికి వారు చేరుకున్నారు. వాస్తవంగా అగ్రరాజ్య విదేశమంత్రుల సమావేశం జయప్రదమై వుంటే ప్రపంచం ఆశ్చర్య పడవలసి వచ్చేదిగాని భగ్నమైనందుకు ఎవరూ ఆశ్చర్య పడవలసిన అగత్యం లేదు. ఈనాడు అగ్ర రాజ్యాల మధ్య ఏర్పడిన తీవ్ర విభేదాలే, అపనమ్మకమే ఇందుకు కారణం.


* * * *

ఐక్యరాజ్య సమితి సమావేశంలో అగ్ర రాజ్యాల వీటో అధికారాన్ని పరిమితం చేయడానికి సంవత్సరం పొడుగునా సమావేశమై వివిధసమస్యలనూ సత్వరమే పరిష్కరించే ఒక ఉపసమితి స్థాపన అవసరమని అమెరికా విదేశమంత్రి జార్జి మార్షల్ ప్రతిపాదించినప్పుడే సోవియెట్ రష్యాకు, మిగతా అగ్రరాజ్యాలకూ మధ్య ఏర్పడిన మన స్పర్థలు, భిన్న దృక్పథాలు ప్రపంచానికి స్పష్టమైనవి. ఆరు నూరైనా, నూరు ఆరైనా తాము ఉపసమితిలో పాల్గొనబోవడం లేదనీ, ఉపసమితి స్థాపన ఐక్యరాజ్య సమితి ప్రణాళికలోని ప్రాథమికసూత్రానికే పూర్తిగా విరుద్ధమనీ రష్యా ప్రతిఘటించింది. బ్రిటన్ అమెరికాలు పశ్చిమ జర్మనీని బ్రహ్మాండమైన సైనికాశ్రయంగా తయారు చేస్తున్నవని, సోవియెట్ సేనాని, (రష్యన్ ఆక్రమిత జర్మన్ భూభాగంలో) మార్షల్ సోకలవస్కీ, అగ్ర రాజ్య విదేశమంత్రుల సమావేశం ఇక వారం రోజులకు ప్రారంభ మవుతుం దనగా, తీవ్రమైన ఆరోపణలు చేశాడు. విదేశమంత్రుల సమావేశంలో పాల్గొనడానికి లండన్ పోబోతూ జార్జి మార్షల్ జర్మనీపై మిత్రరాజ్య సైనికాధిపత్యాన్ని తొలగించడమనే ప్రశ్న లేదన్నాడు. విదేశమంత్రుల సమావేశంలో నే మోలటావ్, బ్రిటన్ అమెరికాలు పశ్చిమ జర్మనులో సామ్రాజ్య విధానాన్ని అనుసరిస్తూ యుద్ధప్రేరేపణ చేస్తున్న వని ఖండించాడు. ఈ వాతావరణంలో ప్రారంభమైన ఈ సమావేశం జయప్రద మవుతుందని ఎవరైనా అనుకొనివుంటే కేవలం భ్రమ పడ్డారనే చెప్పవలసి వుంటుంది. సమావేశంలో ఏ కార్యక్రమాన్ని ఏ వరసలో అనుసరించాలనే విషయం దగ్గర నుంచీ భేదాభిప్రాయా లేర్పడినట్లు స్పష్ట పడింది.

* * *

"సోవియెట్ రష్యా ప్రభుత్వం తమకూ పోలెండుకూ కలసి 1938 నాటి విలువప్రకారం 10 వేల కోట్ల డాలర్లను యుద్ధ నష్ట పరిహారం కింద కోరుతున్నది. ఈనాటి విలువ ప్రకారం ఇది 15 వేల కోట్లవరకూ పెరుగుతుంది. ఈ విధంగా నష్టపరిహారం కోరడం పోట్స్‌డాంలో జరిగిన అగ్రరాజ్యాల ఒడంబడిక షరతులకు పూర్తిగా విరుద్ధం. ఇది జర్మనీని ఆర్థికంగా, రాజకీయంగా హతమార్చడమే అవుతుంది. ఈ ధోరణిలో విదేశమంత్రుల చర్చ సాగించడం వల్ల చేకూరే ప్రయోజనం శూన్యం. కాబట్టి ఈ సమావేశాన్ని నిర్నిబంధంగా వాయిదా వేయడం అవసరం," అని అమెరికా విదేశ మంత్రి జార్జి మార్షల్ ప్రతిపాదించాడు.

ప్రస్తుత పారిశ్రామిక ఉత్పత్తినుంచే యుద్ధ నష్ట పరిహారాలను జర్మనీ, ఆస్ట్రియాలవద్ద రాబట్టుకోవాలనే ప్రసక్తి యాల్టా సమావేశంలో గాని, పోట్స్‌డాం సమావేశంలో గాని రాలేదనీ, బ్రిటిష్ ప్రభుత్వం ఎందుకు ఎన్నడూ సమ్మతించి వుండలేదనీ బ్రిటిష్ విదేశమంత్రి ఎర్నెస్ట్ బెవిన్ రష్యా వాదనను ఖండించాడు. జర్మనీని ఆర్థికంగా నాశనం చేయడం తమ ఉద్దేశం కాదనీ, తమ దేశంలో తమకు తినడానికి తిండి లేక పోయినప్పటికీ వున్నదానిలోనే కొంత జర్మన్ ప్రజలకు ఇచ్చి సహాయపడ్డామనీకూడా బెవిన్ స్వోత్కర్ష చేసుకున్నాడు తమ చిత్తశుద్ధిని చరిత్రే బుజువు చేయగల దనికూడా అన్నాడు. నల్గురు విదేశాంగమంత్రులూ కలిసి మొత్తం మీద యుద్ధ నష్టపరిహారాల సమస్యమీద తమ సమావేశం భగ్నమైందనే అభిప్రాయం ప్రపంచానికి కలిగేటట్లు చేశారు.


మార్షల్

* * *

యూరప్ ఖండంలో ఓం ప్రథమంగా నాజీ జర్మనీ దురాక్రమణకు గురి అయిన దేశం ఆస్ట్రియా. ప్రస్తుతం ఆస్ట్రియా సోవియెట్ రష్యా ఆధిపత్యంకింద వున్న కారణంచేత అక్కడ వున్న అనేక యంత్రాలను రష్యను చల్లగా తమ దేశానికి చేరవేసుకున్నారు. ఆస్ట్రియావద్ద తమకు న్యాయంగా ముట్టవలసిన పరిహారంకంటె ఈ యంత్రాల విలువ ఎక్కువే వుంటుంది. ఆదేశంనుంచి యే యంత్రాలను తాము చేరవేసుకొన్నదీ చెప్పడానికికూడా సోవియెట్ రష్యా నిరాకరిస్తున్నట్లు మార్షల్ ఈసమావేశంలోనే స్పష్టపరిచాడు. రష్యా కోరుతున్న యుద్ధనష్టపరిహారవిధానాన్ని ఆమోదిస్తే, తరతరాలవరకూ జర్మనీ ఆర్థికంగా కోలుకోలేదని బ్రిటన్, అమెరికాల వాదన.

లండన్ సమావేశం యుద్ధ నష్టపరిహారాల సమస్యమీద విఫలమైనట్లు పైకి కనబడినప్పటికీ, వాస్తవకారణం మాత్రం అది కాదు. యూరప్ ఖండంపై ఆధిపత్యస్థాపనకు ఒక వైపు బ్రిటన్ అమెరికాలకూ, మరొక వైపు రష్యా మధ్యకూ ప్రారంభమైన పెనుపోటీ ఇందుకు నిజమైన కారణం. యూరప్‌ఖండంపై ఆధిపత్యానికి జర్మనీ కీలకం. మార్షల్ పథకం ద్వారా యూరప్‌ఖండాన్ని తన ఆధిపత్యం కిందికి తేవడానికి అమెరికా చూస్తున్నదనీ, ఏ విధంగానైనా, ప్రయత్నం సాగకుండా చేయాలనీ రష్యా పన్నాగం పన్నుతున్నది. జర్మనీని పూర్తిగా తమకు అనుకూలరాజ్యంగా చేసుకొని కమ్యూనిస్టు ప్రాబల్య రాజ్యకూటంలో చేర్చుకోడానికి రష్యా కుతంత్రం సాగనివ్వకుండా చేయాలని బ్రిటన్ అమెరికాల ఎత్తుగడ.

గత 70 సంవత్సరాల చరిత్రలో మూడుసార్లు దెబ్బతిన్న ఫ్రాన్సు, తమ పొరుగునవున్న జర్మనీ సైనికంగా ఎన్నటికీ తలయెత్తకూడ దని వాంఛిస్తున్నది అగ్రరాజ్యాలు పన్నుతున్న ఈ తంత్రాంగంకింద జర్మనీ నలిగిపోతున్నది. తద్వారా యూరప్‌ఖండంలో యుద్ధానంతర పునర్నిర్మాణకార్యక్రమానికి తీవ్ర ప్రతిబంధకాలు ఏర్పడుతున్నవి.

* * *

అగ్రరాజ్య విదేశమంత్రుల ఉపన్యాస ధోరణులనుబట్టి చూస్తే వారు తమ పట్టుదలను సడలిస్తారనిగాని, వారి విభేదాలు ఎప్పటికైనా పరిష్కార మవుతవనిగాని తోచదు. ఈ పరిస్థితులలో పశ్చిమ జర్మనీని ఆక్రమించివున్న బ్రిటన్, అమెరికా, ఫ్రాన్సులు తామాక్రమించిన జర్మన్ భూభాగాలను ఏకంచేసి, ఏకవిధానాన్ని అనుసరించడానికీ, రష్యాను కేటాయించడానికి ప్రయత్నం చేసే సూచనలు కనిపిస్తున్నవి. తూర్పు జర్మనీనుంచి రష్యాను ఏదోవిధంగా తరిమివేయాలనే అమెరికన్ ప్రబుద్ధులుకూడా లేకపోలేదు.

విదేశమంత్రుల సమావేశ వైఫల్యంతో అగ్ర రాజ్యాల విభేదాలు మరీ ప్రస్ఫుటమై ప్రపంచం, రష్యా అనుకూల రాజ్యకూటంగానూ బ్రిటన్ అమెరికాల అనుకూల రాజ్యకూటంగానూ రెండు శత్రుపక్షాలుగా చీలిపోయే ప్రమాదం హెచ్చిందనే చెప్పాలి. ఈ విషపరిణామం ఫలితంగా రష్యా ఐక్యరాజ్య సమితి సభ్యత్వాన్నే వదలుకొని పశ్చిమ ప్రజాస్వామ్య రాజ్యాలపై ప్రత్యక్ష ప్రతిఘటనకు దిగవచ్చు. ఇందుకు నాందిగా కమ్యూనిస్టు ప్రచారంద్వారా అశాంతిని తీవ్రతరం చేయవచ్చు. యుద్ధసమయంలో ఏకోన్ముఖ కృషి ద్వారా శత్రురాజ్యాలను జయించిన అగ్రరాజ్యాలు తమ పరస్పర విభేదాలతో ప్రపంచానికి మరొక ఘోర సంగ్రామ ప్రమాదాన్ని తెచ్చిపెడుతున్నవి.

* * *

అరబ్ లీగ్ 'యుద్ధ సంఘం' పది రోజుల పాటు ఈజిప్టు రాజధాని కైరోలో రహస్య సమావేశం జరిపి పాలస్తీనా విషయంలో తన నిర్ణయాన్ని ప్రకటించింది.

ఐక్యరాజ్యసమితి చేసిన విభజన పథకాన్ని ప్రతిఘటించడానికే తాము కృతనిశ్చయులై వున్నట్లు అరబ్ రాజ్యాల పెద్దలు అంటున్నారు. తాము కోరుతున్న ఐక్యపాలస్తీనా స్థాపన ధర్మసమ్మతమైన దనీ, న్యాయబద్ధమైన దనీ, ఎంత బలప్రయోగంచేసినా అరబ్ జాతిని అణచివేయడం అసంభవమనీ, తాము సాగించబోతున్న 'ధర్మయుద్ధం' అతిదీర్ఘ కాలం సాగి తీరుతుందనీ ఈ యుద్ధ సంఘం హెచ్చరిక చేస్తున్నది. దీనికంతకూ విభజన పథకాన్ని తలపెట్టిన ఐక్యరాజ్యసమితే బాధ్యత వహించవలసి వస్తుందిసుమా అనికూడా అంటున్నారు.

అరబ్ లీగ్ నిర్ణయంతోపాటు అమెరికన్ ప్రజాభిప్రాయంకూడా అరబ్ జాతికి అనుకూలంగా పరిణమిస్తున్నట్లు వార్తలు వస్తున్నవి. అమెరికన్ ప్రజాభిప్రాయ ఫలితంగా అమెరికన్ ప్రభుత్వాభిప్రాయంకూడా మారితే విభజన పథకాన్ని బలపరిచిన సోవియెట్‌రష్యా వైఖరి ఏవిధంగా పరిణమిస్తుందన్నదే ప్రశ్న. మధ్యప్రాచ్యంలో ఏదోవిధంగా స్థావరంకోసం తపత్రయపడుతున్న రష్యా, బ్రిటన్ అమెరికాలతో కేగాక అరబ్ రాజ్యాలతో బాహాటంగా శత్రుత్వాన్ని కొని తెచ్చుకోవలసివస్తుంది. అప్పుడు మధ్యప్రాచ్యంలో రష్యా ఆకస్మిక సంఘటనలను ఎదుర్కొనవలసివస్తే రావచ్చు. పాలస్తీనా సమస్య ఉత్తరోత్తరా ఎట్టి అంతర్జాతీయ అశాంతికి దారితీస్తుందో చూడాలి.

* * *

ఇండొనీసియా రిపబ్లికన్ ప్రభుత్వ ప్రతినిధులతో ఐక్యరాజ్యసమితి సామరస్య సంఘం యాజమాన్యంకింద ఒకవైపు సంప్రతింపులు జరుపుతూనే, డచ్చివారు రిపబ్లికన్ రాజధాని అయిన జోగ్‌జకర్తకు ఉపద్రవం తెచ్చిపెట్టడానికి జావాలో సైనిక దళాలను సమాయత్తపరుస్తున్నట్టు వార్తలు వస్తున్నవి. రిపబ్లికన్ ప్రధాని డా॥ అమిర్ షరిఫుద్దీనే ఈ విషయాన్ని ప్రకటిస్తున్నాడు. ఇంతటితో వూరుకోనక పశ్చిమ జావాలో తమకు అనుకూలమైన కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఒకదాన్ని స్థాపించడానికి సైతం డచ్చివారు కుతంత్రాలు పన్నుతున్నారు. ఇండొనీసియాకు అదనపు సేనలను పంపడానికి డచ్చి ప్రభుత్వం ఆలోచిస్తున్నదనీ, 1948 లో అక్కడ దాదాపు 84 వేలమంది డచ్చి సైనికులు వుంటారనీ డచ్చి యుద్ధశాఖామంత్రి డచ్చి శాసనసభలో ఇటీవలే ప్రకటించాడు. తమ దేశంలో డచ్చివారు యుద్ధ సన్నాహాలు చేస్తున్నారని రిపబ్లికన్ ప్రధాని షరీఫుద్దీన్ ప్రకటనను ఈ పరిస్థితులలో లవలేశమైనా శంకించవలసిన అగత్యం లేదని స్పష్టపడుతున్నది. ఒకవైపు రాజీ సంప్రతింపులు, మరొకవైపు యుద్ధసన్నాహాలు చేయడాన్ని బట్టి చూస్తే డచ్చివారు తమ సామ్రాజ్య తత్వాన్ని ఏమాత్రం వదులుకోబోవడం లేదనే విశద మవుతున్నది. ప్రస్తుతం బటేవియాలోనే మకాం వేసివున్న డచ్చి ప్రధాని డా॥ లూయి బీల్, "యుద్ధ విరమణను" ఆచరణరీత్యా కరబరచడం, శత్రు చర్యలను, విద్రోహ చర్యలను పూర్తిగా కట్టిపెట్టడం జరిగితేనేగాని, ఇండొనీసియాలో ఏ రాజకీయరాయబారాలూ ఫలించవని హెచ్చరిక చేస్తున్నాడు.

బటేవియా రేవు సమీపాన 'రెన్విల్లీ' ఓడపై జరుగుతున్న యుద్ధవిరమణ సంప్రతింపులలో ప్రతిష్టంభన ఏర్పడినట్లుకూడా తెలియవస్తున్నది. స్వాతంత్ర్య స్థాపనకై పోరాడుతున్న రిపబ్లికన్ ప్రభుత్వంపై డచ్చివారు పెద్ద పెట్టున మరొకసారి విజృంభించే సూచనలు కనిపిస్తున్నవి.

భారతదేశంనుంచి బ్రిటిష్ సామ్రాజ్యవాదులు వైదొలగినట్టే ఇండొనీసియానుంచి డచ్చి పాల

[17 వ పేజీ చూడుడు]

గొప్పవారితో గుసగుసలు

పింగళి సూరన, తెనాలి రామకృష్ణుడు, భట్టుమూర్తి

కీ॥ శే॥ శ్రీ వారణాసి శ్రీనివాసరావు

[హంపీలో విఠలాలయంలో ఉత్సవ మంటపంమీద మూడు స్తంభాల్నాను కుని పింగళ సూరన. తెనాలి రామకృష్ణుడు, భట్టుమూర్తి కూర్చునుంటారు. దూరాన్నుంచి సమస్కరించి సమీపిస్తున్న నన్ను చూచి రామకృష్ణుడు—]

రామ: రా, యింకేం కూర్చో. లేకుంటే అందరం లేచి నాల్గు స్తంభాలాట్డాం బట్టు!

నే: చిత్తం తమ సెల వెట్లాగయితే అట్లా. తమ ముగ్గురి ముఖులతుకాల్చొస్తే నదే బాగుండేట్టుంది.

రామ: నీవు వట్టి కుంకవ్; కుంకవేగాదు కొంటెవ్; కొంటెవు మాత్రమేగాదు పలువవ్ కూడాను.

నే: అదేమిటండీ మనస్సు నెంతో యేకాగ్రం జేసి యెప్పటికంటే శ్రమపడి ఉపాసిస్తే శాపనార్థాల్తో ఆరంభించారు!

రామ: శాపనార్థాలా; ఇంకా నయం! పచ్చిగడ్డి లేకుండా యెట్లా భగ్గుమంటుందో, అగ్గిదగ్గర గుగ్గిలం జేరిస్తే యెట్లాగుంటుండ చూడాలని నీకు బుద్ధి పుట్టకపోతే మమ్మల్ని ముగ్గుర్నీ ఆవ్హానిస్తావా! ఆతురక చచ్చినాళ్లకు నీవంటి భడవ దొరకలేదుకాని దొరికుంటే ఆ ముఖమంటపాన్ని నిప్పలేకుండానే తగలెట్టించేవాళ్లు.

నే: చూచారండీ సూరన్నగారూ, యెట్లా గంటున్నారో!

సూ: ఊఁ, (అని ఊరుకుంటారు)

భ: ఆయ నెప్పుడూ నంతే, వికటంగా ప్రసంగించకుంటే ఆయనకు తోచదు.

రా: అదుగో, వికటమా! ఆరంభించావ్!

భ: లేకపోతే యేమిటయ్యా? పిల్చిందానికెందుకు నాయనా అనకుండా యేమిటే...

రా: మన ముగ్గుర్నెందుకు పిల్చాడన్నా. దానికి సమాధానం లేదు. ఇన్నాళ్లనుండి ఒక్కొక్కర్నే పిలిచి గుసగుస లాడినవాడు—ఈ సారి మళ్లీ అంటున్నా, ముగ్గుర్నెందుకు పిల్చాడు? అందులో మన ముగ్గుర్ని!

సూ: మొన్నిద్దర్ని పిల్చాడు. ఇవ్వాళ ముగ్గుర్ని పిల్చాడు, దాన్లో నేముంది.

రా: నీ వెప్పుడూ గడుసుబొందవే! కవిత్వం జబితే పెద్దలంతా పోయిన పోకల్లన్నీ పరిశోధించి దొరికిన సందుల్లో దూరి కాలక్షేపం జేసి పేరు సంపాదించిన మహానుభావుడికి మాత్రం యుక్తి తోచదూ యీ పోకిర్ని సమరించడానికి!

భ: కవిత్వం జెప్పేటప్పుడు ఆ పని చెయ్యనివాడెవడు, నే నొక్కణ్ణే తప్ప.

రా: నే నట్లా చేసానని రుజువ్ చెయ్యి చూస్తా?

భ: నా బొంద, నే నేం రుజువ్ చేసేది? ఒక్క పాండురంగమాహాత్మ్యం రాసి కూర్చున్న తర్వాత.

రా: వెధవ చెత్త నొక గుట్టచెయ్యాలి కాబోలునీలాగ!

భ: నా గ్రంథాల్ను చెత్తన్నారూ! మీ బుద్ధేం మార్లా.

రా: మాటిమాటికి బుద్ధిని మార్చుకోవడానికి నే నేం నిలకల్లేని అపవిత్రుణ్ణిగాను. ఇందాక 'అట్లా చెయ్యాలి వాడెవడు నే నొక్కణ్ణేతప్ప' అంటివే, నీ వ్వెలగబెట్టిం దేమిటో చెప్పు చూద్దాం!

భ: నే జెప్పినమాదిరి కవిత్వ మెవ్వరూ చెప్పలేదు.

రా: ఏమిటదీ చిత్రకవిత్వమా? బలే బాగుంది! గారడీవాడు మదపుటేనుగు నడక సెక్కిరించినట్లుంది.

సూ: పోనిస్తురూ! అంతా ఐపోయి కొన్ని శతాబ్దాలైనా మీ యిద్దరిగోలా ఆగదే!

నే: మంచిమాట సెలవిచ్చారు. ఒక్కొక్కర్నే పిలిస్తే వారి విషయమే చెప్పిరి. ఇద్దర్ని పిలిస్తే వారాశ్తే తేల్చకపోయిరి. ముగ్గురూ ఒకరికొకరు తీసిపోయేవారుకారు, ఏవైనా నాల్గుముక్కలు చెప్తారని నే నాశపడి తమకు శ్రమిస్తే మీ సొంత ఘోషేగాని నా విషయం పట్టకనేపోయిమీకు!

సూ: నీ కెందుకు నాయనా, కావలసిందేమో అడుగు.

రా: ఉహూఁ, ఇంకేం: మేం గూడా యెందుకూ అన్నీ ఆయనే చెబ్తాడు విను. (భట్టుమూర్తితో) వెళ్దాంరా మనం.

భ: మీ రెళ్లండి నేం రాను.

నే: రామకృష్ణయ్యగారూ! క్షమించాలి కొంచెం దయచేసి నా మనవి నాలకించి నా సందేహా తీర్చండి.

రా: సరే యేమిటో వెళ్లబెట్టా యేమపు. నేనుమటుకు నాకు తోచిందంటూంటా.

భ: అనడమేమిటీ చెయ్యడానిక్కూడా రాయల్దగ్గర సెలవుపొందిన మహానుభావుడికి.

రా: నీ కెప్పుడూ అదే యేడుపు, నాకిచ్చిన వెళిలిక నీ కియ్యలేదని!

నే: చిత్తం: మీ ముగ్గుర్లో నెవరు గొప్పో చెప్పండి ముందు.

రా: (ఆశ్చర్యంతో) అరి పలవా! ఏమోయి సూరన్నా విన్నావా! వీడు వట్టిపలవ కాదు: వ్యాకరణం తగలడితే తగలడ్డది—(పండ్లు బిగబట్టి పరమపలవ!! మా ముగ్గుర్లో నెవరు గొప్పో కావాలా? నేనే గొప్ప! నేనే!! ముమ్మాటికి నేనే!!!

భ: (ఆశ్చర్యంతో) ఏమిటీ, నీ వనుకుంటే సరిటయ్యా! నలుగురూ అనొద్దూ ఆ మాట! నే నెంతమాత్ర మొప్పుకోను. నేనే గొప్పవాణ్ణి!

రా: ఏమిటీ నీ వొప్పుకోవూ! నీవూ, నలుగురు వెధవలూ ఒప్పుకుంటే అయి, లేకపోతే కాదేం? నేనే గొప్పవాణ్ణి నీకంటే! ముమ్మాటికి నంటే పనికిరాలేదుగా, ముప్పైమాట్లకు, చాల్దా మూడు వందల మాట్లకు, ఇంకా కావాలంటే మూడువేల—

భ: (చెవులు మూసుకుని) సూరనగారూ, ఏమిటీ గోల? మీ రూరుకుంటారేం?

రా: ఊరుకో కేం జేస్తా, డనమనూ చెప్తా! పైగా చెవులు మూసుకుంటున్నాడు! గెలవలాక పోతే యేముంది!

సూ: ఆగవోయ్ రామన్నా. (నాతో) నాయనా, యెవరు గొప్పో చెప్పండంటివే, గొప్పంటే దేన్లో.

నే: అదాండీ! క్షమించండి. గొప్పంటే కవిత్వంలో.

రా: మరి, దమెట్లా గేడ్చావ్ కావేం! ఎవరు గొప్పంటే కులంలోనో, శాస్త్రజ్ఞానంలోనో, శీల సంపదలోనో ధ్నోనో దన్లోనో, చివరకు ఒడ్డూపొడుగులోనో అనుకున్నా! విధవ కవిత్వంలోనా?!

భ: అదేమిటయ్యా, విధవ కవిత్వమంటావ్!

రా: కవిత్వం విధవది కాకేమిటి? ఈ కాలంలో నెట్లాగుందో చూడూ, అనాథత్వం ప్రాప్తించి. లేక ఒకప్పు డెప్పుడైనా గొప్పది కావడానికదేం వేదమూ, శాస్త్రమూ?

భ: నీ వేదాలు, శాస్త్రాలుమటుకు కవిత్వం లేకపోతే నెక్కడుండేవి?

రా: ఓరి మూర్ఖుడా! అవి కేవలజ్ఞానప్రధానాలోయ్! కవిత్వంగూడా నట్లాటదే అయితే అంతా వినరు. అయినా అబ్బాయి, దాన్లో మటుకు నే నింకొకరికి తీసిపోయేవాణ్ణి కాను.

భ: తీసిపోవడ మేమిటి, ఆయన ముగ్గుర్లో గొప్ప కవి యెవ్వడంటూంటే! ఏమండీ సూరనగారూ?

నే: అవునండీ సూరనగారూ. మీరు తేలిస్తేగాని యిది తేలదు.

రా: ఊఁ. నే నేమన్నా అంటే నిదిగో నితడు వికటున్నాండానికి సిద్ధంగా వున్నాడు. తేల్చవయ్యా తేల్చు; చూద్దాం.

సూ: (విననట్లు నన్ను చూస్తూ) నీ పడిగింది బహు క్లిష్టమైన ప్రశ్న. దానికి సమాధాన మేమా అని విచారిస్తున్నా. ప్రతివాడికి వాడ్రాసింది బహుబాగుందని, వాడే మహాకవి నని వుంటుంది. కాదయ్యా, అంటే కోప మొచ్చి గంతు లారంభిస్తాడు. కాబట్టి యే కవినీ నీ వేమాత్రంవాడవని అడిగి లాభం లేదు. అది వచ్చేతరాల్లో బుద్ధిమంతులు తేల్చాల్సిన విషయం.

రా: నీ వెప్ప డేం జెప్పినా గోడమీది పిల్లివాటంగా జెప్తావ్. బుద్ధిమంతు లేమిటి? కవిత్వం జెప్పిన కవికంటే వాడి కవిత్వబుద్ధి కలవాడెనడు? కవి కింకొకడు తీర్పుగా డెవడు, వాడికి వాడే తీర్పరితప్ప. వాడే చెప్పుకోవాలి.

భ: అవు న్నీవు చెప్పుకొన్నట్లయ్యా! ఉదయం బస్తనగంబు సేతువు హిమవ్యూహంబు చుట్టివంచినా నీకు కవిత్వంలో నెవ డెదురు, నీవె శారదవు అనుకొన్నట్లు.

రా: ఇదుగో కాకమాత్రాయా, యింకా దురదొవలా? గొక్కొ అఁ, అని చెప్పుకున్నా; మళ్లీ మళ్ళీ చెప్తుకుంటా—

నే: చిత్తం. కథావిషయంలో కథకల్పితమైతే మంచిదా, జరిగిందైతే మంచిదా.

భ: దాన్ని గురించి మేం మా వసుచరిత్రలో చెప్పామే? దానికి భిన్నముండ దనుకుంటా! ఏం సూరన్నగారూ?

సూ: మాంచి సంకటమే తెచ్చిపెట్టావీ ప్రశ్నకు సమాధానం నన్ను చెప్పమని. నీవే మన్నా వేమిటి?

భ: (ఆశ్చర్యంతో) ఏమిటే, మీ రా పద్యమే విన్లా, ఆంధ్రలోకంలో నాబాలగోపాలానికీ వచ్చునే అది!

సూ: వ్రాసి పారేయడమేగాని మా పద్యాల్జదువుకోవడమే మా కలవాట్లా. ఏమన్నావో చెప్పరాదూ?

భ: ఏమీ లేదు. కల్పనాకథ మాయరత్నమన్నా, ఆర్యకథ జాతిరత్నమన్నా, కవికల్పనతో గూడిన కథ సానబట్టిన జాతిరత్నమన్నా.

సూ: అంతేగదా, ఆవిషయం సర్వాంగీకారమే; మా రాఘవపాండవీయం, ప్రభావతీప్రద్యుమ్నం సరే, కళాపూర్ణోదయాన్నే మన్న? అయినా ఒక్కమా టడుగుతా, కేవలకల్పన సృష్టిలోనుందా అని మనమంతా కల్పనాకథను కునే దంకే ఆధారం లేకపోయినా కవి స్వానుభవనంలో నన్నా వుండి వుంటుంది. అట్లా కాని కథ నేకనైనా కల్పిస్తే వాడు బ్రహ్మకు మించినవాడౌతాడు. ప్రకృతం మా కళాపూర్ణోదయంలో నున్న పాత్రలు కొన్ని కొన్ని, ముఖ్యంగా మూలపాత్రలు ఆర్యసత్కథల్లోవే!

రా: అబ్బబ్బా! ఏం అసావాదిత్వో బ్రహ్మ అన్నారయ్యా మొనగాండ్లిద్దరు. కవికల్పన్తో గూడిన కథ మంచి దన్నారు! కాని కథయే గ్రంథన్లో వుందో చెప్పండి! ఒరేవ్! నే నిదే చెప్తున్నా; విను. ఇట్లా అక్కరమాలిన చర్చలు మీ కాలంలో నూటికి సెలగ. పాండిత్యం ఎక్కువయ్యే కొద్దీ చాదస్తం పెరుగుతూంటుంది. నీండ్ల నీమా టపెగడంకంటె యే అనుభవజ్ఞుడైన గ్రామ్యుణ్ణైనా అడిగితే చిటికలో తేలిపోయేది.

భ: ఎదటివాండ్లమాట నంగీకరించ వేం కర్మమయ్యా!

రా: నీ కెప్పుడూ అదే తెగులు, నీవంది సాగాలని; విని మావాడూరుకోలా, నీవూ ఊరుకోరాదూ. ఐనా పారబడ్డాలే. ఊరుకుంటే నిన్ను చూచేదెవరు?

భ: నీ వూరుకున్నా, నేనూరుకోక పోయినా యిద్దర్నీ ఆంధ్రమే చూచింది; యింకా చూస్తుంది.

రా: చూణ్ణీ, మళ్ళీ మళ్ళీ చూణ్ణీ! ఎంత చూచినా, ఏమన్నాడూ, ఆ రామలింగకవి లింగని కీర్తి హసించు దిక్కులక్ అన్నవాడూరికే అన్లేదని చూస్తుంది.

నే: చిత్తం. మీ ముగ్గుర్లో గర్వాన్నెవ రెక్కువ ప్రదర్శించుకున్నారు?

రా: నే నేదన్నా అనాలనీ, దాన్ని మా భట్టు కాదనాలనీ, మా సూరన్న సర్దాలనీ యీ కలాపంజూచి ఆనందించాలని, వుంటుందా నాయనా నీకు. తెలుసుకోవాల్సిన విషయాలెన్నో వుంటే వెర్రిప్రశ్న లేస్తావ్? అయినా చెప్తా పట్టు; వచ్చింది చల్లకు ముంత నెందుకు దాచాలి? నేనే ముగ్గుర్లోకి గర్విష్టిని. నాకంటే యెవరూ లేదని నేం జెప్పుకొన్నట్లెవ్వడూ చెప్పుకోలా. అయినా ఒకమాట జ్ఞాపకముంచుకో—ఏదైనా కలవాడు నాకిదుందంటే దాన్లో గర్వం లేదు.

భ: నాకిదుందికొని, యింకెవ్వరికీ లేదంటే?

రా: ఎవ్వరికీ లేనప్పు డంటేనుటుకు గర్వమే ముందీ దాన్లో?

భ: ఇదోయ్ నాయనా సరళి ఏ చిన్న విషయ మొచ్చినా వేలికి బెడితే కాలికి, కాలికి బెడితే వేలికి మెలేసి తనకున్న తర్కప్రజ్ఞంతా విసిరి మచ్చ మాపుతాడు. నీతో వాదించ లేమయ్యా బాబూ!

రా: కొందరి నాల్కకా ప్రజ్ఞుంటుంది

నే: కథల్ను జోడించడం మంచి దంటారా సూరన్నగారూ?

రా: ఆ శంకనుదీర్చమని వాండ్లనడక్కోయ్ వెర్రివాడా! కథల్ను జోడించి, జోడించి గోలెత్తి ఆంధ్రాన్ని గోలెత్తించారు మహానుభావులు: రామాయణ భారతాల్నాకరు, హరిశ్చంద్రా నలచరిత్రల్నాకరు! వీండ్ల జోడింపేమిటి, వాడెవడో మా వెనుకొచ్చిన వాడొకడు ముప్పుర్ని పేనాడు మూడుకథల్ను; మరొకడు నాల్గు పుర్లతాణ్ణు తయారు చేశాడో లేదో నాకు జ్ఞాపకం లేదూ! నన్నడుగు దాని విషయంచెబ్తా.

నే: చెప్పండి బాబూ, మేమంతా నది మంచిదా కాదా అని కొట్టుకుంటున్నాం.

రా: ఈ మాత్రానికి కొట్టుకోడానికి మీరే పాటివిమర్శకులోయ్. చెస్తా, సావకాశంగా విను:

ఉభయభాషాప్రవీణులైన పండిత కవులకు రెండు భాషల్లో రెండు మూడర్థాలో, ఇంకా యెక్కువర్థాలో గల మాటలు కనీసం కొన్నివందలైనా వచ్చుంటాయ్. పద్యరచనా చమత్కారముంటే వాండ్లు వాట్నక్కడక్కడా గుచ్చి, రెండు కథార్థాలో, యింకా యెక్కువకథార్థాలో వచ్చే పద్యాల్ను గూర్చి, నీ వన్న గ్రంథాల్ను రచించొచ్చు. కాని ఆ పద్యా లెట్లాటివైనా అర్థమైతేగాని విననింపుగా వుండవ్. వీండ్లిద్దర్ని అడుగు, కావాలంటే ప్రమాణంజేసి చెప్పమనూ, అక్కడక్కడా వీండ్లు రాసిన రెండు కథలకు సమానార్థ మిచ్చే పాడిపద్యాలు ధారాళంగా, రసవంతంగా నడిచాయో, శ్లేషించినవి నడిచాయో అయితే యీ బాధెందుకంటే యేంజెప్పను? చిత్రకవిత్వరచన్లో నిదొక భాగం. మా కింతొచ్చునని చెప్పుకోడానికి వీలైనమార్గం. పాండిత్యప్రకటన కనువైన సాధనం. అంతేగాని అందువల్ల కవి గొప్ప కవినడానికి వీల్లేదు.

నే: (మిగిల్నిద్దర్ని) ఏమండీ తమ రంగీకరిస్తారా?

రా: అడగడం గూడా యెందుకూ—

భ: మా రామకృష్ణయ్యగారొక్క సారైనా సక్రమంగా మాట్లాడినపుడు?

20-వ పేజీ చూడుడు

కథానిక:

నేను ఎవరినైతే నేం!

'వేంకటేశం'

'నేనెందుకు నవ్వుతున్నానో మీ కందరకూ తెలుసుకోవా లని ఉందన్నమాట ?'

'చచ్చిపోయేముందు ఎవడన్నా ఎందుకు నవ్వుతా డనేకదూ మీ రనుకొనేది. అవునా ?

'నాగురించి మీరేమీ ఆదుర్దా పడబోకండి డాక్టరుగారు. అనవసరంగా శ్రమపడక మీ పనేదో మీరు చేసుకోండి. మీరు ఏవిధంగానూ నన్ను బతికించలేరు. అసలు ఎవ్వరూకూడ నా చావు తప్పించలేరు. ఈ పరిస్థితిలో నన్ను ఎవరూ బతికించలేరు. ఎందుకంటే, నాకు ఒకటి కాదు రెండు బలమైన కత్తిపోట్లు తగిలాయి. ఒకటి వీపుమీద రెండోది డొక్కలోను. కండలు, నరాలు బయటకు రావటం మీకు కనుపించటంలా.........

'మీరంతా నేనెందుకు నవ్వుతున్నానో వినాలని కుతూహలపడుతున్నారన్నమాట. చచ్చిపోయే వ్యక్తికి నవ్వు తెప్పించే విషయం ఏమిటా అని మీరు ఆశ్చర్యపడుతున్నారుకదూ. నేను చెబుతాను. మీరేమీ ఆదుర్దా పడనవసరంలేదు. ఇప్పుడిప్పుడే కొంచెం జ్ఞాపక మొస్తోంది అసలు నే నెవరినో.........

'మీ రేమిటో గుసగుసలాడుతున్నారే. ఏమిటది ? ఎందుకో నవ్వుతున్నారే ? నేను చెప్పేదంతా పూర్తిగా విని అప్పుడు గ్రహించండి చచ్చిపోయేముందుకూడ నాకు నవ్వు తెప్పించిన కారణమేమిటో......

'ఇప్పటికి రెండు నెలలనుండి ప్రయత్నిస్తున్నా నే నెవరినో తెలుసుకొంటానికి. ముసల్మానునా, హిందువునా లేక సిక్కునా, బ్రాహ్మడినా లేక అస్పృశ్యుడినా, భాగ్యవంతుడినా లేక పేదవాడినా, నాది తూర్పుపంజాబా లేక పశ్చిమపంజాబా, నా నివాసస్థలం లాహోరా లేక అమృతసరా, రావల్పిండా లేక జలంధరా. నే నెవరినో నిర్ధారణ చెయ్యటానికి నేనే కాకుండా యింకా అనేకమంది శాయశక్తులా ప్రయత్నించారు. నా కుల మేమిటో, నా మత మేమిటో అసలు నా పే రేమిటో తెలుసుకొందా మని అనేక మంది అనేకప్రయత్నాలు చేశారు. కాని ఒక్కరికీ సాధ్యంకాలా. అసలు నే నెవరో నిశ్చయించు కొందామని నేనుకూడ చాల శ్రమపడ్డా. కాని ఫలితం మాత్రం కనుపించలా. ఇప్పుడు కొద్దికొద్దిగా నా పూర్వవిషయాలు గుర్తుకొస్తున్నాయి... యిప్పుడు... చచ్చిపోయే ముందు!...

డాక్టరుగారు! మీరు అంత దీక్షగా నా వంక చూడబోకండి. మీరు ఆ విధంగా చూస్తుంటే నాకు మరీ నవ్వు వస్తోంది. ఉహుం మీరేకాదు, ఈ పరిస్థితిలో నన్ను ఏ డాక్టరూ బతికించలేడు... మీరు ఎందుకు అంత దీక్షగా ఆశ్చర్యంగా నా వంక చూస్తున్నారో నాకు తెలుసు. నా గాయాలను ఎట్లా మాన్పదా మని ఆలోచిస్తున్నారు కదూ. ఈ రెండు గాయాల్లో ఏ గాయానికి ముందు కట్టు కడతారు. ఒక గాయానికి కట్టు కట్టటానికి ప్రయత్నిస్తుంటే ఒంట్లో ఉన్న నెత్తురు, కండలు, నరాలు రెండో గాయం గుండా బయటకు పోతాయి. ముందు రెండో గాయాన్ని కట్టటానికి ప్రయత్నిస్తే మొదటి గాయంగుండా పోతాయి. కాబట్టి మీ ప్రయత్నాన్ని విరమించి నా కథను, కాదు, నా పూర్వచరిత్రను కొంచెం శ్రద్ధగా వినండి....

రెండు మాసాలపాటు ఢిల్లీ ఆస్పత్రిలో ఉన్న తర్వాత నాకు తెలివొచ్చింది!

'నీ పేరు?' అన్నాడు డాక్టరు.

'నేను చాల ప్రయత్నం చేశాను. కాని 'గుర్తు లేదు' అని చెప్పవలసి వచ్చింది.'

'హిందువుడివా లేక ముసల్మానువా?' వెంటనే డాక్టరు యీ రెండో తికమక ప్రశ్న వేశాడు. కాని దీనికికూడ 'గుర్తులేదు' అని చెప్పవలసి వచ్చింది.

'నా పూర్వచరిత్ర ఏమిటో గుర్తులేకుండా పోయింది. నా కులం, నా మతం, నా యిల్లు, సంసారం అన్నీ పూర్తిగా మర్చిపోయా. అసలు నాకు పెళ్లయిందో లేదో, బ్రహ్మచారినో మరి ఎవరినో నాకే అర్థం కాకుండా పోయింది. చివరికి పేరన్నా తెలుసుకొందామని నా శాయశక్తులా ప్రయత్నించా. పేరు లేకపోతే ప్రపంచంలో నేను ఫలానా వ్యక్తి నని నిరూపించేందుకు ఆధార మెక్కడుంటుందో మీరే చెప్పండి. విచారించగా విచారించగా కొంత కాలానికి తెలిసింది—నే నెట్లా యీ ఆస్పత్రిలోకి వచ్చానో. పంజాబునుండి వస్తున్న కాందిశీకులతోబాటు నన్నుకూడ ఆస్పత్రికి తెచ్చారుట. అట్లా వచ్చినవారిలో చాలమంది ఆస్పత్రిలోనే మరణించారు. ఆ చచ్చిపోయినవాళ్ళు ఏమతస్థు లని నేను అడగ్గా హిందువులు, ముస్లింలు, సిక్కులూ—అన్నిమతాలవాళ్ళూ నని ఆస్పత్రి వాళ్లు చెప్పారు. అసలు జరిగిం దేమిటంటే లాహోరు అమృతసర్లమధ్య కాందిశీకులను మోసుకు పోతున్న రెండు రైలుబళ్ళ పట్టాలు తప్పి తల్లకిందు లయ్యాయి. ఒకరైలుబండి పశ్చిమ పంజాబునుండి అమృతసరుకు హిందూ కాందిశీకులను మోసుకొస్తోంది. రెండోబండి తూర్పు పంజాబునుండి లాహోరుకు ముస్లింకాందిశీకులను మోసుకుపోతోంది. దాదాపు రాత్రి 11 గం. సమయాన రైలు ఒకవంతెనమీద పోతూ ఉండగా పట్టాలకింద ఒక బాంబు పేలింది. వెంటనే రైలుబండి అమాంతంగా కిందపడి పోయింది. చాలమంది అప్పుడే మరణించారు. చాలమందికి గాయాలు తగిలాయి. గాయాలు తగలకుండా తప్పించుకొన్నవారిని చుట్టుపక్కలలో పొంచిఉన్న గూండాలు తుపాకులు కాల్చి చంపారు. గాయాలు తగిలినవాళ్ళు గుడ్డితనంగా తలోకదారివెంటా పరిగెత్తుకు పోయారు. ఎదురుగుండా వస్తున్న బండికికూడ గంటతర్వాత యిటువంటి ప్రమాదమే సంభవించింది. ఆ రైలుబండిలో గాయాలు తగిలిన వాళ్ళుకూడ తలదాచుకొంటానికి దొరికిన దారి వెంబడి పారిపోయారు.

'మరురోజు ఉదయం భారతప్రభుత్వ సేనలు, పాకిస్తాన్ ప్రభుత్వ సేనలు సరిహద్దువెంబడి గస్తీ తిరగటానికివచ్చి అనేకశవాలను, గాయపడి కదల లేకుండా పడిఉన్నవాళ్ళనూ చూశారు. వాళ్లల్లో ఎవరు హిందువో, ఎవరు ముస్లిమో నిర్ణయించటం బహుకష్టమైపోయింది. నేనుకూడ ఆ విధంగా గాయపడిన వాళ్ళల్లో ఒకణ్ణి. నన్ను స్ట్రెచర్ మీద అంబులెన్సుదగ్గరకు మోసుకొని పోయినవాడు చెప్పాడు నే నెక్కడ ఎట్లా పడిఉన్నానో వివరాలన్నీ. నా గుడ్డలన్నీ నెత్తురుతో తడిసిపోయాయి. నా చుట్టూ ఒకరక్తపు మడుగు తయారైంది. కొత్త సరిహద్దుప్రకారం నా కాళ్ళు పాకిస్తాన్ భాగంలోను, తల భారత దేశంలోను పడిఉన్నాయి. ఈ కొత్త సరిహద్దు వెంట అనేకమతాల, జాతులవారి రక్తం ప్రవహించింది.

'చూడు! మాలానా! దెయ్యాన్ని పట్టించే వాడిమాదిరిగా నా వంక అట్లా చూస్తావేం ? నీ మనస్సులో ఏముందో నాకు తెలుసు. నేను యిప్పుడో యింకాసేపటికో చచ్చిపోతాను. చచ్చిపోయేముందు ప్రతివ్యక్తికీ అన్ని విషయాలు తెలుస్తాయి. నేను ముసల్మాను నని చెప్పినట్లయితే యిస్లాం మతమును అనుసరించి నా అంత్యక్రియలు జరుపుదా మని ఆలోచిస్తున్నావుకదూ. ఏమండీ! మహాషాయ్‌జీ! మీ ఆలోచనలు కూడ నాకు తెలుసు. నేను హిందువు నని చెప్పినట్లయితే మీ ధర్మసేవక సంఘాన్ననుసరించి నా అంత్యక్రియలు జరుపుదామని ఆలోచిస్తున్నారు కదూ. బొంబాయిలో పార్శీవాళ్లు శవాల్ని బయట పారేస్తారని విన్నాను. వాటిని గద్దలు, రాబందులు పీక్కు తింటాయిట,

కాని మానవవేషంతో గద్దలు, రాబందులు బ్రతికుండగానే మనిషిని పీక్కు తింటానికి తయారవుతా ఉన్న విషయం నా కింతవరకు తెలియదు.......

'ఇక నా చరిత్ర కొనసాగిస్తా. ఎందుకంటే, నేను మీతో మాట్లాడేకాలం చాలకొద్ది. నాకు తగిలిన గాయాలు ఏమంత బలమైన గాయాలు కావు. రెండువారాలు కట్టు కడితే నయమౌతాయి. కాని నా బుర్రకు గట్టి దెబ్బ తగిలి, మనస్సు చెడిపోయిం దని డాక్టర్లు చెప్పారు. దాని మూలంగా నా జ్ఞాపకశక్తి పోయింది. దాంతో నేను ఒక అనామకుడిగా తయారయ్యా. నా పేరు నేను మర్చిపోయా. ఇంతలో నాలాంటి అభాగ్య కాందిశీకులు చాలమంది ఆస్పత్రి కొచ్చారు. ఆస్పత్రివాళ్లు నన్ను బయటకు వెళ్లమన్నారు. తలదాచుకొనేందుకు చోటైనా దొరక్క పోతుందా అని అన్వేషణ ప్రారంభించా.

'జామ్ మసీదుదగ్గర ఒక శరణాలయము ఉంటే అక్కడకు వెళ్లి కాస్త చోటు యివ్వవలసిందని శరణాలయాధికారిని ఆశ్రయించా'

'నువ్వు హిందువుడివా, ముసల్మానువా?. అని అడిగాడు ఆ అధికారి.

'నాకు గుర్తులేదు' అని చెప్పా. నాకు గుర్తు లేని మాట వాస్తవమే. నేను అబద్ధం ఎందుకు చెప్పాలి?

'ఈ శరణాలయం ముసల్మానులకోసం' అని ఆ అధికారి నన్ను బయటకు గెంటాడు.

అక్కడి ఆశ నిరాశ చేసుకొని ఎట్లా గొకట్లా ఢిల్లీకి చేరుకున్నా. ఇక్కడ యిదివరకటి శరణాలయం కంటె పెద్దదాన్ని చూశా. తలదాచుకొనేందుకు కాస్త చోటు యివ్వమని వాలంటీర్లను ప్రార్థించా.

'హిందువుడివా, ముసల్మానువా' అని యిక్కడకూడ అదేప్రశ్న వేశారు.

'నాకు గుర్తులేదు' అని నేను మళ్లీ ఆ మాటే చెప్పా.

'నీ పేరు?'

'అదికూడ నాకు గుర్తులేదు. అసలు నా కేదీ గుర్తులేదు.

'ఇంకెక్కడి కన్నా వెళ్లు. ఈ శరణాలయం హిందువుల కోసం'.

'ఈ విధంగా ఒక చోటునుంచి యింకో చోటికి తిరిగా. హిందువులకోసం శరణాలయా లున్నాయి. మహమ్మదీయులకోసం శరణాలయా లున్నాయి. కావి మానవులకోసం మాత్రంలేవు.

'ఆ రాత్రి శరీరంబాగా అలవటంచేత నడవటానికి ఓపికలేక ఒక సిక్కు సర్దారు బంగళా ముందు స్పృహతప్పి పడిపోయా. అతడు సెక్రటేరియట్‌లో ఒక చిన్న ఆఫీసరు. అతడు నన్ను లోపలకు తీసుకుపోయి రొట్టె, పాలు యిచ్చాడు. నాకు కొంచెం స్పృహ వచ్చిన తర్వాతకూడ నేను హిందువునో, ముసల్మానునో సిక్కునో నన్ను అడగలా. 'కులాసాగా ఉందా బాబు' అని మాత్రం అడిగాడు.

'అతని బంగళాలో నే చాలరోజులు గడిపా. నేను నా కథను ఉన్నది ఉన్నట్లు చెప్పి నే నెవరినో నాకు తెలియదన్నా అప్పటికిగూడ అతని కుటుంబము నన్ను చాల ఆప్యాయంగా చూసింది. కొన్నిరోజులతర్వాత వారి చుట్టాలు కొంతమంది రావల్పిండినుండిపారిపోయొచ్చారు, ముస్లిం గూండాలచేతిలో వాళ్ళు చాల కష్టాలనుభవించారు. వాళ్ల కళ్లఎదటే వాళ్ల బంధువులను నానాహింసలుపెట్టి అవమానాలపాలు చేశారు. వాళ్ల హృదయాలు ముస్లిములంటే అసహ్యంతో నిండిపోయాయి. ఈ కథంతా విన్నతర్వాత నాకు తెలియకుండా నేనుకూడ ముస్లిములను అసహ్యించుకోవటం మొదలుపెట్టా.'

'సర్దార్ గారు నా కథంతా, నా కే విధంగా మతి పోయిందీ, ఏవిధంగా నేను కష్టాలుపడ్డదీ వివరాలన్నీ ఆ వచ్చిన బంధువులకు చెప్పారు. పెద్దవాళ్ళు నన్ను అనునయించి నా పూర్వస్మృతిని తెప్పించటానికి చాల ప్రయత్నం చేశారు. కాని పిల్లలుమాత్రం నన్ను అనుమానంగానే చూశారు. అందులో ఒకడు యింకొకడితో యీ విధంగా చెప్పటం విన్నా: 'వాడు చెప్పిందంతా అబద్ధ మనుకో. మతి తప్పిపోయిం దని బొంకుతున్నాడనుకో. వాడు నిజంగా ముస్లిమేమో.' వాళ్ళు ఏమన్నా చేస్తారేమో నని నాకు భయం పుట్టింది.

'ఆ ఆలోచనే నన్నుకూడ వేధించుకు తింది. నేను నిజంగా ముస్లిము నేమో. ఏమో ఎవరికి తెలుసు. నేనుకూడ యిప్పుడు 'ముస్లిములు చేస్తున్నమాదిరిగా ఘోరాలు చేసినతర్వాత నాకు మతి తప్పిందేమో. నా ఘోరకార్యాలకి భగవంతుడు న న్నీవిధంగా శిక్షించాడేమో.' ఆ రోజు రాత్రే సర్దార్ యింటినుండి పారిపోయా. తిరిగి వీధులవెంట తిరుగుతున్నా. మళ్లా ఉపవాసాలు.

'ఈ శరణాలయం ముస్లిములకోసం'

'నీ వెవరు ?'

'నీ పే రేమిటి ?'

'నీ మత మేమిటి ?'


'నువ్వు ఎక్కడనుండి వస్తున్నావ్ ?'

ప్రశ్నలు ! ప్రశ్నలు !! ప్రశ్నలు !!!


-అన్నీప్రశ్నలు, ఎక్కడచూచినా ప్రశ్నలు.

'నేను అందుట్లో ఒక్కదానికీ సమాధానం చెప్పలేను. ఎందుకంటే నే నెవరినో నాకే గుర్తు లేదు. ఇక నడవలేక ఆకలి మండుకుపోతుంటే తిరిగి జామ్‌మసీదు దగ్గరకు పోయి అక్కడే కూచున్నా. ఆకలితో చచ్చిపోవటం నిశ్చయ మనుకొన్నా. స్పృహతప్పి పడిపోయా. అట్లా ఎంతసేపు పడిఉన్నానో! ఎప్పుడో ఒక్కసారి మాత్రం కళ్ళు తెరిచేసరికి నా ఎదురుగా ఎనిమిదేళ్ల పిల్లాడు నుంచొని 'లే! లే!!' అని అదే పనిగా అంటున్నాడు. 'ఇదిగో! యివ్వి తిను. మా అమ్మ నీకోసం పంపింది'. తిండి అన్న మాట వినంగానే లేవా లని బుద్ధి పుట్టిం దనుకొంటా. కాని లేవటానికి శక్తి ఎక్కడనుండి తేను ! ఆ పిల్లాడి సహాయంతోనే అతిప్రయాసతో లేచి కూచొని చపాతీలు తింటం ప్రారంభించా. ఎంత రుచిగా ఉన్నాయి ఆ చపాతీలు. భగవంతుడే నాకోసం అమృతాన్ని యీ రూపంలో పంపించినట్లుగా ఉంది. 'చిరకాలం జీవించునాయనా' అని దీవించా. కాస్తముక్కకూడ విదలకుండా అన్నీ తినివేశా. కృతజ్ఞత తెలియ జేద్దా మని అతని చెయ్యి తాకగానే 'నీకు బాగా జ్వరంగా ఉందే!

(22 వ పేజీ చూడుడు)




మద్రాస్ గవర్నర్‌గారు విశాఖపట్టణం ప్రాంతీయ ఉద్యోగ, నిర్ణయ, సలహా ఆఫీసులు చూచుటకు వెళ్లినప్పుడు తీసిన చిత్రం.



ఉద్యోగ, నిర్ణయ, సలహా ఆఫీసు ఉద్యోగులతో గవర్నర్‌గారు ముచ్చటిస్తున్న దృశ్యం.

మాజీ సైనికులచే స్థాపింపబడిన మోటారు కార్మికుల సహకార సంఘమును చూచుటకు గవర్నర్‌గారు వచ్చినప్పటి దృశ్యం.





ఆంధ్ర విశ్వవిద్యా

విశాఖజిల్లాలో గ

శ్రీ జయం

మద్రాసు గవర్నరు సర్ ఆర్చిబాల్డు నైగారు వచ్చిన దగ్గరనుండి గ్రామసీమలందు సంచారం చేసి ప్రజాక్షేమముల నారయుచు డెమాక్రెటికు గవర్నరను ప్రసిద్ధి గాంచిరి. వీరు యిట్టి మంచిపేరు సంపాదించుటే ఆంగ్ల అధికారులు పలువురు వెళ్ళిపోయినా, కాంగ్రెసు యజమానులు వీరి నింకా గవర్నరు పదవిలో నుంచుటకు కారణమయియుండును. సస్యాభివృద్ధి తోడ్పడు స్కీములు ప్రాజక్టులన్న వీరి కభిమానం మెండు. వీ రీ మాసంలో మాచ్ఖండు ప్రాజక్టు చూడబోయినపుడు వీరితో వెళ్లే అవకాశం చిక్కినందున, ఆ ఘాటీ రోడ్డుపై బోయి చూచిన విషయాలగూర్చి, చదువరులకు తెలియజేయుట యుక్తము. సిల్లేరు నదీప్రవాహం, 480, అడుగుల దిగువకు సముద్రపు హోరువంటి ఘోషతో, పడిపోతూ వుంటే ఆ గంభీరమయిన దృశ్యం చూచి ఇంజనీరు చూపిన మ్యాపుల సహాయంతో, ఆ ప్రవాహాన్ని అరికట్టి విద్యుచ్ఛక్తి తయారు చేసే పథకం యావత్తు అవగాహనం చేసుకొన్న పిమ్మట, మ్యాపులో దిగువ నెక్కడో కనపడిన పెరియారు డాము గూర్చి లేడీ నైగారు ప్రశ్నించిరి. అది అదివరకు వారు చూచిందే. అయినా ఆమె మరచినట్లుంది. తిరిగి పోవుటగూర్చి ప్రసంగించగా "నీవు చూడని డాము యీ రాష్ట్రంలో యిక లేదు" అని గవర్నరుగారు ఛలోక్తు లాడిరి. వీరివెంట, లేడీ నైగారి ప్రథమ సంబంధం కుమార్తె మిస్ స్టీవెంసనుగారును, గలరు. ఈ నవజవ్వనిక దేశపరిచయ మిదే ప్రథమం కావున, తల్లిని మించిన కుతూహలంతో అన్నీ వింతగా జూచుచుండెను.


గవర్నరుగారు సపరివారంగా, వెంట నల్గురు పత్రికా ప్రతినిధులతోగూడ బయలుదేరినందున, [illegible]రు చూచిన ప్రదేశాలకు స్కీములకు యింతక ఎక్కువ ప్రచారం వెల్లడి చేకూరును. ఇట్టి గవర్నరు సంచారాలు ప్రజల డబ్బు వృథాగా ఖర్చు చేయుటకు కారణ మని కొందర భిప్రాయ పడవచ్చును; కాని అదిపొరబాటు. ఇందువల్ల మేళ్లు గలవు. రాష్ట్రాధిపతులు వస్తున్నారంటే, అదివరకెన్నడు ఏ ఉద్యోగి సాలుకొకసారైనా పోనటువంటిరోడ్లు ముందుగ మరమ్మతు చేయబడును. అవి మేలు. అన్ని శాఖల ఉద్యోగులకు కదలిక కల్గి, చురుకు పుట్టి తమ విధులు సరిగా నిర్వర్తింపుట కవకాశ మేర్పడుతుంది. మూల బడియున్న డబ్బు కొంత చలామణలోనికి వస్తుంది. ప్రతి చోట రివెన్యూవారిపై యీ సప్లయి ల భారం పడి, వేలకువేలు ఖర్చగును. ప్రజల యిబ్బందులు ప్రత్యక్షంగా విన్న గవర్నరుగారు, తాము రాజాసభలో చెప్పినట్లు, "గ్రాంటులు పరిసమానంగా న్యాయంగా పంపకాలయేటట్లు మా చే అ వ కా శం క ల్గు ను." ఇదివరకు మం జూ రు చేసే అ ధి కా రం గవర్నరులకే యుండేది. ఇపు డది మంత్రివర్గానకు మారిపోయింది. కనుక మంత్రులకు గవర్నరే సరిగా సలహా చేయుటకు వీలుండును. మంత్రులు ఎన్నుకొన బడినవారు, ప్రాంతీయాభిమానాలు కలిగియుందురు కావున, వారి నిర్ణయాలు పాక్షికంగా ఒకప్పు డున్నచో నిష్పాక్షికంగా నిర్ణయించేందుకు తోడ్పడ గవర్నరుకి వీలుండును. వీరికి ముందుండిన యుద్ధనిధి గవర్నరు సర్ ఆర్థరు హోపుగారు, కారులో పోతూ తోరణం గట్టిన ప్రతి రోడ్డుప్రక్కన నిలపమని పైలెటు కారుకి

ఉత్తర్వు యిచ్చి, దం
వసూలు చేసేవారు.
ఆర్థరు నైగా రట్లు
చూతురు. కనుక వీరి
నెంచ వీలు లేదు.

అరక

11 తేదీ ఉదయ
మొత్తం 5 మోటార్లు
పట్నం ఉదయం కే
దేరి 6-30 కల్లా అన
హారం గ్రహించేరు.
ఏమంటే, భోజన
చేస్తారు. ఆ సమయా
అన్నీ రావలసిందే. ఆ
ఖద్దరుమంత్రులకు,
కష్టం. అనంతగిరిలో
యగు రామానుజదా
చక్కగ జేసేరు. అ
యలో ప్రభుత్వంవా
చేస్తున్న వ్యవసాయ
లించేరు. ఉద్యోగ
యం, మలేరియానిర
సరికి వేళయిపోయిన
పోయేరు. నాల్గుసం
లక్షలు ఖర్చు చేసి
యిట్లా ఖర్చు చేస్తా
మవుతుందని గవర్
ఇంకో మూడేళ్ల కగు
ఎడ్లను ప్రభుత్వంవా
తుల కిచ్చి, క్రొ
తున్నారని, క్రొ
క్రొ త్త నేల
రనియు, కాని
కుగా నేర్వ లేకునా
విందు ఫలితంగా అ
నున్న విలేఖరి యొ
వృథా కాదా; 11
నాలుగేండ్లయినా
అని విగ్రహ
నుగా
వార్థం ప్ర
స్వయంపోషకం
విలేఖరి ప్రసంగం
అరకులోయస్కీ
ప్రారంభింపబడింది.
మట్టంపైన 3064
ఏటవాలు ప్రదేశం.
సుంకరమెట్టల మీ
3921 అడుగుల ఎత్త
వంటి చల్లని ప్రదే
ఇంగ్లీషు కాయగూర
విరివిగా పండిం
వచ్చునని తలంచి.
యుద్ధం ముగియ
అన్నింటికన్న ముఖ్
టకు, సింకోనాతో,
వని కనిపెట్టిరి. అ
లోను సింకోనా
మొక్కల నారమడ
ఆ నర్సరీలో బాగుగ
నిలిచి గవర్నరుగార





మోటారు కార్మికుల సహకారసంఘ ఉద్యోగులతో గవర్నర్‌గారు ముచ్చటిస్తున్న దృశ్యం.

ంయ స్నాతకోపన్యాసము.

వర్నరునై పర్యటనము

ంతి కిరీటిరావు

డలు వేయించుకొని డబ్బు
వారి సంచారానికి సర్
చేయక చూడదలచినవే
ంచారం వృథా వ్యయంగా

ం లోయ


ం గవర్నరుగారి పార్టీ
, ఒక జీపుతోగూడ విశాఖ
30 గెం. మంచులో బయలు
తగిరి బంగళాచేరి అల్పా
దొరలతో వ్యవహారం
లహారాలు వేళ తప్పకుండా
ని కెక్కడుంటే, అక్కడికి
పకడ్బందీ అలవాటులు మన
కేశగవర్నరులకు రావడం
అరకులోయ ఆర్. డి. ఒ.
సుగారు అన్ని ఏర్పాటులు
నుండి 1 గం. అరకులో
రు నాల్గుసంవత్సరాల నుండి
కృషి గవర్నరుగారు పరిశీ
ల నివాసాలు, వైద్యాల
ధక యత్నాలు గమనించే
ందున, పొలాలు చూడలేక
వత్సరాల నుండి రూ. 11
వారు కదా, ఎంతకాలం
, ఎప్పటి కిది స్వరుంపోషక
రుగారు ప్రశ్నించేరు.
నని, యిప్పుడు 30 జతల
రు. పెంచి కోయరయి
ద్ధతులతో సాగుచేయించు
యులును సాగు నేర్చుకొని
గు చేయుచున్నా
గొండజాతివారగుటచే చురు
రని, జవాబు వచ్చెను.
ధిగమించిన ఉత్సాహంతో
కడు వెంటనే, "యిదంతా
క్షలు ప్రజల డబ్బు వెచ్చించి
మిప్పటికేమి లాభించలేదు"
ు. జయపురం దివా
క్రం పరిశీల
లుగై దేండ్లలోగా
గల" దని నుడువుటతో
చాలించెను.
ము యుద్ధసమయంలో
అరకులోయ సముద్ర
అడుగుల ఎత్తులోనున్న
దీన్ని చేరుటకు అనంతగిరి,
మగా పోవాలి. ఈఘాటీలు
నయున్నవి. ఉదకమండలం
ం కనుక, యిక్కడనూ
లు, బంగాళాదుంపలు
ద్ధకాలంలో సప్లయి చేయ
కాని ఆ పని జరిగేలోగా
చే ఆ లాభం పోయింది.
వ్యంగా క్వినైను పండించు
టలు యిక్కడ పెంచవచ్చు
ంతగిరిలోను, సుంకర మెట్ట
మొక్కల నర్సరీలు, కాఫీ
లు గవర్నరుగారు చూచిరి.
పూచిన బంతిచెట్టు ప్రక్కన
ఆ పూవుల వాసన కబ్బుర

మంది, "ఎక్కడిదీ వాసన" యని ప్రశ్నించేరు. అది సింకోనావాస నని భ్రమిసిరేమో ! కాదు బంతిపూవులనని చూపగానే, ఒకటి కోసి కోటున తగిలించుకొనిరి. సికకోనాకన్న అడవిబంతే వారి నెక్కువ ఆకర్షించినట్లుంది. అరకు లోయ యందు, ఈ స్కీము రాకముందు మలేరియా చావులు నూటికి 35% ఉండగా, యిప్పుడు 0.7 గం వు. ఇచట మలేరియాను జయించినట్లే అచటి ఉద్యోగులు చెప్పుచున్నారు. ఈ మాట నమ్మవచ్చు. ఎందుకంటే, నిరుడు నే చూచి నప్పుడు కుటుంబాలతో లేని ఉద్యోగులు ఇపుడు కుటుంబాలతో నున్నారు. అక్కడ కాలనీలో స్థాపించిన పాఠశాలయందు 55 గురు బిడ్డలలో 11 గురు ఉద్యోగుల బిడ్డలే యని ఉపాధ్యాయుడు తెలిపెను. ఉద్యోగుల బిడ్డలు, కోయల బిడ్డలని వ్యత్యాసంగా చూడరా దని గవర్నరు సలహా చెప్పెను. లోయలో పెరిగిన కాయగూరలన్ని ఆంధ్ర విశ్వ విద్యాలయానికి పోతున్నాయి. ఇంక ఎన్ని పండినా చెల్లే అవకాశం వుంది.


బోసుగెడ్డ అను గ్రామంలో లోయఅధి కారులు ఒక సహకారసంఘం స్థాపించి, కోర ప్రజలకు చేతి పరిశ్రమలు నేర్పు చున్నారు. వారికి పరిశుభ్రంగానుండుట, గుడిశెలు వేసు కొనుట, విస్తళ్ళు కుట్టుట నేర్పు చున్నారు. ఈ ఆదర్శగ్రామంలో గుడిశలను లేడీ నై అతిశ్రద్ధగ చూచెను. ఆమె కుమార్తె విస్తళ్లు కుట్ట ప్రయత్నించి, కుటెక్స గోళ్లకు స్వాదీనం కాక విడచెను.

ఎక్స్చేంజి శాఖ

మదరాసుగవర్నరుగారు గతవారం విశా పట్నం సంచారం చేసినపుడు అచటి ఎంప్లాయి మెంటు ఎక్స్చేంజీ శాఖకు చెందిన పి. కృష్ణా రావు (రీజియనలు పబ్లికు రిలేషన్సు ఆఫీసరు). డబల్యు ప్రహోదు (మేనేజరు), కెప్టను డి. వి. ధరను, అడిషనలు అడ్వయిజరు, రామసుబ్ర హ్మణ్యం, అసిస్టెంటు మేనేజరుగార్లు సన్మా నించి, మరలివచ్చిన సైనికులకు ఉద్యోగాలిప్పిం చుట, సహకారపద్ధతులను కర్మాగారములు స్థాపించుట, మున్నగు కార్యవిధానమును ఎరుక పరచిరి. విశాఖ జిల్లానుండి 21,000 మంది సైన్యంలో చేర్చుకొనబడిరి. అందు 17,000 మందిమరలివచ్చిరి. వారిలో 3% వంతుమాత్రం స్వయంగా ఉద్యోగాలు సంపాదించు కొను చున్నారు. ఎక్కువమంది యీ ఎక్సచేంజి కార్యాలయాల ద్వారానే క్రొత్త పనులకు ప్రయత్నించుచున్నారు. ఇప్పటికి లభించిన ఉద్యోగాలలో 80% వంతు ప్రభుత్వో ద్యోగాలు, 20% వంతు ప్రయివేటు కంపెనీలలోను, సైన్యానికి పోయివచ్చిన వారు అదివరకు వ్యవసాయదారులే అయినా తిరిగి వ్యవ సాయానికి పోనొల్ల రని గవర్నరుగారికి తెలుప బడెను. ఈ కార్యాలయం వారు స్థాపించిన శిక్ష ణాలయమునందు నిపుణులుగా సివిలియనులకు గూడ శిక్షణ యొసంగుచున్నామని, కృష్ణారావు గారు తెలిపిరి. ఈ స్కీము 5 సం॥ వరకు నిర్ణ యించ బడెననియు, అందు 3 సం॥ లు గడచిన వనియు, యీ శాఖను స్థిరంచేసి కేంద్ర ప్రభు త్వంలో కార్మిక శాఖలో నొకభాగంగా చేర్చు టకు ఆలోచనలు జరుగుచున్న వనియు, "ఇండి యను వుమన్సు సివిక్ కోరు" మదరాసు ప్రభు త్వం "వుమన్సు వెల్ఫేరు"శాఖగ మార్చినట్లు, దీనిని మార్చుట యుచిత మనియు సూచింపబడెను.



మాజీసైనికులు స్థాపించిన కొయ్య సామాను కార్ఖానా సహకార సంఘమును గవర్నర్‌గారు పరిశీలిస్తున్న దృశ్యం.



మాజీ సైనికులు స్థాపించిన లోహ సామగ్రి కార్ఖానా సహకార సంఘమును గవర్నరుగారు పరిశీలిస్తున్న దృశ్యం.

పిల్లల నవల:



౧౮

పినాకయ్య ఊరులోకి వెళ్లి ఘడియ ఎపుడవుతుందా అని లెక్కపెట్టు న్నాడు. ఇరవై నిమిషాలు పూర్తి అయినట్టు తోచగానే వింతలదిబ్బదగ్గరికి పరుగెత్తాడు. ఆ పరుగులో వాడు ఎగిరిపోతూ వుంటే గుండె-గడియారం లాగ టక్ టక్ కొట్టుకుంది. "వాళ్లు చెప్పినట్టు వెయ్యి మోరీలకు బదులు రెండువేలు చెట్టు కాస్తేనో, రెండు వేలూకాక అయిదు వేలుంటే, అయిదువేలకి బదులు, నూరువేలు అంటే లక్షే ఉంటే, నేను లక్షాధికారిని అయిపోతానన్నమాట. నాకో గొప్ప భవనం, ఒక వెయ్యి గుఱ్ఱాలు—వాటికి శాలలు, ఒక గదినిండా మిఠాయీలు, లడ్డూలూ, మరో గదినిండా పళ్ళు ఫలాలూ యింకో గదినిండా చాకొలెట్లూ పిప్పర్ మెంట్లూ—ఓ నారాజా"

ఇలాగ కలలు కంటూవుంటే దిబ్బ కనిపించింది. కనుచూపుమేరలో చెట్టు ఎక్కడయినా కనిపిస్తుందేమో అని తేరిపారజూచాడు. మోరీలు రూపాయలూ ఘల్ ఘల్ మంటూ కదిలే కొమ్మలుగల చెట్టు ఏమీకనిపించ లేదు. కొంచెం ముందుకివెళ్లి పరకాయించాడు. కనిపించలేదు. దిబ్బమీదికి ఎక్కివెళ్లి, పాతిపెట్టిన గొయ్యివద్ద చూచాడు. ఆశ్చర్యం! అక్కడేం లేసదే! అలాగనిలవబడి దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు. తలలో తేళ్లూ జెఱ్ఱులూ ప్రాకినట్టయింది. గట్టిగా తల గోకుకొంటున్నాడు. ఏం ప్రయోజనం? ఇలా చూస్తూవుంటే పకాపకా నవ్వుతూ ఎవ్వరో పరామర్శ చేస్తూఉన్నట్టయింది. తిరిగిచూస్తే చెట్టుమీద బండరామచిలుక పక్కుమంది. "ఎందుకు, నన్ను చూచి నవ్వుతావు బండరాముడూ?" అని పినాకయ్య అడిగాడు. "నా రెక్కలు దులుపుకోవడంలో కితకితలయితే నవ్వుకుంటున్నాను- నీకేం" అంది రామచిలుక.

పినాకయ్య మాటలాడకుండా కాలువదగ్గరికి పోయి దోసిలినిండా నీళ్లు తెచ్చి, మోరీలు పాతిపెట్టినచోట పోశాడు. పకపకా నవ్వు—ఈ దిబ్బ అంతనీ వెక్కిరిస్తున్నట్టుంది.

"ఏయ్! బండరామచిలుక, ఎందుకు బాగనవ్వుతావు పనిలేక ?"

"చెప్పిందల్లా నమ్మే వెఱ్ఱిబాగులపిల్లనిచూచి నవ్వుతున్నాను. అలాంటి దగుల్బాజీల్ని, చెప్పాడుమాటలతో మనువాళ్లు బుట్టలో వేస్తారని"

"నువ్వనేమాట నన్ను గురించేనా?"

"మరింకెవ్వరిని వెఱ్ఱి పినాకయ్యా! నీవుకాకపోతే ఉట్టిపుణ్యాన్ని మోరీల చెట్టుని మొలిపిస్తానంటే నమ్మేవాళ్లు ఎవళ్లైనా ఉంటారా? కాయలులాగ, పళ్లులాగ మోరీలు కాస్తాయా? నీలాగ నేనూ ఒకప్పుడు నమ్మాను; మోసపోయాను. ఇప్పటికి తెలిసింది. ఏ కొంచెం ధనం సంపాదించడానికయినా కష్టపడి బుద్ధి బలమో, పిక్కబలమో ఉపయోగించి పనిచెయ్యాలని"

"నువ్వన్నమాట నాకు తెలియడం లేదు" అని పినాకయ్య భయంతో వణకిపోతున్నాడు.

"కొంచెం ఓపికపట్టు. అంతా అరటిపండు ఒలిచినట్టు చెబుతాను. నువ్వు మోరీలు పాతిపెటి, ఊళ్లోకి వెళ్లగానే నక్కా, పిల్లీ యిక్కడికి వచ్చి, నువ్వు పాతిన డబ్బు తీసుకొని ఒకటే పరుగు! చిటికెలో మాయమైపోయారు. ఎంత పరుగెత్తినా వాళ్లని పట్టుకోవడం కష్టం" అని చిలుక చెప్పింది.

పినాకయ్య ఇది వినగానే నోరావలించాడు. చిలుక చెప్పింది నమ్మకుండా, పాతిపెట్టినచోట లోపలికంటా తవ్వాడు అక్కడ పెద్ద గుహలాగ చేశాడు; కాని తన మోరీలుమాత్రం కనిపించలేదు.

ఇంక లాభం లేదని నిరాశ చేసుకొని ఊరిలోకి వెళ్ళాడు. కోర్టులోకి వెళ్లి తనకి అన్యాయం చేసిన దొంగలమాట చెప్పాడు. జడ్జీగా రొక కొండముచ్చి ముసలిపండు. చూడడానికి తెల్లటిగడ్డం, పండిన తల, పెద్దవాడు, కళ్లకి బంగారు కళ్లజోడు—అంతా మర్యాదస్థుడుగానే కనిపించాడు. వారిఎదట తనకి వచ్చిన ఆపదసంగతి పినాకయ్య చెప్పి, తన్ని దగాచేసినవాళ్లు, పేర్లు ఊర్లూ అన్నీ చెప్పి, ఆ దొంగ భడవలికి తగిన శిక్షవేసి న్యాయం చెప్పమని కోరాడు. న్యాయమూర్తి కథంతా శ్రద్ధగావిని చాల విచారించాడు. పూర్తికాగానే ఒక గంట వాయించాడు. రెండువేటకుక్కలు పోలీసుల వేషంతో వచ్చి యెదుట నిలిచాయి. "ఈ పెద్దమనిషి తాలుకు బంగారుమోరీలు పోయాయట! ఇతన్ని తీసుకొనిపోయి జెయిలులో వెయ్యండి" అన్నాడు. పినాకయ్య తెల్లబోయాడు. ఇదేం శిక్ష! పిడుగులాగపడింది. ఏదో చెప్పబోయాడు. పోలీసువాళ్లు చెప్పనివ్వకుండా నోరు మూసేసి జెయిలులోకి ఈడ్చుకొనిపోయారు. ఆ జెయిలులో నాలుగు మాసాలు ఉన్నాడు—నాలుగు దీర్ఘమాసాలు! అంతటితో ఆగేదా? ఈలోపున వీడి పుణ్యాం పుచ్చి మహారాజు అక్రమరాయ వర్మగారు ఏదో యుద్ధంలో జయించివచ్చిన కారణంచేత, ఆ ఉత్సవాలలో దొంగల నందరినీ విడుదల చేయించారుకనక సరిపోయింది. ఆ ఆనందంలో పినాకయ్య కూడా లేచి, "అందరినీ వదలివేస్తూవుంటే నేనూ పోతాను" అన్నాడు. నువ్వు వాళ్ల తరగతిలోవాడివి కావు" అన్నాడు జెయిలరు.

"కాదండీ, నేనూ దొంగవెధవనే" అన్నాడు.

అనగానే జెయిలరు నమస్కారం పెట్టి జెయిలు తలుపు తీసి బయటికి పోనిచ్చాడు.

౧౯

విడుదలయి బయటికి వచ్చేటప్పటికి పినాకయ్యకి ఎంత ఆనందమో! ఒక క్షణంఅయినా ఆలస్యం చేయకుండా ఊరిలోకి పరుగెత్తి దేవకన్య చిన్నమేడ వైపు దారితీశాడు. బయట వర్షం కురుస్తోంది. బందాబాడీలోంచి తొక్కుకొని వస్తూవుంటే మోకాళ్లవరకు అడుసు అయింది. అయినా లెక్కపెట్ట లేదు. ఏక్షణము ఆ నీలితలఅమ్మాయిని చూద్దామా, ఏక్షణంలో నాన్నని చూద్దామా అనే తహతహతో లేడిలాగ పరుగెత్తాడు. బంద తలమీదికి ఎగురుతోంది. పరుగెత్తుతూ తనలో అనుకొన్నాడు: "అయ్యో, దేవుడా ఎన్ని కష్టాలు వచ్చాయి! అవునులే నాకు తగిన శాస్తే అయింది. నాకెంత తోస్తే అంతే. ఎవరి మాటయినా వింటేనా? నా బాగు కోరేవాళ్ల మాటలుకూడా వినలేదు. నాకంటే వెయ్యిరెట్లు తెలిసున్నవాళ్ల మాట కూడా వినలేదు. అందుకే అనుభవించాను. ఇక్కడనించి శ్రద్ధగా, పెద్దవాళ్ల మాట వింటాను. మంచిగా ఉంటాను. వినయవిధేయతలతో పని చేస్తాను. చెప్పిన మాట వినకపోతే పిల్లలకి లాభం లేదు సరిగదా, ఎన్నో కష్టాలు పడతారని యిప్పటికి నాకు బోధపడింది.

"మా నాన్న ఎక్కడున్నాడో! ఆ నీలి అమ్మాయి ఇంటికి వెళ్తే తెలుస్తుందేమో! ఆ అమ్మాయిమాట విననందుకు కోపం వచ్చిందేమో! మళ్లా వెళ్తే నన్ను క్షమిస్తుందా? నేనంటే ఎంత ప్రేమ! ఎంత సేవ చేసింది నాకు! నేనీలాగ బ్రతికి ఉన్నానంటే, అది ఆమె చేయి చలువేకదా! కాని నేనెంత కృతఘ్నుణ్ణి." ఇలాగ అనుకొంటూ ఉంటే ఎదురుగుండా ఏదో కనబడింది. ఒక్క పిచ్చికేక వేసి భయంతో ఆగిపోయాడు. ఏమిటది? దారి కడ్డంగా ఓ పెద్ద పాము పడిఉంది!

బాలగేయాలు
శ్రీ చింతా దీక్షితులు
(సంపాదించినవి)

జోలపాట:

39

చదువుకని అబ్బాయి వచ్చెరా బోలు
సరస్వతీ చప్పుడూ సావిళ్లలోను
ఆడుకని అబ్బాయి వచ్చెరా బోలు
అందెల్ల చప్పుళ్లు పందిళ్లలోను
సానివీథులవెంట అబ్బాయి వస్తే
సాను లడ్డూకొనిరి చందమా మంచు
అబ్బాయి నెవ్వరే కొట్టిన్నవారు
కొట్టి కొబ్బరి బెల్లం కొని పెట్టినారు.

40

భుజ మూచమ్మ భుజ మూచు
పూవులు తెత్తము భుజ మూచు
సరులను గుత్తము భుజ మూచు
స్వామికి నిత్తము భుజ మూచు.

41

ఊగాడమ్మా ఊగాడు
ఊగే చిలుకా ఊగాడు
బంగరు బొమ్మా ఊగాడు
తంగెడు పువ్వా ఊగాడు
కులదీపంబా ఊగాడు
గుడిపావురమా ఊగాడు
చిన్నెల యమ్మా ఊగాడు.
కన్నులవెలుగా ఊగాడు
సొగసుల గువ్వా ఊగాడు
శుకమా పికమా ఊగాడు
చక్కని నెమలీ ఊగాడు
చక్కెర బొమ్మా ఊగాడు,

42

చేతట్టమ్మ చేతట్టు
శిరమున నేమి చేతట్టు
నీళ్ల బిందెయే చేతట్టు
నిలుపును దాహము చేతట్టు.

43

దాదం దక్కచ్చి
అయ్యవా రక్కచ్చి
పూస్తే పువ్వొచ్చి
కాస్తే కాయొచ్చి
పండితే పండొచ్చి

44

జోలపాట:

జోలలకు జొన్నబువ్వ
నాకు వరిబువ్వ
ఏడ్చేటి అబ్బాయికి వెల్లావు పాలు
ఉళళ........ హాయీ!
హాయి వారమ్మాయి నీళ్లకెళ్లింది
పాలైన యివ్వవే ఓ కుక్కపిల్లా
ఉళళ......పిల్లీ!
పిల్లెమ్మ వెళ్లింది పల్లెల్లు దాటి
అబ్బాయి వెళ్లాడు రచ్చల్లు దాటి
ఉళళ......పిల్లీ!
పిల్లి, రావే తల్లి పిల్లల్లమర్రి
మర్రిక్రిందావాడు తొర్రి నాగన్నా
తొర్రి నాగన్నకూ తోడెవ్వరమ్మా
గుఱ్ఱాలు కాసేటి గురవడే తోడు
ఉళళ..........హాయీ!

ఫిలిం సమస్యలు :

ఫిలింపరిశ్రమలో ప్రభుత్వ జోక్యం ఎంతవరకు అవసరం?


ఫిలిం పరిశ్రమలో ప్రభుత్వ జోక్యం ఎంతవరకు ఉండాలనేది ఒక సమస్యగా పరిణమించింది.

న్యాయానికి ఈ సమస్య ఉత్పన్నం కావలసింది కాదు. ఎందుచేతనంటే, ఈ పరిశ్రమ ఇతర పరిశ్రమల మాదిరిగా నిత్యావసర పదార్థాలను ఉత్పత్తి చేసేదికాదు. వినోదం ప్రధానంగా ప్రజలలో ఉన్నత అభిరుచులు పెంపొందించడానికి ఉపకరించేది. అంటే సాహిత్యంతో సాటి ఐనదన్నమాట. మరి సాహిత్యం విషయంలో 'ప్రభుత్వం జోక్యం' అనేది ఏమైనా ఉండడానికి అంగీకరిస్తామా? అంగీకరిస్తే, ప్రతిభా వ్యుత్పత్తులూ, పాండితీరసజ్ఞతలూ అక్కరకే రాకుండా పోతాయి.

కాని ఫిలిం పరిశ్రమ విషయంలో ఈ సమస్యరానేవచ్చింది. ఇందుకు గతమేమో ఇక్కడ ప్రసక్తిలేదు. కనక ప్రభుత్వం జోక్యం ఎంతవరకూ, ఏ విధంగా ఉండాలన్నది చూద్దాము.

ఫిల్ములుతీయ తలపెట్టేవారు కేవలం ధనార్జనోద్దేశంతోనే అందుకు పూనుకోరు. ఏ మాత్రమో కళాభిమానమైనా లేనిదే ఈ పరిశ్రమలోనికి రానేరారు. వచ్చినవారు యథాశక్తి కృషిచేస్తున్నారు.

ప్రభుత్వం ఈ పరిశ్రమలో జోక్యం చేసుకోవడం అంటే, ఫిలిం నిర్మాతలకు అండగా వుండి, లోటుపాట్లు లేకుండా చూడాలి. ఈ నాడు ఫిలిం నిర్మాతలకున్న లోటుపాట్లు ప్రధానంగా ఆర్థిక స్తోమతు, రా ఫిలిం. ఈ రెండింటి విషయంలోనూ వెనుదిరిగి చూసుకోనవసరం లేదన్న భరవసా వుంటే, నిర్మాతలు సమధికోత్సాహంతో చక్కని ఫిల్ములు తీయడానికి పూనుకొంటారు. ఆ రీత్యా ప్రభుత్వం ప్రజలలో నూతన భావాల వ్యాప్తికీ, ఉన్నతాభిరుచులు కలగడానికీ దోహదమవాలి.



ఛత్రపతి పిక్చర్సవారి 'రాధిక'లో బాలసరస్వతి

ప్రభుత్వం అభిరవసా కలిగించినా, ఫిలిం నిర్మాతలు కొందరు ఇప్పటివలెనే రామలింగని 'కథలూ', కవిచౌడప్ప 'శతకాలూ' వంటి ఫిల్ములు తీస్తూనే వుంటారనే అనుమానం వుంటే, నిర్మాతలు తమ బాధ్యతలను గుర్తించేటట్లు చేయడానికి తగు విధి నిషేధాలు పెట్టవచ్చు. లోకజ్ఞాన వ్యాప్తికి సాధనాలైన పత్రికలపైననే అట్టివి నేడు ఉన్నాయి కదా.

ఈ సందర్భంలో పత్రికా సంపాదకుల మాదిరిగా, నిర్మాతలే సమష్టిగా కొన్ని నియమ నిబంధనలు ఏర్పరుచుకోవడం మరీ మంచిది. అట్లా చేస్తే ప్రభుత్వం విధి నిషేధాలు పెట్టడానికి అవకాశమే లేకపోవచ్చు.

ఏమైనప్పటికీ భావ స్వాతంత్ర్యానికీ, పరిశ్రమాభివృద్ధికీ భంగం కలగకుండా వుండడమే ఫిలిం పరిశ్రమలో ప్రభుత్వం జోక్యం విషయమై ప్రధానాంశంగా ఉండాలి.



శోభనాచలవారి 'సంసార నారద'లో మద్దాలి కృష్ణమూర్తి, సరోజిని

సినిమాహాలులవారిపై అకారణ ఆరోపణ

గతమాసం బెజవాడలో జరిగిన ఆంధ్రదేశ మునిసిపాలిటీల కాంగ్రెస్ కౌన్సిలర్ల సమావేశంలో వింత తీర్మానం ఒకటి చేశారు. ఏమనంటే, 'వినోదపుపన్ను వసూలు సందర్భంలో ప్రొప్రైటర్లూ, సినిమాల ఏజెంట్లూ కలసి మోసముతో గవర్నమెంటుకు రావలసినంత ఆదాయం రాకుండా వ్యవహరించుచున్నారు గాన మునిసిపల్ కౌన్సిలర్లకు కూడ అపుడపుడు చెక్కింగు అధికారం ఇవ్వాలని.

ఈతీర్మానం వింతైనదే కాక చాలా అభ్యంతరపెట్టదగినది. గౌరవంగా వ్యాపారంచేసుకొనే ఒకవర్గంమీద ఈ తీర్మానం అకారణంగా నిందారోపణచేస్తున్నది. ప్రొప్రయిటర్లూ, సినిమాల ఏజెంట్లూ మోసంచేస్తున్నారట. వినోదపుపన్ను అమలులోకి వచ్చిన తర్వాత ఆవిధంగా యెక్కడన్నా జరిగినట్లు ఒక్క నిదర్శనమన్నా ఉన్నదా? అయినా పన్ను అంతా ప్రజలే భరిస్తుంటే వీరు మోసంచేయవలసిన అవశ్యకత ఏదీ?

ఇప్పటికే సినిమా హాలుల వారు ఈచెక్కింగ్ సెపానా, గదితర విధాలా అనేక రకాల ఉద్యోగుల 'జులుము'కు గురికావలసివస్తున్నది. ఇక కౌన్సిలర్లకు కూడా ఈ అధికారంవస్తే మరొకరకం వారి 'జులుము' సాగడం తప్ప ప్రయోజనమేమీ వుండదు.

అసలు, తాబేదారులు చేసేపనిని కౌన్సిలర్లుకూడా చేస్తామనడం తమపదవికి గల గౌరవం, విధులూ గుర్తించలేకపోవడంవల్లనే నని గ్రహించాలి. ప్రభుత్వం అనాలోచితంగా ఇట్టిఅధికార ప్రదానానికి పూనుకోరాదు.

'సినిమా మానిసి'

ఆకుపచ్చ రంగు, ఎఱ్ఱటి చింతనిప్పుల లాంటి కళ్లు. తోకలోంచి బుసబుస పొగ వస్తోంది. దాన్ని చూచి పినాకయ్య ఎంత భయపడిపోయాడో చెప్ప నలవికాదు. భయంతో పరుగెత్తి, ఫర్లాంగు దూరం వెనక్కి వెళ్లి ఒక్క కంకర రాళ్ల గుట్టమీద కూర్చున్నాడు. ఈ లోపున ఆ పాము తన దారిని తాను పోయి తోవ విడుస్తుం దని గంటసేపు ఆగాడు. కదలలేదు. రెండుగంటలు, మూడుగంటలు ఆగాడు; ఆ పసిరిపాము కదలనిదే! తాను కూర్చున్న చోటినించికూడా ఆ భయంకరసర్పం కళ్లలోంచి నిప్పులు చెరగడం, తోకలోంచి పొగలు కమ్మడం కనిపిస్తోంది. చివరికి పినాకయ్య ధైర్యం చిక్కబట్టి తెగించాడు. సర్పందగ్గరికి వెళ్లి జాలిగా సన్నని గొంతుకతో,


"ఓ పాముగారూ, దయచేసి నాకు కొంచెం దారి వదిలెయ్యరూ నేనలాగ పోతాను" అని అడిగాడు. ఏం లాభం! గోడతో చెప్పితే ఎంతో, ఆ పామును అడిగితే అంత. బదులు చెపితేనా? తానడిగినదానికి ఏదైన సైగ అయినా చేస్తుందేమో అని చూస్తే పాము పలక్కుండా ఉంది; కళ్లు మూసేసింది. తోకలోంచి పొగ రావడంకూడా ఆగింది.

మళ్లీ చిన్న గొంతుకతో పినాకయ్య అడుగుతున్నాడు:

"పాముగారూ! దయచేసి దారివ్వండి. నే పోయి, మా నాన్నగారిని చూడాలండీ! ఆయన్ని చూచి చాల కాలం అయిందండీ! దయయుంచి..."

కాని జబాబులేదు. చచ్చినట్టు పడి ఉంది పాము. పోనీ చచ్చిందేమో అని సంతోషంతో లేచి చేతులు చప్పట్లు చరుస్తూ ఒక క్షణం అయినా ఆగకుండా, దాటిపోవా లనుకున్నాడు. ఒక కాలు వేసేటప్పటికి పాము గడియారం స్ప్రింగులాగ పైకి లేచింది. పినాకయ్య భయపడి వెనిక్కి పారిపోబోతూ వెల్లకిలా పడిపోయాడు. ఆ బురదలో తల కూరుకుపోయి కాళ్లు పైకి వచ్చాయి. గిజగిజ కొట్టుకొంటున్నాడు. అది చూడగానే పాముగారికి నవ్వు వచ్చింది. పకపకా తెగ నవ్వి, ఆ నవ్వుతో పొట్ట పగిలి ఈ మాటు నిజంగా చచ్చిపోయింది.

పినాకయ్యకి ఈమాటు దారి తెరవగానే, కాలికొద్దీ పరుగెత్తాడు, చీకటి పడేలోపున ఆ నీలి అమ్మాయి యిల్లు చేరా లని. కడుపులో ఆకలి దహించుకొని పోతోంది. ప్రక్కనే ఒక ద్రాక్షతోట కనిపించింది. కంచెమీంచిదూకి ఒక ద్రాక్షగుత్తి తిందా మనుకున్నాడు. గుత్తికోసం చెయ్యి జాచేటప్పటికి కాళ్లు బోనులో పెట్టి, ఇనుప ఊచలతో మెలివేస్తున్న ట్టయింది. అబ్బ! బాధ! కాళ్లు నులిపెట్టడంలో ఆకాశంమీద చుక్కలు కనిపిస్తున్నాయి. పాపం పినాకయ్య బోనులో పడ్డాడు. ఆ చుట్టుప్రక్కల కోళ్లని పొటబెట్టుకొంటూ వున్న 'బావురుబిల్లిని' పట్టుకోవడానికి ఆ బోను పెట్టి ఉంచారు. అందులో పినాకయ్య చిక్కుకున్నాడు.



భారతదేశంలో ఫ్రెంచి రాయబారిగా నియమితుడైన డేనియల్ లెవీ మొన్న 10 వ తేదీన భారత అధినివేశ గవర్నర్ జనరల్ మౌంట్‌బాటన్‌కు తన సన్నదులు సమర్పించుకొన్నప్పటి దృశ్యం.

అంగీకరించుట ముదావహమైన విషయము. ఉత్పత్తిని కుంటుపరచుచున్నది కార్మికసమస్య ఒక్కటేకాదు; యంత్రసామగ్రి, నిపుణుల కొరతలు, రవాణాపరిస్థితుల క్లిష్టతవలన, అందక పోవటము మొదలైన అనేక కారణము ముడి పదార్థము సకాలములకు లున్నవి. ఇట్టి ఆటంకములను తొలగించుటకు ప్రభుత్వము వీలైనంత వరకు, పారిశ్రామిక వేత్తలకు తోడ్పడవలెను. ఇట్టి సమస్యలను పరిశీలించి, నిర్ణయములు చేయుటకు భారత ప్రభుత్వ పారిశ్రామికశాఖ మంత్రి డా. శ్యామప్రసాద ముఖర్జీ గారు కార్మిక ప్రతినిధులను, రాష్ట్రి, సంస్థాన ప్రభుత్వముల ప్రతినిధులను, ప్రముఖ పారిశ్రామిక వేత్తలను సమావేశపరచిరి. ఈ సమావేశములో జరిగిన నిర్ణయములను ప్రభుత్వము వెనువెంటనే ఆచరణలో ఆదరించునని డా. ముఖర్జీగారు తెలిపియున్నారు. వెంటనే పారిశ్రామిక ఉత్పత్తి అధికము చేయుటకు ఈ సమావేశములో అనేక ముఖ్య నిర్ణయములు చేయబడినవి. కుటీర పరిశ్రముల నభివృద్ధి పరచుటను గూర్చి ఈ సమావేశము ప్రత్యేక శ్రద్ధ జూపినది. భారతదేశ ఆర్థిక విధానము [illegible] పరచవలసిన దని భారత ప్రభుత్వమును కోరుతూ అందుకు కొన్ని సూచనలు కూడ [illegible]యబడినవి.

భారతదేశ ఆర్థిక విధానమును విశదీకరిస్తూ పండిట్ నెహ్రూ కలకత్తాలో ఒక ముఖ్య ప్రక

భారత సంస్థానాల చరిత్రలో
భారతముస్లింలను ఉపయోగించు

ఒరిస్సా, సి. పి. సంస్థానాధీశ్వరుల ముందంజ

మన దేశంలో మొత్తం 400 లకు పైగా సంస్థానము లున్నవి. వానిలో చాల కొద్ది సంస్థానములు మాత్రమే పెద్దవి; చాల సంస్థానములు బహుచిన్నవి. ఈ చిన్న సంస్థానములు తమ ఆంతరంగిక శాంతిని కాపాడుకొనుటకు కూడ అసమర్థమైనంత చిన్నవగుటచే, వాని పరిపాలనా బాధ్యత వహించవలెనని సంస్థానాధీశ్వరులు భారత ప్రభుత్వమును అర్థించిన విషయము, ఇందుకు తగిన అధికారములను ప్రభుత్వమునకిస్తూ, అధినివేశ శాసనసభ ఈ మధ్య చేసిన శాసనము గత వారం ఈ పుటలో విశదీకరింపబడినవి. సంస్థానములకన్న ఇతర భారతదేశము అన్ని విధముల సౌభాగ్యవంతముగా నున్నదనుట నిర్వివాదాంశము. భారతదేశం స్వాతంత్ర్యం పొందటముతో, తాము కూడా బాధ్యతాయుత పరిపాలనాధికారము సంపాదించవలెనని పెద్ద సంస్థానములలోని ప్రజలు, తమ ప్రభువు నిరంకుశ పరిపాలనను అంతమొందించుకుని, రాష్ట్రములోని తమ సోదరులతో కలసిపోయి, రాష్ట్రి ప్రభుత్వపరిపాలనలో, తాము కూడ పాల్గొనవలెనని చిన్న చిన్న సంస్థానముల ప్రజలు పట్టుదల వహింప మొదలిడినారు. తిరువాన్కూరు, మైసూర్, బరోడా, భోపాల్ వంటి సంస్థానముల ప్రజలు బాధ్యతాయుత ప్రభుత్వమును సంపాదించుటకు చేసిన కృషి, దాని ఫలితము మన మెరిగియే యున్నాము.

ఒరిస్సా రాష్ట్రములో 26 సంస్థానాలు; సి. పి. రాష్ట్రములో 14 సంస్థానాలు వున్నవి. ఈ సంస్థానాలన్నిటినీ కలిపి తూర్పు సంస్థాన సమాఖ్యగా బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం ఏర్పరచింది. ఈ సంస్థానాల విస్తీర్ణమునుబట్టి 'ఎ', 'బి', 'సి', అని మూడు తరగతులుగా విభజింపబడినవి. మొత్తంమీద ఈ సంస్థానాలన్నీ చాల చిన్నవి. ఇచ్చటి ప్రజలకు సి. పి. ఒరిస్సా రాష్ట్రములలో చేరిపోవాలని మొదటినుండి ఆసక్తివున్నది. ఓఢ్రభాష మాట్లాడు ప్రజలలో దాదాపు సగంమంది సంస్థానాలలో నేవున్నారు. అందువలన ఈ సంస్థానాల భూభాగంపై పరిపాలనాధికారం కూడా ఒరిస్సా రాష్ట్రి ప్రభుత్వమునకే వప్పజెప్పి, ఓఢ్రుల నందరను ఐక్యము చేయవలెనను ఉద్యమము చాలరోజులనుండి తీవ్ర ప్రచారములో నున్నది. భారతదేశం స్వాతంత్ర్యం సంపాదించటంతో ఈ ఉద్యమం మరింత తీవ్రమైనది. తమ సంస్థానములు చిన్నవై పోవటం వలన విడిగా పరిపాలన ఏర్పాట్లు చేసుకొనుటకు అనువుగా నుండక పోవుటను, రాష్ట్రి ప్రభుత్వముతో కలసిపోవలెనను ప్రజాభిప్రాయమును గమనించి, సంస్థానాధీశ్వరులు కూడా, మార్పు చెందిన ఈ ప్రస్తుత కాలములో తాము ఏటి కెదురీద జూచుట అనగ దామకమని గ్రహించి తమ సంస్థాన భూభాగంపై సర్వాధికారములు భారత ప్రభుత్వమునకు దఖలు పరచుటకు అంగీకరించిరి. ఈ అధికారములను భారత ప్రభుత్వము రాష్ట్రి ప్రభుత్వములకు దఖలు పరచును. ఇందుకు తగిన అధికారమును భారత ప్రభుత్వమునకు యిస్తూ అధినివేశ శాసనసభ గతవారం ఒక శాసనం చేసినతరువాత సంస్థాన శాఖా మంత్రి సర్దార్ పటేలు కటక్, నాగపూర్‌లు స్వయంగా వెళ్ళి, సంస్థానాధీశ్వరులతో మంతనాలు జరిపి, ఈ క్రొత్త అధికార దఖలు పత్రంపై సంతకాలు చేయించాడు. ఒరిస్సాలో నున్న 26 సంస్థానాలలో మొత్తం 22 సంస్థానాధీశ్వరులు, సి. పి. లో నున్న 14 సంస్థానాలలో 11 సంస్థానాధీశ్వరులు ఈ ఒప్పందం బడికపై సంతకాలు చేశారు. ఈ ఒడంబడిక ప్రకారం ఇకముందు సంస్థానాధీశ్వరులకు పరిపాలనాధికారంలో ఏ హక్కులూ ఉండవు. ఈ సంస్థానాధీశ్వరులందరూ ఒక సలహా సంఘముగా ఏర్పడి, తమ ప్రాంతముల పరిపాలనా నిర్వహణంలో రాష్ట్రి ప్రభుత్వానికి సలహా లిస్తూంటారు. సంస్థానాధీశ్వరులకు రాష్ట్రి ప్రభుత్వములు ఏటేటా కొంత నిర్ణీతమైన మొత్తమును వారి కుటుంబ ఖర్చులకొరకు యిస్తుంది. తదితర సంస్థానాధీశ్వరులు కూడా త్వరలోనే ఇటువంటి ఒడంబడికపై సంతకాలు చేసి, సంస్థాన ప్రజలు భారత ప్రజలు అను విభేదమునకు తావులేకుండా జేయుదు రని ఆశిస్తున్నాము.

స్వతంత్ర భారతదేశ అభ్యుదయమునకు సంస్థాన ప్రాంతము, భారత ప్రభుత్వ ప్రాంతము అను కృత్రిమ విభేదం గొప్ప ఆటంకము. అంతరంగిక పరిపాలనాధికారమును సరిగా నిర్వహించుటకు కూడ అవకాశము కాని చిన్న చిన్న సంస్థానములు త్వరలోనే భారత రాష్ట్రిలతో చేరిపోగలవు. కాని పెద్ద సంస్థానాధీశ్వరులు, తమ ప్రజలకు బాధ్యతాయుత పరిపాలనాధికార మిచ్చి, తమ సంస్థానపు ప్రత్యేకతను కాపాడవలెనని ప్రయత్నించుదురు. ఇట్టి ప్రయత్నములు భారతదేశ ఆర్థికాభ్యున్నతికేగాక, భాష, సంస్కృతి ప్రాతిపదికలపై భారత ప్రజల నైకతి పరచి సామాజికాభ్యున్నతికి కూడ తోడ్పవలెనను ఉద్యమమునకు కూడ ఆటంకము కల్గించును. దక్షిణ భారతదేశములో ఆంధ్రులు, కన్నడులు, మళయాళులు, మహారాష్ట్రులు భాషాప్రయుక్తముగా రాష్ట్రము లేర్పరచుకొనుటకు హైదరాబాద్, మైసూర్, తిరువాన్కూర్ సంస్థానములు గొప్ప ఆటంకములుగా నున్నవి. కాబట్టి ఈ పెద్ద సంస్థానములు కూడా రాష్ట్రప్రభుత్వములతో కలిసిపోవలెనను ఉద్యమం త్వరలోనే తీవ్రతరం కాగలదు. చిన్న సంస్థానములేగాక, పెద్దసంస్థానములు కూడా ఒరిస్సా, సి. పి. సంస్థానముల అడుగుజాడలలో నడచి, భారతసంస్థానాల చరిత్రలో ఈ నూతనశకోదయాన్ని జయప్రద మొనర్చగలరని ఆశిస్తున్నాము.

ఆర్థికాభ్యున్నతికి భారతప్రముఖుల ఆలోచనలు

భారతదేశం స్వాతంత్ర్యం పొందిన తరువాత ఆర్థికస్వాతంత్ర్య, సమానత్వ న్యాయములు సాధించవలెనని ప్రభుత్వము ప్రజలుకూడ పట్టుదలతో నున్నారు. కాని మతకలహముల వలన భారతప్రభుత్వం ఈ విషయమై ప్రత్యేక శ్రద్ధ వహించలేకపోయినది. యుద్ధానంతరము పారిశ్రామిక ఉత్పత్తి, వ్యావసాయిక ఉత్పత్తి కూడ కార్మిక సమస్యలు, యంత్రసామగ్రికొరత, నిపుణుల కొరత, ముడిపదార్థముల కొరతలవలన చాలవరకు తగ్గిపోయినది. దేశములో చలామణిలో నున్ననోట్లు హెచ్చుగా నుండుటవలన ధనోల్బణము హెచ్చైపోయి, ధరలు పెరిగిపోనారంభించినవి.

ఇట్టి పరిస్థితులలో పారిశ్రామిక, వ్యావసాయిక ఉత్పత్తి స్వల్పకాలములో వీలైనంత స్థాయికి వృద్ధిచేయుట అత్యావశ్యకము. దీనితో పాటు, ఆర్థికాభివృద్ధికి దీర్ఘకాలపు ప్రణాళికను ఏర్పాటుచేసి, దానిని అమలుజరుపుటకు కూడా ప్రత్యేకశ్రద్ధ వహించవలెను. ఉత్పత్తిని యుద్ధకాలపు స్థాయికి అభివృద్ధిజేయుటకు వెంటనే చేయవలసిన పని, దీర్ఘకాలములో ఆర్థిక అభివృద్ధి జరుపుటకు చేయవలసిన పని సమన్వయ పరచి, యజమానుల, కార్మికుల సహకారంతో ఆ పని కొనసాగునట్లు చూచుట మంచిది. యజమానులు, కార్మికులుకూడ ఇప్పటి ప్రత్యేక పరిస్థితుల నవగాహన చేసుకుని మూడేండ్లవరకు సమ్మెలకు దిగకుండ తమ వివాదములను మధ్యవర్తిత్వము ద్వారానే పరిష్కరించుకొనుటకు



వల్లభాయి పటేల్

టనచేశారు. ప్రజాస్వామికము, వ్యక్తిస్వాతంత్ర్య రక్షణలకును సూత్రములపై తనకు నమ్మకమున్నదనియు, ప్రజాజీవనప్రమాణాభివృద్ధియే తన లక్ష్యమనియు, గ్రామీణుల సౌభాగ్యము నభివృద్ధి చేయుట ప్రథమ కర్తవ్యముగా భావించవలె ననియు ఆయన చెప్పినారు. పారిశ్రామిక సమావేశము సూచించిన సూత్రములు కూడ ఇదే విధముగా నున్నవి. ఇట్టి ఆర్థిక విధాన మొకటి త్వరలోనే ప్రకటింపబడి, సక్రమముగా అమలు జరుపబడు నని ఆశించుచున్నాము.


హైద్రాబాద్ సంస్థానంలో మంత్రిపదవులు

ఎట్టకేలకు హైద్రాబాద్ సంస్థానప్రధాని లియాక్ అలీ ఒక మంత్రివర్గమును ఏర్పాటు చేసెను. బాధ్యతాయుత ప్రభుత్వమునకు నాందిగా వుండగల తాత్కాలిక ప్రజాప్రభుత్వమును ఏర్పరచ బోవుచున్నట్లునటించి, కేవల ప్రజావ్యతిరేక మంత్రివర్గమును ఆయన ఏర్పాటు చేయగల్గినాడు. నూటికి 90 వంతులున్న హిందూ ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తున్నాడని చూపగల వ్యక్తి ఒక్కడును ఈ మంత్రివర్గములో లేడు. మొత్తం 14 గురు మంత్రులలో 6 గురు మాత్రమే హిందువులు. వీరును తమకు తాము దప్ప మరెవ్వరికీ ప్రాతినిధ్యము వహించలేమని పరిపూర్ణముగా గ్రహించియు, మంత్రిపదవి

వ్యామోహాలపై ఇంగు కొంపబడిన ధీరులు మాత్రమే. ప్రాంతాలవారిల విభజనలో వీరు అగస్త్యభ్రాతలవలె పరిగణింపబడిరి. ఇట్టి నడ మంత్రపు ప్రభుత్వము సంస్థానములో ప్రశాంతత నెలకొల్పగలదనుట కల్ల. సంస్థానకాంగ్రెస్ కార్యవర్గం బొంబాయిలో సమావేశమై సత్యాగ్రహోద్యమం తీవ్రతరం చేయవలె ననీ, పన్నుల నిరాకరణోద్యమం ప్రారంభించవలె ననీ నిర్ణయించినట్లు తెలుస్తున్నది. ఈ మధ్య జయపూర్‌లో సర్దార్ పటేల్ మాట్లాడుతూ, యథాతథపు ఒడంబడిక రద్దయి పోయే గడువులోగానే, భారత యూనియన్‌లో చేరుటకు నిజాం నిశ్చయించుకొనుట మంచిదనీ, నిజాం ఏదైనా కుతంత్రము పన్నినచో ఒక క్షణములోనే ఆయనను దారికి తీసుకు వచ్చుటకు భారత ప్రభుత్వం సిద్ధంగానే ఉన్నదని చెప్పాడు. ప్రజాభీష్టమును మన్నించి కాల ప్రవాహమున కెదురీదుట అసంభవమని నిజాం గుర్తించునట్లు చేయుట నిజాం ప్రజల కర్తవ్యము.


ముస్లింలీగ్ విభజన

భారతదేశ విభజనకు కృషిచేసిన ముస్లింలకు భారతదేశంలో ఎట్టి స్థాన మివ్వవలె నను ప్రశ్న చాల కోణాలనుండి వినవస్తున్నది. ముస్లింలు గతములో ఏమిచేసినదీ విస్మరించి, భారత దేశము పట్ల ఇకముందైనా భక్తి విశ్వాసములతో ప్రవ



నిజాం సంస్థానకాంగ్రెసు అధ్యక్షుడు స్వామి రామానందతీర్థగారు ఢిల్లీలో ప్రజాపరిషత్ సభ్యులతో ఇష్టాగోష్ఠిగా ప్రసంగిస్తున్న దృశ్యం.

నూతన శకోదయం కొనటానికి జిన్నాసాహెబ్ పన్నాగం



శ్యాంప్రసాద్ ముఖర్జీ

ర్తించుచున్న వారికి ఈ దేశములో సర్వ పౌరసత్వపు హక్కులు లభించునని కాంగ్రెస్ నాయకులు స్పష్టపరచియే యున్నారు. పాకిస్థాన్ స్థాపనకు కృషిచేసిన వారిలో అత్యధిక సంఖ్యాకులకు పాకిస్థాన్ ప్రవేశించుటకే అర్హత లేకుండా చేసి జిన్నా సాహెబు ముస్లింలను వంచించినాడు. పాకిస్థాన్ స్థాపన కృషి చేసినారని ముస్లింలపై భారత ప్రజలు కినుక చెందియున్న సమయమున ఇంతవరకు నాయకత్వము వహించిన ప్రముఖులు పాకిస్థాన్‌కు వెళ్ళిపోయి, వీరిగతి ఆలోచించనే లేదని భారత ముస్లింలు చాలమంది అసంతృప్తి చెంది, లీగ్ నాయకత్వమును కోలదన్నుచున్నారు. భారత దేశంలోని ముస్లింలు భారతదేశముపట్ల భక్తి, విశ్వాసములతో వ్యవహరించవలె నని జిన్నా సాహెబ్ కూడ పదేపదే సలహా యిస్తున్నాడు. గాని ఆయన చేష్టలు, భారతదేశంలోని ఆయన అనుచరుల చేష్టలు ఇందుకు విరుద్ధముగానున్నవి. భారతదేశంలో ముస్లింలీగ్‌ను రద్దుపరచి, ముస్లిములందరు మతవిచక్షతలేని జాతీయసంస్థలలో చేరవలె నని పలువురు వారికి హితబోధ చేస్తున్నారు. ముస్లింలీగ్ సంఘములు రద్దుచేసుకొని ముస్లింలు చాల ప్రాంతములలో కాంగ్రెస్‌లో చేరుచున్నారు. భారత ముస్లింల శ్రేయోభివృద్ధిని గురించి ఆలోచించుటకు మౌలానా అజాద్ ఏర్పాటుచేసిన అఖిలముస్లిం పక్షు సమావేశం త్వరలో లక్నోలో సమావేశం కానున్నది. ఇట్టి సమయములో కరాచీలో ఈ మధ్య జరిగిన ముస్లింలీగ్ కౌన్సిల్ ముస్లింలీగ్‌ను విభజించి, భారతదేశంలో కూడా లీగ్‌ను రాజకీయ సంస్థగా వుంచుటకే నిర్ణయించటం భారతముస్లిం లందరు గర్హించవలసిన విషయం. ముస్లింలీగ్ ఎప్పుడునూ పాకిస్థాన్ హితాకాంక్షి. భారతదేశంలో వున్న లీగ్ పాకిస్థాన్‌లోని లీగ్ సంస్థకు అనుబంధ సంస్థగా వుండి, పరోక్షంగా పాకిస్థాన్‌కు సహాయం చేయుటకు వీలుగా నుండుటకే జిన్నా సాహెబ్ ఇట్టి నిర్ణయము చేయించినాడు. తమకు ప్రవేశార్హతలేని పాకిస్థాన్‌కు, ఇక ముందుకూడా,

భారత రాజకీయాలు

మతి మాలిన్యముతో సహాయపడుటకు, భారత ముస్లింలను పంచమాంగ దళంగా తయారుచేసి భారతదేశ శాంతికి, అభ్యుదయమునకు ఆటంకం కల్గించవలె నని జిన్నా ఈ వినంగా పన్నాగం పన్నుతున్నాడు. భారత ముస్లింలు ఈ మాయాజాలములో చిక్కుకొన్నచో అధిక కష్టనష్టముల పాలగుదురు.

మద్రాసులో యన్. జి. ఓ.ల సమ్మె

మనరాష్ట్రంలో (నిగుచతరగతుల) ప్రభుత్వోద్యోగు లందరు సోమవారంనుండి సమ్మె చేస్తున్నారు. రెండు వారాల క్రితం వీరందరు లాంఛన ప్రాయంగా ఒక గంటసేపు సమ్మెచేసి, ప్రభుత్వ విధానముపట్ల వారు అసమ్మతిని చూపి వున్నారు. కేంద్ర ప్రభుత్వము సూచించిన ప్రకారం కరువుభత్యము యివ్వవలె నను వీరి కోరికను ప్రభుత్వం అంగీకరించటం లేదు. అందువలన 15 తేదీ నుండి రాష్ట్రమందంతటా యన్. జి. ఓ. లు సమ్మె చేస్తున్నారు. కరువుభత్యము విషయమై శ్రద్ధగా ఆలోచించుటకు ప్రభుత్వం సిద్ధంగానే వున్నదిగాని సమ్మెదారులపై దమన విధాన మవలంబించకుండుటకు ప్రభుత్వం ఒప్పుకొనటం లేదు. ఏ వర్గమువారైనాసరే సమ్మె చేసి విరమించిన తరువాత, సమ్మెదారుల నాయకులపై కఠిన చర్యలను గైకొన కూడదను ప్రాథమిక సూత్రమును ప్రభుత్వమే అంగీకరించలేక పోవుట శోచనీయము. సమ్మెను విచ్ఛిన్నమొనర్చుటకు రాష్ట్రప్రభుత్వ మవలంబించిన విధానము కూడ హర్షదాయకంగా లేదు. సమ్మె విరమింపబడినది. సమ్మెదారులపై, ముఖ్యముగా సమ్మె నాయకులపై, ప్రభుత్వము కఠిన చర్య తీసుకొనకుండుట సమంజసము.

నేటి ప్రపంచం

[9 వ పేజి తరువాయి]

కులూ శాంతియుతంగా తప్పుకొని ఆ దేశ స్వాతంత్ర్య స్థాపనకు దోహదం చేయాలని భారత ప్రధాని నెహ్రూ డచ్చివారికి ప్రత్యేక విజ్ఞప్తిద్వారా సౌమ్యంగా హితవు చెబుతున్నాడు. ఆసియాఖండం గాఢనిద్రావస్థనుంచి మేల్కొన్నదనీ, పాశ్చాత్యుల వలసతత్వంకింద ఒక్క అంగుళం మేరకూడా వుండడానికి వీల్లేదనీ, ఇండోచైనా స్వాతంత్ర్యాన్ని అరికడుతున్న ఫ్రెంచివారూ, ఇండోనీసియాస్వాతంత్ర్య స్థాపన విషయంలో కాలహరణం చేస్తున్న డచ్చివారు ఎంత త్వరగా గమనిస్తే ఉభయత్రా అంత మంచిది. ఆసియాఖండం సగం స్వతంత్రంగా సగం అస్వతంత్రంగా వుండడం కల్ల. నవ చైతన్యాన్ని పొందిన ఆసియాఖండ ప్రజా విప్లవ ధాటి ముందు పాశ్చాత్య సామ్రాజ్యవాదులు పాత ప్రతిష్ఠ పునఃస్థాపనకోసం ఎంత పెనుగులాడినా ప్రయోజనం లేదు.

* * *

చైనా అంతర్యుద్ధం అనాటికానాడు భీషణ పరిస్థితికి వస్తున్నది. మంచూరియాలో కమ్యూనిస్టు సేనల దండయాత్ర ఉధృతం హెచ్చిందనీ, కిలకపట్టణం ముక్డెన్‌ను సమీపిస్తున్నవనీ వార్తలు వచ్చినవి. చాంగ్ కై షేక్ అధ్వర్యంకింద జాతీయ ప్రభుత్వసేనలు అనేకచోట్ల సాహసోపేతమైన ప్రతిఘటనను సాగిస్తున్నవి. కమ్యూనిస్టు సేనలకు, సోవియెట్ ప్రభుత్వానికి మధ్య రహస్య ఒప్పందం జరిగినట్లు కూడా రూఢిగాని వార్తలవల్ల తెలియవస్తున్నది. అగ్రరాజ్య విభేదాలు మరీ స్పష్టపడిన ఈ తరుణంలో ఇట్టి ఒడంబడిక జరిగినా జరిగి వుండవచ్చు. రహస్య ఒప్పందం జరిగినా జరగక పోయినా చైనా కమ్యూనిస్టులు, రష్యా ప్రభుత్వంవారూ ఏక కుటుంబీకులే. ఈ విపరీత పరిస్థితులలో సైతం చైనా సహాయార్థం అమెరికా స్పష్టమైన విధానాన్ని దేన్నీ అవలంబించటం లేదు. యూరప్‌ఖండం సహాయం విషయంలో చూపుతున్న శ్రద్ధను జీవన్మరణావస్థలో వున్న చైనా విషయంలో అమెరికా కనబరచడంలేదు.

గత గ్రీష్మఋతువులో చైనా విషమావస్థను స్వయంగా చూసివచ్చిన అమెరికన్ సేనాని జనరల్ వేడ్ మెయర్ చైనాకు సత్వరమే ఆర్థికంగానూ, సైనిక సామగ్రి సప్లయిద్వారానూ సహాయపడడం అవసరమని మొన్న అమెరికన్ సెనెట్ ఉపసంఘ సమావేశంలో ఉద్ఘాటించాడు. ఇదివరకు ఫ్రాన్సులో అమెరికన్ రాయబారిగ పనిచేసిన విషయం బుల్లిట్ ఫ్రాన్సు, ఇటలీ, ఆస్ట్రియాలకు చేయదలచిన సహాయాన్ని ఆపివేసైనా, చైనాకు అమెరికా సహాయపడడం అవసరమని హెచ్చరిక చేస్తున్నాడు. చైనాలోని అమెరికన్ రాయబారి ఈ సహాయ అవసరాన్ని గురించి ఎన్ని వర్తమానాలు పంపినా అమెరికా విదేశశాఖ జవాబైనా ఇవ్వటంలేదని తెలుస్తున్నది. ఇంతే కాదు; జనరల్ వేడ్ మెయర్ చైనాలో పర్యటనానంతరం అందజేసిన ప్రత్యేక నివేదికను సైతం ప్రకటించడాని అమెరికన్ ప్రభుత్వం ఇష్టపడడంలేదు. అమెరికా ఇంత ఔదాసీన్యాన్ని ఎందుకు చూపుతున్నదో దురూహ్యంగా వున్నది. చైనా పరిస్థితి మరీ క్లిష్టంగా పరిణమిస్తే కొన్ని ప్రత్యేక వ్యాపార, రక్షణ ప్రయోజనాలను సాధించి సహాయ పడాలన్నది అమెరికా ఉద్దేశమేమో. ఒంటరిగా సైతం నిలచి చైనా జపాను సేనలను ప్రతిఘటించడం ద్వారా ద్వితీయ ప్రపంచ సంగ్రామంలో చైనా మిత్రరాజ్యాలకు, ముఖ్యంగా అమెరికాకు అపారంగా సహాయపడ్డది. ఈ నాటి క్లిష్ట పరిస్థితులలో అమెరికా చైనాకు బాసటగా నిలచి కమ్యూనిస్టు ఉపద్రవాన్ని అరికట్టక పోవడం కేవలం మిత్రద్రోహమే అనిపించుకుంటుంది. (21-12-1947

కవిరాజులు రాజకవులు

శ్రీ దాసు వామనరావు

ఛాందసులు అంటే లౌక్య వ్యవహార జ్ఞానము చక్కగా లేనటువంటి అలౌక్యులు అనే అర్థంలో ప్రస్తుత కాలములో పరిపాటిగా వాడుతున్నాము. నిజంగా ఛాందసులంటే ఎవరు? ఛందస్సు తెలిసినవారే ఛాందసులని చెప్పాలి. అనాది సిద్ధముగా తొల్దొల్త ఛందోబద్ధమైనది వేదము గనుక, ఛందస్సుకు వేదమనే రూఢ్యర్థం ఏర్పడింది. అటువంటి వేదమును అధ్యయనం చేసినవాళ్ళు లౌక్య వ్యవహారములలో జౌక్యం కల్పించుకొనడం తక్కువగా ఉండేది. ఒక్కొక్క వేదబుక్కను వెనక్కి ముందుకు ఘన జట చెప్పతూ, చెప్పినదే చెప్పి వల్లెవేయడం వేదాధ్యయనంలో ఒక విశేషం. ఇప్పటికీ మనవాళ్ళెవరైనా చెప్పిన విషయమే పదిసార్లు తిప్పి తిప్పి విప్పిచెప్పి నొక్కినొక్కివక్కాణించినట్లయితే, చాదస్తంగా మాట్లాడతారని అంటాము. చాదస్తం అంటే ఛాందసం. అదే మనకిప్పుడు వెగటు అయిపోయింది.

కాని, యీ ఛందస్సు వేదాలకు మాత్రమే గాక, కవిత్వానికికూడా ముఖ్యలక్షణంగా ఉంది. యతిగణప్రాసలు తప్పకుండా గురులఘుప్రస్తారములతో చక్కని లయబద్ధంగాఉండాలి కవిత్వమని పెద్దలు అనేక నియమాలు నిర్ణయించారు. పుర్వాచార పరాయణులు ఆచార నియమాలతో ఎంత ఛాందసంగా ప్రవర్తిస్తారో యీ కవిత్వ నియమాలతో అంత ఛాందసంగా ప్రవర్తించిన కవులు కూడా తయారైనారు. సాధు రేఫకు శకటరేఫకు యతిస్థానంలో మైత్రి ఉండవచ్చునా ఉండకూడదా అనే ధర్మ సందేహంతో రాద్ధాంత సిద్ధాంతములుచేసినవాళ్ళు ఉన్నారు. అఖండ యతి వాడవచ్చునా? పద్యారంభంలో అయిదో అక్షరంగా "హ"కారం ఉపయోగిస్తే అమంగళం కాదా? ఈ విధమైన ధర్మ సందేహాలు యీ ఛాందసులకు ఎక్కువైనాయి. తద్దినం వంటకు వంకాయ కూర వండవచ్చునా కూడదా? సకేశలైన విధవలు ఆహితాగ్నుల వంటకుగాని తద్దినం వంటకుగాని పనికి వస్తారా? ఈ కుశంకలతో ధర్మశాస్త్రాలు తిరగవేస్తూ, చర్చలుచేస్తూ కాలక్షేపం చేసిన సనాతనిష్టులతో సమానంగా కవులున్నూ, కావ్య విమర్శకులున్నూ లక్షణ గ్రంథాలు తిరగవేసి ఒకరి కవిత్వంలో ఇంకొకరుతప్పులువెతుకుతూఉండేవారు— అప్పకవి చెప్పినది ఒప్పు అనేవారు కొందరు - నన్నయ ప్రయోగిస్తే చిన్నయ (చిన్నయసూరి) ఆమోదిస్తే చెల్లుతుందని వాదించేవారు మరి కొందరు.-అరసున్నాలు లేకపోతే భాషంతా మైలపడిపోయిందనే వాళ్లున్నారు. బండిరాలు సరిగ్గా ఉండకపోతే, చండాలపు కవిత్వమని పండితులందరూ బండబూతులు తిట్టేవారు.

అయితే ఆనాటి పండితులను మెప్పించవలసిన అగత్య మేమిటి? అనే సందేహ మొకటి కలుగుతుంది. ఆ కాలంలో అటువంటి అగత్యం విశేషంగా ఉండేది. ప్రభువుల సభలలోకివెళ్లి పండిత సత్కారం పొందడం, ఆ ప్రభువులకు ఏవైనా కావ్యాలు అంకితమిచ్చి మాన్యాలు, అగ్రహారాలు పొందడం, అందుమూలంగా కుటుంబపోషణచేసికొనడం, ఇది ఆనాటి కవులకు భుక్తిమార్గంగా ఉండేది. ఈ కాలంలో పరీక్షలు ప్యాసవడం ఎంతకష్టమో; ప్యాసయిన తర్వాత ఉద్యోగాలు సంపాదించడం కూడా అంతకంటే ఎక్కువకష్టం. అదే విధంగా పూర్వకాలంలో కవిత్వంసాధకం చెయ్యడం ఎంతకష్టమో, ప్రభువుల ఆస్థానంలోకి ప్రవేశించడం వారివల్ల సత్కారం పొందడం అంతకంటే ఎక్కువ కష్టంగా ఉండేది. ప్రభువుల ఆస్థానాలలో కొమ్ములుతిరిగిన పండితులు ఉండేవాళ్లు. రాజాగారి పహిల్వానులవలె వుస్తాదులై ఉండేవారు. బయటిఊరునుంచి ఏ పండితుడైనా ఆస్థానంలోనికివచ్చి రాజాగారి దర్శనం చేయాలంటే, ఆయనయెదుట తన విద్యాప్రదర్శనం చేయాలంటే యీ దిగ్గంతులవంటి ఆస్థాన కవులను మెప్పించాలి. వారిని ముందుగా మంచిమాట చేసుకోవాలి. లేకపోతే, కొత్తగావచ్చిన కవికి నిండుసభలో శృంగభంగం అయినదన్నమాటే.

తెనాలి రామలింగనివంటివాడు సభలో ఉన్నాడంటే చాలు. "నేనొకపద్యంచెప్పతాను. తప్పులులేకుండా వర్ణక్రమం తప్పకుండావ్రాయిచూద్దాం"అనిపరీక్ష చేస్తాడు "త్రువ్వట బాబా తలపై బూవటజాబిల్లి" అనే పద్యంవంటి పద్యం ఒకటి చదివి, సరిగ్గా ఉక్తలేఖనం వ్రాయలేదని ఒకకవిని సభలో గేలిచేసి జాలిలేకుండా పారదోలినాడు. డిండిమభట్టు అనే ఒక గొప్పకవి ప్రభుసత్కారంకోసం ఆస్థానంలోనికివస్తే అతనిని సభలో ఓడించి అతనికి బిరుదుగా ఉండిన కంచుఢక్కను పగులగొట్టించిపరాభవించాడు శ్రీనాథమహాకవి. "కుంజర యూథంబు దోమకుత్తుక జొచ్చెన్" అనే సమస్య నొక పండితుడిచ్చి ఆస్థానంలో ఉన్న కవులను పూర్తి చేయండని మర్యాదగా అడిగితే, తెనాలి రామలింగడులేచి ..."కొండకా! ఎక్కడి కుంజరయూథంబుదోమ కుత్తుకజొచ్చెన్!" అని నిండుసభలోనే దూషించాడు. ప్రభువులకుకూడా అర్థంకాకుండా పాషాణ కవిత్వం చెప్పి సెబాస్ అనిపించుకొనేవారు. "మేకతోకకు మేక తోక మేక" అనే పద్యం పంచ పాషాణాలనబడే పద్యాలలో ఒకటి దాని అర్థంఏమిటో నాటికి నేటికీ సాధించినవాళ్లు లేరు. ఇనుపగుగ్గిళ్లవంటి సమాసాలతో దుర్భేద్యమైన కోటలవలె కవిత్వం చెప్పితే ఆ రాజులు సంతోషించేవారు. చిత్రకవిత్వం, బంధకవిత్వం చెప్పి, దొమ్మర విద్యలుకూడా చూపించి సభలోకూర్చున్న రాజాగారిని దివానుగారిని ఆనందింపచేసేవారు. ఆశుకవిత్వంచెప్పి ఆవేశ పరవశులయ్యేవారు. రాజుగారు స్వయంగా అటువంటి సమయంలో ఆకవికి పాదపూజచేసి గండపెండేరం (కాలికి తోడా)తొడిగినాడంటే ఆశ్చర్య మేమీ లేదు. దివానులది చూచి దివానాలైపోయేవారు. ఎక్కడ అగ్రహారం కావాలంటే అక్కడ యిచ్చేవారు. "అనేకాగ్రహారంబు లడిగిన సీమలయందు నిచ్చె" అని అల్లసాని పెద్దనగారు చెప్పుకొన్నారు. అటువంటి "కృష్ణరాయలతోడ దివికేగలేక బ్రతికియున్నాడ జీవచ్ఛవంబనఘుచు" అని ఆయన కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు. అటువంటి కవులను అష్టదిగ్గజాలనేవారు. వారు అష్టావధానాలు అవలీలగా చేసేవారు.

కృష్ణదేవరాయల వారుకూడా కవిహృదయం తెలిసికొగలవాడు. కవులకు అగ్రహారాలిచ్చి హాయిగా అనుభవించండి అన్నాడు. ప్రతిదసరా పండుగకు గంధం తాంబూలంఇచ్చి పారితోషికములు వార్షికాలు సమర్పించేవాడు. ఆ రాయలవారు "ఆముక్త మాల్యద" స్వయంగా రచించారు. ఆయనకూడా గొప్పకవి. అటువంటివాడు గనుకనే పెద్దనగారి సత్తా గ్రహించ గలిగినాడు. పెద్దనగారుకూడా రాయలవారంతటివారు తనకు సత్కారం చేశాడంటే, ఏనుగెక్కినట్లుగా సంతోషించిఉప్పొంగిపోయినాడు. "ఎదురైనచో తన మదకరీంద్రముడిగ్గి కేలూత యొసగి ఎక్కించుకొనిరయ" అని మహదానందంతో పెద్దన్నగారు చెప్పుకొన్నారు. అల్లసాని పెద్దన్నగారు అష్టదిగ్గజాలలో ఒక దిగ్గజం. అయితే నేమి? ఈ దిగ్గజానికి ఆ రాయలవారి ఏనుగెక్కడం అఖండగౌరవం.

నాటినుంచి నేటివరకు ఆంధ్ర కవులను ఏనుగునెక్కించి సత్కారం చేస్తే, వారు పొందే ఆనందం అనంతం. బ్రా॥ శ్రీ॥ చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారు "ఏనుగు నెక్కినాము ధరణీంద్రులు మ్రొక్కగ నిక్కినాము" అని తమ నానారాజ సందర్శన అనుభవ విశేషములలో నొక్కివక్కాణించారు. వేంకటశాస్త్రిలుగారే కాదు. వారి శిష్యగణంలోని శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారుకూడా గజారూఢులై ఘనమైన స్వాగత సత్కారమును పొందియున్నారు.

కవిరాజైన శ్రీనాథకవి బంగారపు పల్లకీలలో తిరిగాడు. హేమపాత్రాన్నం (బంగారపు పాత్రలలో అన్నం) ఆరగించాడు. దీనారటంకాలలో దీరమాడి అయిశ్వర్యం అనుభవించాడు. కాని ఆఖరుకు "కలియుగంబుననికనుండగష్టమనుచు" స్వర్గస్థుడైనాడు. ఆ నాటి రాజు లెంత సమ్మానం చేశారో అంత అవమానం కూడా చేశారు. ఆరాజసింహాలముందు ఈ కవి దిగ్గజాలు నిలువగలవా? ప్రభువుల విలాసార్థంగా పండితులను ఆస్థానంలో ఉంచేవారు. రాజాగారిని ఇంద్రుడు చంద్రుడని స్తుతించి అంకితం ఇస్తే కావ్యకన్యకలను స్వీకరించి ఖుషీపుట్టితే అక్షరలక్షలిచ్చారు. వారికి అనుగ్రహం కలిగితే అగ్రహారం. ఆగ్రహం కలిగితే కారాగారం. రాజులపోషణలో పెరిగిన రాజాస్థాన కవుల గతి స్థితి ఇది. అందుకనే, అసహ్యం పుట్టి బమ్మెర పోతన్నగారు ఆ "కర్ణాట కిరాత కీచకులకు" తన కావ్యములను అంకితం యివ్వనన్నాడు. రాజాస్థానములలోకి రాజాలనన్నాడు. త్యాగరాజాగారు కూడా "నిధి చాలా సుఖమా రాముని సన్నిధి సుఖమా"అని రాజగౌరవమును తిరస్కరించాడు. రాజంతవాడు రాజు. నా అంతవాడిని నేను అన్నటువంటి యతిరాజు పోతరాజు, త్యాగరాజు కూడా. భర్తృహరి సుభాషితంలో యీ యతినృపతి సంవాదం చాలా బాగా విస్తరించి వర్ణించాడు. "రాజవునీవు మేముగురు రాట్కలిత ప్రతిభావిమానవిభ్రాజ మహోన్నతాత్ములము" అని రాజుతో సమానంగా నిలువబడేవాడే కవిరాజు. రాజు ప్రజలను పాలిస్తే, కవిరాజు ప్రజాహృదయాన్ని ఆకర్షించి హర్షింపజేస్తాడు. రాజులలో కూడా కవిత్వం చెప్పినవాళ్లున్నారు. రాయలవారు కవిత్వం చెప్పారు. భోజరాజు ఆస్థానంలోకి ఎవడు వచ్చినా, రాజుగారిని చూడగానే నోటివెంట కవిత్వం వచ్చేదిట-రాజులై కవులై విరాజిల్లిన రాజకవు లున్నచోట కవిరాజులు చేరుతారు. అటువంటిచోట రాజులకు కవులు విలాసవస్తువులు కారు. ఉభయులకు ఉండే మైత్రి క్షీరనీరన్యాయంగా ఉంటుంది.

కాని, ఈకాలంలో రాజులు, జమీందారు అంతరానమైపోతూఉంటే వారితో పుట్టిపెరిగిన ఆస్థానమర్యాదలు ఆచారసంప్రదాయాలు అడుగంటిపోకుండా చెయ్యాలనే కుతూహలం మన మద్రాసు మంత్రి అవినాశిలింగంచెట్టిగారికి కలిగింది. రెవిన్యూమంత్రి కళా వెంకట్రావుగారు జమీందారీలనురద్దుచేయిస్తే దేశమంతా కళావిహీనం చేస్తున్నారీకళావారు అనేభ్రాంతి యీ జమీందారీ వినాశకాలంలో అవినాశిలింగంగారికి కలగడం అమోఘంగా ఉంది. మద్రాసు ప్రభుత్వానికిఆస్థానకవులు కావాలన్నారు ఆరవంలోను, తెనుగులోను, మళయాళంలోను, కన్నడంలోను కూడా ఆస్థానకవులు ఉండవలసిందే. ఈ ఆస్థానకవులు అంకితం యిస్తామని కావ్యకన్యాదానంచేస్తే స్వీకరించి పాణిగ్రహణం చేసికొనడానికి అవినాశిలింగంగారికి ఆక్షేపణ ఉండకూడదు. ఇదికూడా సప్తసంతానములలో ఒకటి. కాని, కావ్యకన్యకను స్వీకరించిన అల్లుడు తన మంచితనం నిలుపబెట్టుకోవలసివస్తుంది. తనమీద కవిరాజులు కవిరాజవిరాజితం పద్యాలు చెప్పితే, అగ్రాసన మిచ్చి గౌరవించాలి. ఎదురైనచో తన మోటారుకారైనా ఆపి ఎక్కించుకోవాలి. "పొయెట్ లారియేట్" అంటే "కవిరాట్". అటువంటి కవిరాజును మంత్రి గౌరవించవలెనా? మంత్రిని కవిరాజు గౌరవించవలెనా? కవిరాజుహస్త్రం అవినాశిలింగంగారికీర్తి ఆచంద్రతారార్కం చేయగలదు. కవిరాజుల కవినాశమూర్తి లభించుట వారికి ఇహపరసాధనం కాగలదనియు, భువి దివి కాగల దనియు ఆశిస్తున్నాము.



విద్వాన్ భమిడిపాటి అప్పయ్యశాస్త్రిగార్కి (గుడివాడ) శ్రీ. దుర్గామల్లికార్జునరావుగారు "పాదపూజ" చేసినప్పటి దృశ్యం.

మల్లప్ప యెన్నోవిధముల నంతరము సంపాదించుటకు ప్రయత్నించియు విజయాదిత్యుని యుత్తరములచే విఫలీకృతయత్నుడై యాశ వదలుకొని యానాటికి సెలవు తీసికొని వెడలిపోయెను. విజయాదిత్యుడును మల్లప్ప వ్యంగ్య వాక్యము లర్థమయ్యు నర్థము కానివానివలె ప్రవర్తించెను.

శక్తివర్మ యనుభవము లేనందున వీరి తేనెమాటలకు లొంగిపోయి ప్రమాదము తెచ్చుకొనడుగదా!

ఇట్లు తలంచుచు చిత్తశాంతి కొరకు పంపన భట్టోపాధ్యాయులను దయచేయవలసినదని వార్త నంపనాతడు వచ్చెను. ఈ పంపనభట్టోపాధ్యాయులు పరాశరగోత్రుడు. వేదవేదాంగవిదుడు, మీమాంసాప్రవీణుడు. అంతియకాక యాతడు అగస్త్యునివలె చుళికీకృతసమస్త సాహిత్యసాగరుడు. పాఠప్రవచనమున ప్రవీణుడు. ఐనను సభాముఖమున మాటాడగల నేర్పు కలవాడు కాడు. అదియుంగాక యాతని కావ్యపక్షపాతము చీదమార్నని నిశితతర్కము ముందు తరచుగా నిలువక పరాస్తమగుచుండుటచే రాజసభలో నాతడు మాట్లాడ జంకుచుండెను. కాని యాతని ప్రతిభ యేకాంతప్రసంగములలో మిక్కిలి శోభిలుచుండును.

చాలప్రొద్దు పంపనభట్టోపాధ్యాయులతో శాస్త్రవిచారణచేయుచు విజయాదిత్యుడానాడు గడపెను. శాస్త్రగ్రంథము లన్నియు సంస్కృతములో నున్నవి. శాస్త్రవిషయములు భాషా గ్రంథస్థ మేల చేయరాదు? ఇది విజయాదిత్యుని ప్రశ్న.

ఉపాధ్యాయుడది యనేక శాస్త్రోదాహరణలతో విశదీకరించెను. జైమినీయధర్మసూత్రములున్నవి. అవి వేదమంతయు మనస్సులోనుంచుకొని పుట్టినవి. ఆంధ్రభాషలో పాఠము చెప్పిన ధోరణిగా విస్తరింపదగునే గాని యట్టిసూత్రము వ్రాయుట సాధ్యము కాదు. భరత ధర్మసారము సులభముగా గ్రహింపదలచినవారికి వేదవ్యాసకృత మహాభారతమే శరణ్యము. అది ఆంధ్రీకరించుట సాధ్యమా!

3ర

సువర్ణ ద్వీప యాత్ర

అనాదిగా భరతఖండమునకు బంగారు పండు భూమి యను ప్రతీతి కలదు. కాని మానవుల తృష్ణకు అంతము లేదు. భరతఖండవాసులకు గూడ ఈ ధన తృష్ణకలదు. ఇంతకంటె గూడ నెక్కువ బంగారు సులభముగా దొరుకునని ప్రతీతిగల యితరభూములకు భరతఖండవాసులుయాత్రలు సాగించినారు. అట్టిభూములు ప్రధానముగ తూర్పు సముద్రమున నెన్నియో కలవు. అవి ఎక్కువభాగము ద్వీపములు, కొన్ని ద్వీపకల్పములు. అందులో ప్రధానములు, సుమిత్ర ద్వీపము, యవద్వీపము, సువర్ణ ద్వీపము, మధుద్వీపము, బలిద్వీపము, లంబకద్వీపము, కుంభద్వీపము, తామ్రద్వీపము, మలయద్వీపకల్పము. వాని నన్నిటిని పేర్కొనుట యసాధ్యము. కేవలమవి యసంఖ్యాకములు, వేనకువేలు కలవు. ఇట్లు వానికి ప్రత్యేకనామము లున్నను అన్నిటికి సామాన్య నామము సువర్ణభూమి, సువర్ణద్వీప మనియే!

భరతఖండమున తూర్పు సముద్రతీరమున ముఖ్యమగు రేవు పట్టణములు మూడు. ఉత్తరమున గంగానదీద్వారమునొద్ద తామ్రలిప్తి, వేంగీతీరమున కృష్ణానదీ ముఖద్వారసమీపమున మోటుపల్లి, దక్షిణమున కావేరీనదీ ద్వారమునొద్ద నాగపట్టణము. ఇవి ప్రధానములు ఇవిగాక మరియు ననేకములు గలవు. సువర్ణద్వీపయాత్రచేయు నావలు సూటిగా సముద్రములోనికి ప్రయాణముచేసి నక్కవరము (నికోబారు) దీవులు చేరుకొనును. ఆకిమ్మట సుమిత్రద్వీపమున ఇంద్రగిరినదీముఖద్వారమునో మలయద్వీపకల్పము దక్షిణాగ్రమున సింహపురమునో చేరుకొనును. అచ్చటనుండి యా నావలలోననె గాని యితర నావలపైగాని నిర్ణీతప్రదేశము చేరుకొందురు. రాజరాజ నరేంద్రుని మామగారగు గంగైకొండరాజేంద్ర దేవుడు నక్కవరము ద్వీపములను, మలయ ద్వీపకల్పమున ద్రావిడ వాఙ్మయములో కడారమను నామముగల కటాహమును అందలి విద్యాధర తోరణమును జయించి, పన్నాయ్, మలైయూరను పర్వతదుర్గము, మాయిరుడింగమను సముద్ర జలదుర్గమును, మరియు ననేక ప్రదేశములను జయించెను. కటాహాధిపతియగు విజయోత్తుంగవర్మ యెదిరింపగా నతని జయించి బంధితుని చేసెను. ఇట్లచ్చట ననేకభూభాగములు జయించి యంతటికి శ్రీవిషయమను నామమిడి చోళరాజ్యమున నొక మండలముగా జేసెను.

అట్లాదీవుల జయించిన మొదటి భారత చక్రవర్తి గంగైకొండ చోళుడుకాడు. అప్పటికి వేయి సంవత్సరములకు పూర్వమే ఘూర్జర రాజకుమారు డొకడు యవద్వీపము జయించెను. తదాది యచ్చట నారాజపుత్రుని పేర శకమారంభమయ్యెను. అట్లే ఆ ప్రదేశము లన్నియు భరతఖండములో నుండి తెగి దూరముగానున్న ఖండముల వలె నుండెను.

ఈ దీవులకు ముందు వర్తకులు వ్యాపారార్థము వెళ్లుచుండిరి. నెమ్మది నెమ్మదిగా బౌద్ధ శ్రమణులు, జైనశ్రావకులు వారి ననుగమింప సాగిరి. వర్తకము, దాని వెంట నొకమతము, దానివెంట వలసలు ప్రారంభమయ్యెను. వలస లొక్కొక్కతరి శాంతముగా జరుగుచుండెను. కాని తరుచుగా నవి యా ద్వీపవాసులకు ఇష్టము లేకపోవుటచే వలసలే దండయాత్రలుగా మారజొచ్చెను. ఒకొక్కక్కమారు జయము వీరిది, ఒకొక్కక్క మారుజయము వారిది! నెమ్మదిగా ఆ ప్రదేశములపై భారత ముద్ర స్థిరమయ్యెను. దేవాలయములు వెలసెను. భారత రామాయణములు పాదుకొనెను. సంఘారామములు నిండి పోయెను. భరతఖండములో నెక్కడ సముద్ర తీరప్రాంతముల జీవనము కష్టముగా నున్నను, కల్లోలములు చెలరేగినను జనులు సువర్ణభూములకు వెళ్లుట పరిపాటి యయ్యెను. ఇది ముఖ్యముగా బౌద్ధమతానుయాయులలో ప్రబలెను.

బౌద్ధధర్మమున వర్ణవ్యవస్థలేదు. భారత ధర్మము వర్ణవ్యవస్థపైనా ధారపడియున్నది. భరతభూమిలో పుట్టిన ప్రతి వ్యక్తి నివద్దనుకొన్నను తప్పని సరిగా ఈ వర్ణవిభాగ మంటుకొనును. ఈ మట్టియే వర్ణభేదముతో చేయబడినట్లు తోచును. వర్ణభేద మంగీకరించిన బౌద్ధధర్మము జైనముగా పరిణమించి రూపాంతరములతో నిలువగలిగెను.

కేవలము బౌద్ధము ఈదేశమునకు బయటి నుండి వచ్చిన వారిలో నుద్భవించెను. అట్టి వారు ప్రాకిన ప్రదేశములలో నదియు వ్యాపించెను. ఎట్లైనను శుద్ధబౌద్ధము భరతభూమిలో నిలువలేక లోక మంతటను వ్యాపించెను. పశ్చిమ భూములలో జందు, యూదు, క్రైస్తవ, మహమ్మదీయమతములుగా పరిణామము నొందెను; తిబ్బతీదేశములో లామా మతమయ్యెను; చీనా, నిప్పాను, బ్రహ్మదేశము, సువర్ణ భూములు, సింహళము ఇత్యాది ప్రదేశములలో స్థానిక మతములతో కలసి హీనయాన మహాయానము లయ్యెను.

భరతఖండములో బౌద్ధధర్మవ్యాపనకు అడుగడుగునకు విఘ్నములే సంభవింపసాగెను. కాని భరతఖండములో దీర్ఘకాల మున్నందున, వైదికధర్మము, సాంఖ్యము, యోగము ఇత్యాదులతో సాహచర్యమువలన బౌద్ధధర్మమునకు నూతనశక్తి కలిగెను. అందుచే ఇతర భూములలో దానికి నల్లెరుపై బండి నడకవలె వ్యాపనము సులభసాధ్యమయ్యెను. అది యే భూమిలో ప్రవేశించిన నా భూమిలోని జనులవిశ్వాసాదులు గ్రహించుచు వారి ధర్మముగా పరిణామము పొందసాగెను. సువర్ణ భూములకు బౌద్ధులు ఖడ్గములు, వర్తకులు సరకులు తీసికొని పోవుచుండగా, బౌద్ధశ్రమణులు మైత్రి, శీధ్వజములు తీసికొని వారివెంట ననుగమించుచుండిరి.

ఇట్లు బౌద్ధము రూపాంతరములు పొందుచున్నను చాల కాలమువరకు ఉత్తరదేశములను తూర్పుభాగములను మాత్రము భరతఖండమందలి మూలబౌద్ధముతో సంబంధము తీరిపోలేదు. శాక్య గౌతముడు మొదటి బుద్ధుడు కాడు. శాక్యగౌతముడు ప్రథమమున బోధిదీక్ష దీపంకర బుద్ధుని యొద్ద గ్రహించెను. నాలుగు అసంఖ్యేయ కల్పములును, లక్షకల్పములును గడచినవి. అందులో ఇరువదినలుగురు బుద్ధులు గడచిరి. ఇంత కాలమును జన్మలెత్తుచు ఇందర బుద్ధుల యొద్ద దీక్ష గైకొనుచుండెను. చివరకు కాశ్యపబుద్ధునియొద్ద దీక్ష తీసికొనెను. ఈ కలియుగాదిగా 2487 వ సంవత్సరమున హిమాలయ భూములలో శుద్ధోదనుని పుత్రుడై వైశాఖపూర్ణిమనాడు జనించి, వైశాఖ పూర్ణిమనాడు దారాపుత్రుల వదలి, వైశాఖపూర్ణిమనాడు బుద్ధత్వమునొంది వైశాఖ పూర్ణిమనాడు పరినిర్వాణము నొందెను. ఈ గౌతమ బుద్ధుడు మగధరాజ్యములో పర్యటనము చేసి మత ప్రవర్తకుడయ్యెను. బుద్ధుని పాద నిక్షేపముచే భరతభూమి పవిత్రమైనది. ఆతని అస్థిశేషములు అశోక చక్రవర్తి భరతఖండమంతట వెదజల్లి ఈ భూమినే మహా చైత్యముగా మార్చివేసినాడు. ఇట్టి విశ్వాసములు బౌద్ధులకు కలవు కనుక లోకమందలి బౌద్ధనామధారుల కెల్ల భారతభూమి, యూదులకు పాలస్తీను వలెను, క్రైస్తవులకు జరూసలేమువలెను, మహమ్మదీయులకు బర్బరదేశమువలెను, పుణ్యభూమియయ్యెను. అందుకు ముఖ్యముగా గౌతము డవతరించిన వేణువనము, సంబోధి పొందిన బుద్ధగయ, ప్రథమధర్మప్రవర్తనచేసిన సారనాథము, మహాపరి నిర్వాణము పొందిన కుశీనగరము వారికి పవిత్రాతి పవిత్రదేశములు. అవి వారికి తీర్థయాత్రాస్థలములు. అవియే భరత భూమిపైకి ఎన్నియే దండయాత్రలకును అంతః కలహములకును కల్లోలములకును గూడ కారణము లయ్యెను.

సువర్ణద్వీపయాత్ర యనాదిగా సాగుచున్నను పెద్దయెత్తున వేంగీమండలము నుండి యిప్పటికి ఏబదియేండ్లనుండియే సాగినది. రాజరాజనరేంద్రుని పెత్తండ్రి శక్తివర్మ యిప్పటికి రాజ్యమునకు వచ్చి ఏబదిమూడేండ్లయినది. అంతకు పూర్వము ఇరువది యేడేండ్లు దేశమరాజకముగా నుండెను. రాజరాజ నరేంద్రుల పితామహులగు దానార్ణవులను దూరపు జ్ఞాతియగు బాదపరాజు హత్యజేసి రాజ్యమాక్రమించుకొన జూచెను గాని సామంత దండనాథులును ప్రజలును బాదపరాజు పాలన మంగీకరింపరైరి. బలవంతులు బలహీనులను హింసింప జొచ్చిరి. భూవసతులు లేక కేవలము శిల్పము, నేత, అద్దకము, వైద్యము, కంచరము, కూలి ఇత్యాది వృత్తులపై జీవించువారి జీవనము కష్టతరమయ్యెను. వారప్పుడు విశేషము బౌద్ధాభిమానులు! సంఘారామములు సువర్ణభూములకు అట్టివారు వలసలు పోవుట కెన్నియో వసతులు కల్పించెను. అందుచే సంఘారామములు కొంత ధనవంతము లయ్యెను. నాలుగల వర్తకులు లక్షాధికారులును కోటీశ్వరులును నైరి. అట్లా ఇరువదియేడేండ్లును వేంగీరాజ్యమునుండి వలసలు నిరాఘాటముగా సాగిపోయెను.

మరల వేంగీరాజ్యములో చోళ ప్రభువుల సహాయముతో రాజస్థైర్య మేర్పడిన పిమ్మట వలసలు తగ్గిపోయినవి. అయినను వలసపోయి సువర్ణ భూములలో ధనవంతులై పూర్వబంధువులను దర్శించుటకును పుణ్యక్షేత్రములు దర్శించుటకును వ్యాపారము సాగించుకొనుటకును కొందరు మధ్యమధ్య వేంగీభూమికి వచ్చి పోవుచుండిరి. అట్టివారు సువర్ణభూములలోని సౌఖ్యము అతిశయోక్తులతో వర్ణించి చెప్పుచుండ వినిన వారికి అచ్చటికి వెళ్ళవలె నను వ్యామోహ మతిశయింప సాగెను. అక్కడికి వెళ్లిన వారికి తమకు సజాతీయులు మరికొందరు వచ్చుట తమ స్థైర్యమునకు బలమైనందున నట్టివారి యుత్సాహము నెక్కువ చేయుచుండిరి. వర్తకులు నావలకు తెచ్చు నమూల్యవస్తువులవలనను వారు స్వలాభార్థము చేయు నుద్బోధలవలనను మరింత యుత్కంఠ యతిశయించుచుండెను. అట్లు మధ్య మధ్య వలసలు సాగుచునే యుండెను. అన్ని వలసలకును సంఘారామములు సహాయకారులగుట పరిపాటియయ్యెను.

ఈ వలసలు ఒకొక్కక్క సమయమున వేంగీ ప్రభువులకు సమ్మతములే, కాని కొన్ని ప్రదేశములు నిర్జన మగుచున్నందున తరుచుగా వారికిష్టము లేకుండెను. అయినను వాని నరికట్టకుండుట వారి యాచార మయ్యెను. బౌద్ధ సంఘారాములకు ప్రజాసామాన్యములో పలుకుబడి సంపాదించుకొనుటకు వలస లేర్పాటు చేయుట యొక యాధారమయ్యెను.

ఈమధ్య నెన్నడు లేనంత విపులమైన వలస యీసంవత్సరము వైశాఖశుద్ధపూర్ణిమకు సారంగధర మెట్ట సంఘారామమునుండి బయలుదేరునని వేంగీమండలమంతయు మ్రోగి పోయినది. అది నిజ చైత్ర శుద్ధములో ప్రారంభించిన సంత మూలకముగాను క్రీడావినోదములమూలమునను మరింత వ్యాప్తి చెందెను. నాగరాజులు సువర్ణ భూములలోని సంపత్తు జీవన సౌఖ్యము కథారూపమున గానములు చేయసాగిరి. జీవనము జరుగని పేదలు అశాంతిగల యువకులు విశేష ధన మార్జించవలెనని తృష్ణాతురతకలవారు వ్యవహారములు సద్దుకొని త్వరగా బయలుదేరసాగిరి. చీనా నుండి వచ్చిన మహాత్ముడు

వారి ప్రయాణమునకు ముందు మహోపదేశము చేసి యాశీర్వదించు నని కూడ వార్త వ్యాపించెను. వలస వెళ్లదలచిన జనము చైత్రమాసాంతము నుండియే రాజమహేంద్రవరమునకు గుంపులు గుంపులుగా కూడ సాగిరి. ఇందరు జనమొక్కమారుగా నొకచోట కూడుచున్నందున వారికొరకెన్నియో సౌకర్యములను కట్టుదిట్టములును జేయవలసి వచ్చెను. పౌరారోగ్యమునకు భంగము కలుగకుండ చేయుట మొదటి పని. అట్టి నియమము లను ఆగంతుకులు తెలిసికొని వానిని పాలించునట్లు చేయుట రెండవ పని. ఇట్లు వలసలు పోవువారు ఎట్టికార్యము లాచరించుటకును వెనుదీయని సాహసులు. అందును సమూహముగా చేరినవారు చేయు దుండగములు పట్ట శక్యము కాదు ఇన్ని పనులు నిర్వర్తించుటకు సమర్థులగు రాజభటు లెందరేని అవసరము. ఎక్కువ పని యుండని దూరమండలములనుండి సహస్రసంఖ్యలుగా భటులను రాజమహేంద్రపురము పిలిపించిరి. అశ్వికులు శీఘ్రముగా వార్తలు తెచ్చుచుండిరి. గజ బలములు పురరక్షణమునకు కేంద్రములలో నిలిచి యుండెను. పదాతులంతట ప్రసరించి యుండిరి. ఈవిధముగా, నెమ్మది నెమ్మదిగా రాజమహేంద్రపురము శాంతి నిలయమగు పట్టణపు లక్షణములు లేక మహాసైన్యము ప్రోగైన స్కంధావారమువలె మారిపోయెను.

బౌద్ధుల కన్నిటికంటె వైశాఖ పూర్ణిమ పెద్ద పండుగ. ఆనాడు ప్రతి బౌద్ధసంఘారామములోను, చైత్యములోను, క్షేత్రములోను పెద్ద ఉత్సవము చేయుదురు. ఆ తిరునాళ్లకు మూగ ప్రజలు ప్రభలు కట్టుకొని పోవు నాచారము కలదు. చిన్న మ్రొక్కుబడు లున్నవారు పీఫుప్రభలు కట్టుకొని వెళ్లుదురు. ధనికులగువారు బండ్లపై ప్రభలు తీసికొను పోవుట కద్దు. పసుజాడ్యములు వచ్చినప్పుడు బౌద్ధదేవతలకు మ్రొక్కుకొనుట కలదు. సమయమైనచో నా పసువులతో శకటముకట్టి యందుపై ప్రభపెట్టి దేవతకు ప్రదక్షిణము చేయింతురు. నావలు నడుపువారు తరచుగా బౌద్ధాభిమానులు. వారు యాత్రికులను తీసికొనిపోవుచు నావలపై పెక్కొలది ప్రభలు పెట్టువారు.

ఇట్లనేక విధములగు ప్రభలున్నను అవి ప్రభాస్వరూపమును నిర్వర్ణించునవి కావు. ప్రభ యొక్క లాంఛనము! ఒక్కొక్క సమితి కొక్కొక్క ప్రభయుండును. ఒక్కొక్క శ్రేణి కొక్కొక్క ప్రభ యుండును. ఒక్కొక్క గ్రామమునకుగాని మండలమునకుగాని ప్రత్యేక లాంఛనము లుండును. వానితో ఒక్కొక్క శ్రేణి లాంఛనము మేళవించును.

ఏ వృత్తికి సంబంధించిన ప్రధానసాధనములు ఆ వృత్తిచే జీవించువారికి పూజ్యదైవతములు. పడవనడపువాడు అనుదినము పడవకు నమస్కరించి పడవ సాగించును. కుమ్మరుడు చక్రమును పూజించును. మగ్గము సాలీనికి పవిత్రము. మంగలి పొదిని దైవముగా భావించును. శిల్పికి బాడిత, ఉలి, సుత్తి, దిమ్మె, ఇత్యాదులు దైవతములు. తెలుకులకు గానుగ, చాకలికి బాన, గౌడుకు తాడి, గొల్లకు కంబళి— ఈ విధముగా నెన్నియేని పూజించును. కర్షకుడు ఏటేట నాగలిని కోలేరును పూజించి ఏరువాక సాగించును.

ఇట్లే వర్తకశ్రేణులకుగూడ వర్తకద్రవ్యమును బట్టి ప్రభాలాంఛనము మారును. ఈ వర్తకసంఘములకు సమయములనియు నామాంతరము కలదు. పదునెనిమిది సమయములు ప్రసిద్ధమైనవి కలవు. వ్యాపారము చేయు దినుసునుబట్టి సమయము భేదించును. 'సమయము'న కొక లాంఛనముండును. అదియే ఆ 'సమయప్రభ.' అయ్యావళీ వర్తకసంఘమునకు గెద్దవంటి యాకారము గల 'వజ్రభైషిగ' చిహ్నము.

ఎవరి లాంఛనము వారి ప్రభాచిహ్నము! బౌద్ధ చిహ్నములకు బుద్ధవిగ్రహము, బోధి ద్రుమము, అపసవ్యమగు స్వస్తికాకారముగల ధర్మచక్రము. ఇందులో నొకటిగాని కొన్నిగాని యన్నియుగాని బౌద్ధప్రభ లన్నిటిమీద నుండును. ఏ మండలమువారిది, ఏ శ్రేణివారిది, లేక, ఏ సమయమువారిది తెలియజేయు చిహ్నములు గూడ నుండును. ఒక్కొక్కతరి గ్రామ పుర సంజ్ఞలుగూడ నుండును. ఈ సంజ్ఞలు మారవు. చిత్రకారుల యూహకొలది వాని యలంకారములు మారవచ్చునే గాని స్వరూపము మారదు. తద్జ్ఞులైనవారు ప్రభ చూచినవెంటనే యది యెవరిదో తెలిసికొనగలరు.

బౌద్ధుల తిరునాళ్లలో ప్రారంభించినది శివాలయములకు చేరు భక్తజనులుగూడ నవలంబింప సాగిరి. వానిలో బౌద్ధచిహ్నములు తీసివేసి శైవచిహ్నము లెక్కించిరి. రంగురంగుల చిత్రములతో నీ ప్రభ లెంతయేని నయనాకర్షకముగ నుండును. చిత్రరచనలో సమర్థులగు చిత్రకారుల కందుకై విశేష ధన మిచ్చువారు.

వలసలుగూడ ఉత్సవములనే అనుకరించుచుండెను. ఒక్కొక్క జట్టు ఒక్కొక్క ప్రభ కట్టుకొని వచ్చుచుండిరి. ఆ వలస పోవువారిని కడసారిచూచి సాగనంపుటకు వారి బంధువులును బహుదూర మనుగమించుచుండిరి. ఈ వలసలు వీరోత్సవములవలె పరిణమించును. ప్రభలు దారివెంట పట్టణములలో పల్లెలలో నూరేగును. అవి ప్రధానాలయములలో నాగును. కొందరు వీరావేశముతో వీరాంగము వేయుదురు. సమర్థులగువారు ఖడ్గములు చదువుదురు.

ఈ నాడు అమరావతి నుండి వేంగి పట్టణము మీదుగా రాజమహేంద్రవరమునకు వలసజనము వచ్చిరి. వారివెంట నొక పెద్ద ప్రభ వచ్చెను. అది పురవీథుల నూరేగుచుండెను. దానిపై ప్రత్యేక లాంఛనము వ్యాఘ్రము. ఖడ్గములు చెప్పువారు సమర్థులనేకు లుండిరి. ఒకడొకచోట చెప్పిన మరియొకడింకొకచోట చెప్పుచుండెను. అందులో నొకడిట్లు ప్రారంభించెను. అతడు ఖడ్గము చేతబట్టి ఆవేశముతో చెప్పుచుండ డోళ్లు మ్రోగుచుండెను. సుష్య శంఖశబ్దములు మిన్నుముట్టెను.

హుమ్మని గాండ్రించి
 హాళ్ళరభ! హాళ్ళరభ!
యొక బొబ్బవేసినఁ
 హాళ్ళరభ! హాళ్ళరభ!
చంద్రుడే మినుమేఁడ
 హాళ్ళరభ! హాళ్ళరభ!
చదికిలబడు!
 హాళ్ళరభ హాళ్ళరభ!
వన్నె వన్నెల మేని, చిన్నెలు పలకింప!
 కన్నులే పోవును చిన్న పులికి
భద్రగంభీరమా రౌద్రాకృతి గాంచి,
 క్షుద్రజంతువు నేల జొచ్చిపచ్చు
ఒకసారి కనువిచ్చి, యొడలు జృంభణచేయ
 వడవడ మని భూమి వడకిపోవు!
మారవవిద్రావణాకారఘోరశత్రు
 దారణాకార వ్యాఘ్రావతార, శరణు!
వీరసారంగ బౌద్ధవిహారసిద్ధ
 నాగహార ప్రవృద్ధపున్నాగ శరణు!
హాళ్ళరభ! హాళ్ళరభ! హాళ్ళరభ!

పింగళి సూరన, తెనాలి రామకృష్ణుడు, భట్టుమూర్తి

(10 వ పేజీ తరువాయి)

సూ: రామకృష్ణుడంది నిజమే: దాన్లోగూడా మంచి గొడుగు లుంటాయ్. కొందరికి కవిత్వం సహజంగా దొరుకుంది, కొందరికి పట్టిస్తుంది.

రా: మా పద్యాల్నే మళ్లీ చదవ నంటవే యితర గ్రంథాలేం జూచావయ్యా?

సూ: నీ కొంటెతనం మానవుకదా! మిగతా వాట్ని చూడకుండా రచనాకౌశలానుభవమున్నవాడనగ్గ మాటకన్నా యెక్కువన్నానా!

నే: మరొక సందేహం! రామకృష్ణయ్యగారూ! మీకు కొబ్బరికాయంటే యిష్టమా, మీ పాండురంగ మాహాత్మ్యాన్ని నారికేళపాకంలో ఉంచారు?

రా: ఏమిటా ప్రశ్న? కొబ్బరి కాయంటే యిష్టంలేని అభాగ్యు డెవడు? తీ పొచ్చిందా, కొంచెం పీచు దీసుకుని, పై చిప్పను పగలగొట్టి లోపలి నీళ్ల న్నాగి, కొబ్బరి నారగించలేరూ? ఎప్పుడూ ద్రాక్షపండ్లకు మల్లే నోట్లో కాయేసుకుని, ఆహా, తియ్యగా వుందని తలూపే చప్పిడి పనే యిష్టమైందా మీకు? ఇట్లాటివాం డ్లతి రసాల్నే మాగిస్తారా? ఇంకొక మాటడుగుతా: సంఘంలో జట్టిప్పుకు తిరిగితే బాగుంటుందా, తగుమాత్రం వస్త్రధారణం బాగుంటుందా— అట్లాగే కవిత్వంలో బంగనబయలు కవిత్వ మిష్టమా, అర్థం కొంచెం గూఢంగా నుండే దిష్టమా? కవిత్వం ద్రాక్షాసవం గాదని తెలుసుకోలేరూ?

నే: అదేమిటండీ, ప్రబంధమంటే, ప్రూర్వోత్తర మెత్తుతారూ! మీ కష్టమా, అంటే యిదంతా చదివారు.

రా: చదవక, నీ భవిష విమర్శ కనుకూలించే పరిస్థితు లమర్చి మాట్లాడ్దా ననుకున్నావేం?

భ: (నాతో) ఖబడ్దార్! (రామకృష్ణుడితో) లాకపోతే, కవిత్వం నలుగురికి అర్థం కావక్కర్లేదా అని ఆయనడిగితే యేమిటో సో దెందుకయ్యా?

రా: నలుగురికీ అంటే?

నే: చదువుకున్న వాండ్లకు.

రా: ఎదువుకున్న వాండ్లంటే ఓనమా—లు దువుకున్న వాండ్లకా; అర్థజ్ఞానం కుదిరిందాకా చదువుకున్న వాండ్లకా?

నే: రెండోరకం వాండ్లకే.


రా: రెండోరకం వాండ్లంటే, మా మీ కాలాల్లో భేద ముంది: మా కాలంలో పంచకావ్యా లృదువుకుంటే అజ్ఞానం కుదిరేది. మీ కాలంలో పెద్ద పరీక్షలు పాసయినా కొన్ని సుమతీశతకం పద్యాలే అర్థంకావుగా? అందుకని మా కాలంలో నట్లాటివాండ్లకు కొంచెమాలోచిస్తే మా కవిత్వ మర్థమయ్యేది. మీ కాలంలో వాండ్లకన్నావ్, ఇట్లాటి భాషాజ్ఞానశూన్యశిరోమణు లయిపోతారని మే మనుకోలేనపుడు వీండ్ల కనుకూలించేవి వ్రాయలే దన్న నింద మామీద పెట్టకదా. అప్పటికే మీ కాలంలో అందరికే అన్నీ అర్థమయ్యేవా అంటే చాలా పద్యా లర్థమయ్యేవి. అన్నీ యెవ్వరికో దప్ప అందరికీ యెప్పుడూ అర్థంకావు.

నే: చిత్రం. నాకు నచ్చజెప్పారన్న మేం, బుద్ధొచ్చేట్ట చెప్పారు. ఇక సూరన్నగారూ, ప్రభావతీ ప్రద్యుమ్నం కథను పరిశీలిస్తే కొంచెం ఆంధ్రనైషధాన్ననుసరించినట్లుందే!


సూ: అవి, కొంతవర్ప మీ కాలంవాండ్లు చేస్తున్నమాట గత్యాగత్వ, మాకు తెలిసింది. ముందీ అనుసరణ సంగతి: ఆంధ్రనైషధాన్ననుసరిస్తే నది నన్నయభారతాన్ననుసరించింది. కొన్ని నన్నయనాట్యాలే వ్యాయ్ కాళ్లో— అటుపైన ఆంధ్రనైషధం శ్రీహర్షుణ్ణనుసరించింది. శ్రీహర్షుడు వ్యాసుణ్ణనుసరించాడు. వ్యాసుడు విన్నదాన్ననుసరించాడు. ఇట్లా మూలాన్ని లాగుదాం ప్రద్దానికి. దానివల్ల మూలం దొరికిందనే సంతోషం కొంత, ఫలానికవి కడుగొప్పవాణ్ణనుకున్నాడు, వీడి బ్రతుకు తైబడ్డది, ముందా యావాతు లేకుంటే వీడేం జేయగలిగేవాడు—అని వీణ్ణి నిరసించడాని కవకాశముంటుంది. అదెక్కువ దుమకరిస్తుంది—ఆ కవి తాను ఘనుణ్ణని గర్వపడితే, లేకుంటే అతను గట్టివాడని అంతా బ్రహ్మరథం పడితే. నా విషయంలో నా రెండూ లేవే! నేను రాఘవ పాండవీయంలో 'శోభి నానుకంపా ఘనబుద్ధి చూపెద చమత్కృతియుత్కృతి మత్కృతిత్వయుక్' అని చెప్పుకున్నా. ఇక నా బ్రహ్మరథ విషయం దాన్నెవరూ పట్టలేదు. ఎవరైనా ఊసుపోక పట్టినా నా తర్వాత వారు, అది నా దోషం కాదే? ఏదో యెవరైనా పెద్దవారడిగారనో, నాకు దనసహాయ మెక్కరుండి అంకితరీత్యా సమకూర్చుకుందామనో, లేక పోతే ఏదో తోచి వ్రాద్దామన్న వాంఛచేతనో వ్రాశాగాని, నా గ్రంథాలన్నీ అంతకన్నా యేదో మహాకార్యం చేస్తున్నామని అనుకోలేదు. ఇంతకూ, వాడ కోస మనుకరణాంబేదే అందాం, దాన్లోమటుకు మించు చూపించరాదూ? వట్టి చప్పిడి అనుకరణ లోకానికి రుచించి గ్రంథాన్ని నిలుపుతుందా? మరొకటి, సృష్టిలో అనుకరణ లేం దెక్కడ? ఎందుకీ వ్యర్థ పరిశోధనా విభూతి?

రా: బాగా చెప్పావయ్యా సూరన్నా! ఇంతకూ మావాడి గ్రంథంలో హంస నొకటేగా నైషధంలోది. దాన్లో వుంది దీన్లో వుంది కాబట్టి యీయన నాయన్ననుకరించాడనా? మావాడి కవిత్వంసంగతి నేం జెప్తా విను:—ఇతని గడుసుదనం సంగతి చెప్పినప్పుడితని కవిత్వం సంగతి కొంత చెప్పా. మిగతాది కావలసింది యితనే రాఘవపాండవీయంలో నిందాకన్న పద పాదంలో జెప్పుకున్నాడు. ఈయ నేం స్వతంత్ర పంథ నేర్పరచానని యెక్కడా చెప్పుకోలా. కాని కథ నడిపించే చమత్కారం తిక్కనగారి తర్వాత నీయనకే వుందని నేను ఘంటాపథంగా చెప్తా. ఆ హంస, దాని మచ్చరూపూ, యెట్లా మాట్లాడుతుందీ, ముద్దుల మాట గద్దూ మాట్లాడుతుంది! అంతేనా, కళాపూర్ణోదయం— నీయన చూపిన సంభాషణా కౌశలం జూడూ! మిగతా కవిత్వాంగా లన్నావ్, ఆంధ్రలో కాని కంతా విశదమే. ధారాశుద్ధి, భావపటిమ, కల్పనాచమత్కారం యింకా యింకా, మావాడు...ఇంతకంటే యేమీ చెప్పలేను. [సశేషము]

సర్ చిమన్లాల్ సెతల్వాడ్ స్మృతి



ప్రముఖ భారతీయ నాయకుడు సర్ చిమనలాల్ సెతల్వాడ్, తన 81 వ ఏట ఈమాసం 10వ తేదీని జీవితం చాలించారు. వారి శవాన్ని శ్మశానానికి తీసికొనిపోయేముందు పుష్పమాలాలంకృతంచేసిన దృశ్యం.



దహన సంస్కారపూర్వము, శ్రీయుతులు బి. జి. ఖేర్., యం. ఆర్. జయకర్ గార్లు, అంతిమతర్పణమర్పిస్తున్న దృశ్యం.

ఆర్థిక పారిశ్రామిక వ్యాపార విషయాలు

సోవియట్ ద్రవ్యసంస్కరణలు

సోవియట్ రష్యాలో చలామణిలో నున్న నాణెమగు 'రూబుల్' విలువను తగ్గిస్తూ, సోవియట్ ప్రభుత్వం ఈమధ్యనే ఒక ముఖ్య ప్రకటన చేసింది. యుద్ధకాలంలో జర్మన్లు, రష్యాలో కొన్ని ప్రాంతములను ఆక్రమించుకున్నప్పుడు ఆ ప్రాంతాలలో రూబుల్ వంటివే దొంగ రూబుల్ నోట్లు తయారుచేసి చలామణిలో పెట్టారు. ఆ ప్రాంతాలు రష్యన్లు తిరిగి వశపరచుకున్న తర్వాతకూడా ఆ దొంగరూబుల్ నోట్లు చలామణిలో వుండిపోకతప్పిందికాదు. మరియు, యుద్ధకాలంలో రష్యాలో ధరలు పెరగకుండాచేసి, అత్యావసరపదార్థాలు రేషన్ చేయటంవలన, ఆ పదార్థాల ధరలు (బ్లాక్ మార్కెట్లోవలె) బజారులో చాల ఎక్కువగా పెరిగిపోయాయి. కొన్నివస్తువుల బ్లాక్ మార్కెట్ధర కంట్రోల్ ధరకు 15 రెట్లువరకు కూడా పెరిగింది. ఈ విధంగా, దొంగనోట్లు దాచుకున్నవారు, బ్లాక్ మార్కెట్ డబ్బు సంపాదించినవారు ధనవంతులైపోయినారు. రష్యాలో ఉత్పత్తి తగినంత హెచ్చుస్థాయికి ఇంకా రాలేదు. రేషనింగ్ తొలగిస్తే, సరకు నంతను బ్లాక్మార్కెట్ వ్యాపారస్థులు కొని వేసివేయటంగాని, రేషనింగ్ తొలగించకపోతే బ్లాక్మార్కెట్ వృద్ధిఅయిపోతూ వుండటంగాని జరుగగల పరిస్థితు లేర్పడినవి. ఈదొంగ రూబుల్ నోట్లను, బ్లాక్ మార్కెట్ డబ్బును చలామణిలోనుండి తొలగిస్తే, రేషనింగ్ తొలగించినా ధరలు పెరిగిపోయే అవకాశంలేదు. దొంగ నోట్లుగాని, బ్లాక్మార్కెట్ డబ్బుగాని ధనవంతుల వద్దనే వుంటుందన్న విషయం సువిదితమే.. ఈ ధనమును నాశనం చేయటంవలన ప్రజా సామాన్యానికి ఏ మాత్రము కష్టం కలుగదు; ధనవంతులకు కూడా ఏ మంత నష్టం కలుగదు. ఇట్టి ధనాన్ని నాశనం చేయటానికి రష్యన్ ప్రభుత్వం ఒక కొత్తవిధానా న్ననుసరించింది.


కొన్నాళ్ళ క్రితం మనదేశంలో వేయి రూపాయల నోట్లు చెల్లవని ప్రభుత్వం ప్రకటించిన విషయం ఇంకా ఎవ్వరూ మరచిపోయి వుండరు. అయితే, వెయ్యిరూపాయల నోటుకు కొన్ని షరతులపై, వెయ్యి రూపాయలు యివ్వటానికి ప్రభుత్వం వొప్పుకున్నది. కాని రష్యన్ ప్రభుత్వం వ్యక్తుల ధనం మొత్తాన్నే తగ్గించటానికి పూనుకున్నది అందుకొరకు ఒక కొత్త రూబుల్ను ఏర్పరచారు; ఇదిఒక కొత్తరకపు నోటుకన్న వేరేమీ గాకపోవచ్చును. పాత నోట్లు ఈ కొత్తనోట్లకు మార్చుకోవలెను. ఈ మారకంలో పది పాత రూబుల్ నోట్లకు ఒక కొత్త రూబుల్ మాత్రమే యిస్తారు; మిగిలిన తొమ్మిది రూబుల్లు నాశనమై పోతవి. బ్యాంకులలోవున్న డిపాజిట్ల మొత్తముకూడా తగ్గిస్తారు. మూడువేల రూబుల్ల వరకు డిపాజిట్లకు పూర్తి మొత్తమునకు కొత్త రూబుల్లు యిస్తారు; మూడు వేలకు పైబడ్డను మొత్తము మూడు పాత రూబుల్లకు రెండు కొత్త రూబుల్ల చొప్పున మారుస్తారు. సహకార సంఘములు, వ్యవసాయ సంఘములలో నున్న డబ్బును 5 పాత రూబుల్లకు మూడు పాతరూబుల్లకు మారుస్తారు. జనసామాన్యంలోని అత్యధిక సంఖ్యాకులకు మూడు వేల రూబుల్లకన్న ఎక్కువ నిలువ వుండదు కాబట్టి వారికి ఈకొత్త మారకంవలన ఏనష్టమూవుండదు. ధనికులకు వారి ధనం మొత్తమును బట్టి కొంత నష్టము కలుగుతుంది. ఈ సంస్కరణ జరిగిన వెంటనే రేషనింగ్ తొలగిస్తారు. ధరలపై కంట్రోలు వున్నా, ఆహార పదార్థాల ధరలు తగ్గిస్తారు. అందువలన, సామాన్యకుటుంబానికి ఇందువలన చాల లాభం కలుగుతుంది. సామాన్య కుటుంబం ఆహార పదార్థాలకు చేయవలసిన ఖర్చు ఈసంస్కరణలవలన దాదాపు సగానికి తగ్గిపోతుం దని తెలుస్తున్నది. రష్యన్ ప్రభుత్వ ఋణాలనుకూడా మూడు పాత రూబుల్లకు ఒక కొత్త రూబుల్ చొప్పున మార్చి వేస్తారు. ఇందువలన ప్రభుత్వ ఋణము, భాగ్యవంతుల ధనము మూడింట రెండువంతులు ఒక్కమారుగా తగ్గిపోతుంది. ఈ సంస్కరణలవలన రష్యాకు ఇతర దేశాలలోగల ఆస్తిఅప్పులలో ఎట్టిమార్పూ రాదు. ఈ విధంగా రూబుల్ విలువను తగ్గించి, స్థిరీకరణ మొనరించుటవలన, రష్యావిదేశాలతో-ముఖ్యంగా తూర్పు యూరప్ దేశాలతో-ఎక్కువ వర్తకం చేయటానికి, అమెరికా సూచించిన మార్షల్ పథకానికి ప్రత్యామ్నాయంగా తూర్పు యూరప్ రాజ్యాలకు మాలటావ్ పథకం ప్రతిపాదించడానికి, 'డాలరు ప్రాంతము,' 'స్టర్లింగ్ ప్రాంతము' లవలె 'రూబుల్ ప్రాంతము' ఏర్పరచు కొనడానికి, అవకాశా లున్న వని పశ్చిమ యూరప్ రాజ్యాలు భావిస్తున్నవి. ఇదెట్లున్నా ఈ సంస్కరణల వలన రష్యాలో సామాన్య మానవుని జీవనం మరింత సౌఖ్యప్రద మౌతున్న దనటం నిస్సందేహమైన విషయం.

సింద్రీ ఎరువుల ఫ్యాక్టరీ

అధికాహారోత్పత్తి ఉద్యమమునకు ప్రోత్సాహమొసంగుటకు విదేశములనుండి మన ప్రభుత్వం ఎరువులను దిగుమతిచేయటం 1943-44 వ సం॥లో ప్రారంభించిన విషయం ఈ పుటలో ఇదివరకే గమనింపబడినది (చూ. ఆంధ్రపత్రిక. అక్టోబరు 15 వ తేదీ). మనదేశమునకు కావలసిన రసాయనిక ఎరువులు మనదేశంలోనే ఉత్పత్తి చేయాలని భారతప్రభుత్వం మొదటినుండి భావిస్తున్నది. మన దేశంలో రసాయనిక ఎరువులను ఉత్పత్తిచేయుటకు గల అవకాశములను పరిశీలించి, ప్రభుత్వమునకు సిఫార్సులు చేయుటకు బ్రిటిష్ నిపుణుల సంఘ మొకటి 1944 వ సం॥ లో మన దేశమునకు రావింపబడినది. ఆ సంఘం సిఫార్సులప్రకారం మన దేశంలో మూడు ఎరువుల ఫ్యాక్టరీలు స్థాపించవలెనని నిర్ణయింపబడినది. మనదేశమునకు సంవత్సరమునకు 30 లక్షల టన్నుల రసాయనిక ఎరువు కావలసియుండునని అంచనా వేయబడినది. యుద్ధమునకు పూర్వము మనదేశమునకు 1 లక్ష టన్నులు రసాయనికి ఎరువులు మాత్రమే దిగుమతి జరుగుచుండెడివి. యుద్ధకాలములో ఎరువుల దిగుమతి అంతర్జాతీయ ఆహారసంఘ యాజమాన్యమున జరుగుచుండెడిది; ఈ సంవత్సరం మొత్తం 172 వేల టన్నులు ఎరువులు దిగుమతి యగునని తెలుస్తున్నది. దిగుమతి అయిన ఎరువులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వముల యాజమాన్యమున అమ్మబడుచున్నవి.

బ్రిటిషు నిపుణుల సలహాప్రకారం 10 లక్షల టన్నుల ఎరువులను తయారుచేయ గలుగుటకు, మూడు ఫ్యాక్టరీలను వెంటనే స్థాపించవలె నని భారత ప్రభుత్వం నిర్ణయించింది. వీనిలో మొదటిఫ్యాక్టరీ బీహారులోని సింద్రీ వద్ద నిర్మించబడును. ఈ ఫ్యాక్టరీ నిర్మాణమునకు టెండర్లను 1945 వ- సంవత్సరంలోనే భారత ప్రభుత్వం కోరినది. ఫ్యాక్టరీ ఆకారమును నిర్ణయించి, కట్టడమునకు బాధ్యత వహించుటకు న్యూయార్కులోని కెమికల్ కన్స్ట్రక్షన్ కంపెనీ అంగీకరించినది. ఫ్యాక్టరీ నిర్మాణమునకు కావలసిన సామగ్రి సరఫరా చేయుటకు బ్రిటన్ లోని పవర్ గాస్ కార్పొరేషన్ బాధ్యత వహించినది. భారతదేశంలో దొరికే సామగ్రి నంతను భారతదేశంలోనే కొంటారు. ఈ ఫ్యాక్టరీ కొరకు ఇంతవరకు బ్రిటన్లో 40 లక్షల పౌనుల ఖరీదు యంత్ర సామగ్రికిన్నీ, అమెరికాలో 8 లక్షల పౌనుల యంత్రసామగ్రికిన్నీ ఆర్డర్లు యివ్వబడినవి. ఇందులో కొంత సామగ్రి ఇప్పుడు భారతదేశం చేరినది కూడా. ఈ ఫ్యాక్టరీ ఖరీదు మొత్తం 1 కోటి పౌను లగునని అంచనా వేశారు (1 పౌను - 13½ రూ. లు). ఫ్యాక్టరీ నిర్మాణం 1950 వ సం. నకు పూర్తి అవుతుందని భావిస్తున్నారు. ఈ ఫ్యాక్టరీలో 2 వేల మంది కార్మికులు నిత్యమూ పనిచేస్తుంటారు; సంవత్సరమునకు 3½ లక్షల టన్నుల ఎరువు ఉత్పత్తి అవుతుంది. ఫ్యాక్టరీని నడుపుటకు, ఒక్కొక్కటి 2500 గుఱ్ఱముల బలముగల (హెచ్. పి.) 8 మోటార్లు పనిచేయవలెను. రోజుకు వెయ్యిటన్నులు రాతిబొగ్గు ఈ ఫ్యాక్టరీలో ఉపయోగింపబడును. అమ్మోనియాను, అమ్మోనియా సల్ఫేట్గా మార్చుటకు దినమునకు 1500 టన్నుల గిప్సం (ఒకలోహము) ఉపయోగింపబడును.

సింద్రీఫ్యాక్టరీ నిర్మాణం పూర్తిఅయిన తరువాత 3, 4 ఏండ్లవరకు రెండవఫ్యాక్టరీ నిర్మాణమునకు పూనుకొనుటకు వీలుండక పోవచ్చునట.



కురుక్షేత్ర కాందిశీకుల విడిదికి మేజరైన, మేజరు జనరల్ జస్వంతసింగ్, చెంబూర్ కాందిశీకుల విడిదిని సందర్శించినప్పటి దృశ్యం.

నేను ఎవరినైతేనేం!

(11-వ పేజీ తరువాయి)

మా యింటికి పోదాం. మా నాన్న యునాని వైద్యుడు. మందేస్తాడు. తగ్గిపోతుంది.' అని ఆ పిల్లాడు నన్ను వాళ్లయింటికి లాక్కుపోయాడు.

ఆ యునానీ వైద్యుడొక ముసల్మాన్. రోజుకు ఐదుసార్లు నమాజుచేస్తాడు. బీద, బిక్కికి ఉచితంగా మందు లిస్తాడు. అతనికి హిందువులు, ముస్లింలు, సిక్కులు అన్న వివక్షత లేదు. ఎవరు జబ్బుతో వస్తే వారందరికీ మందులిస్తాడు. హకీంసాహెబు మందులవల్ల నా జ్వరము తగ్గింది కాని అంత పెద్ద వైద్యుడివద్దకూడ నా పూర్వ స్మృతిని తెప్పించే మందు లేకపోయింది. నా కథంతా ఆయనతో చెప్పి 'ఒకవేళ నేను హిందువు నేమో. నేను మీ యిల్లు వదలి ఇంకో చోటికి పోవాలి' అని అన్నా. కాని హకీం సాహెబు నన్ను అక్కడే ఉండమని బలవంతం చేశాడు. 'నీవు హిందు వయితేమాత్రం ఏ మొచ్చింది? హిందువులు మాత్రం మనుష్యులు కారూ?'. నే నక్కడే కొంత కాల మున్నా.

ఒక రోజున హకీం సాహెబు కొడుకు నా మాదిరి దురదృష్ట వంతులకు రొట్టెలు యివ్వటానికి వెళ్లి తిరిగి యింటికిరాలా. నేను, హకీం సాహెబు అతనికోసం ఆ రోజల్లా వెతికాం. కాని అతని జాడ తెలియలా. జామ్ మసీదు దగ్గర హిందువులు చంపా రని రాత్రి తెలిసింది. ఈ వార్త వినంగానే హకీం సాహెబు కుటుంబమంతా దుఃఖ సముద్రంలో మునిగిపోయింది. ఆ పిల్లాడి భూతం నన్ను రాత్రి, పగలూ వెంటాడుతూ తన మృదుమధురవచనాలతో 'నువ్వు చచ్చిపోతున్నప్పుడు నీవు తిండిపెట్టా. కాని, నువ్వు నన్ను చంపేశావు. గుర్తుంచుకో!' అంటోంది. నేను చంపలేదని నాకు తెలుసు. కాని నేను హిందువునేమో. మతి దప్పక పూర్వం నేనుకూడ అనేకమంది ముస్లిం పిల్లలను చంపానేమో, ఈ ఆలోచన నన్ను అక్కడ నిలవనియ్యలా! ఆ రోజు తెల్లవారు ఝామున ఇంట్లో ఎవళ్లూ లేవకముందే బయటకు పారిపోయా.

'అవి, ఢిల్లీలో మృత్యుదేవత తన సహస్ర బాహువుల్నీ జాపుతూ కరాళనృత్యం చేస్తున్న రోజులు. పట్టపగలే సామాన్యప్రజానీకం మృత్యువువాత పడుతోంది. ఇళ్లు అగ్నిహోత్రుడిపా లవుతున్నాయి. ఏదో ఒకవిధంగా గూండాలను తప్పించుకొని రైలుస్టేషనుకి చేరుకొన్నా. ఇక్కడికన్న బొంబాయిలో కొంచెం ప్రశాంతంగా ఉంటుందని విని అక్కడకు బయలుదేరా. నా పక్కన పంజాబునుండి వస్తున్న ఒక కాందిశీకుడు విన్నబోయిన వదనంతో కూచున్నాడు. రైలు కదిలిన కొంతసేపటికి 'ఎవరునీవు?' అని అడిగాడు. 'నాకు తెలియదు. హిందువునైనా కావచ్చు. ముస్లిమునైనా కావచ్చు.'

'ఈ మార్గంగుండా ముస్లింలు ప్రయాణం చేస్తే ఘోర ప్రమాదాలకు గురి అవుతా రని విన్నా. నీకు గడ్డం ఉంది. అందుకని అడిగా!

'నేను నా కథ అంతా అతనికి వినిపించా. అతడు నా గడ్డాన్ని దీక్షగా పరిశీలిస్తూ నావంక అనుమానంగా చూస్తున్నాడు.

'వారం రోజులనుండి గడ్డానికి కత్తి తగలకపోవటంచేత గడ్డం కొంచెం పెరిగింది. ఏదో పిచ్చాపాటి మట్లాడుకుంటూ భరతపురం వచ్చాం. అక్కడ రైలు ఆపివేయబడింది. ముసల్మానులు అని అనుమానం వేసినవారి నందర్నీ రైలులోనుండి బయటకు లాగి కాల్చి చంపేస్తున్నారు.

'ఆ విషయాన్ని తలచుకొంటుంటే నాకిప్పటికీ నవ్వు వస్తోంది. ఎందుకు నవ్వు వస్తోందో మీకు తెలుసుకోవా లని ఉందా? ఆ విధంగా ముసల్మానులను బయటకు లాగి కాల్చి చంపేవాళ్ళంతా 'మహాత్మా గాంధికి జైయ్'అని అరుస్తున్నారు. అది చాలు చచ్చిపోయేముందు ఎవరైనా నవ్వటానికి.

'వాళ్ళు మా బోగీదగ్గరకు రాగానే నాకు కూడ చావు తప్ప దనుకొన్నా. నేను ముస్లిమును అవునో కాదో నాకుమాత్రం తెలియదు. కాని నాకు గడ్డం ఉంది. అది చాలు నన్ను చంపటానికి. నన్ను వాళ్ళు చూడకముందే నాపక్కన యిందాకటినుండి కూచున్న పంజాబీ నామీద దుప్పటి వేసి నన్ను పూర్తిగా కప్పేశాడు. వాళ్లు అడగంగానే 'ఆయన మా అన్నండి. లాహోరులో బాగా గాయాలు తగిలాయి. ఇప్పుడు మాట్లాడే పరిస్థితిలో లేడు' అని నా పంజాబీ స్నేహితుడు చెప్పాడు.

'ఏదో ఒకవిధంగా చివరకు బొంబాయి చేరుకొన్నా. ఇక్కడకూడ అదేప్రశ్న ఎదుర్కొంది— నువ్వు హిందువుడివా, ముస్లిమువా ?.

'ఎవరు హిందువు ? ఎవరు ముస్లిము? అన్న ఆలోచన నాకు యిప్పుడు తట్టింది. నేను ముస్లిముగా కనుపించినప్పటికీ పంజాబీ నన్ను కాపాడాడు. అతను హిందువా? లేక హకీం సాహెబు కొడుకును చంపిన కిరాతకులు హిందువులా? ఎవరు ముస్లిములు? హకీం సాహెబు కుటుంబం ముస్లిము కుటుంబమా, లేక రావల్పిండిలో సిక్కులను నానా బాధలుపెట్టిన రాక్షసులు ముస్లిములా? ఎవరు సిక్కులు? సర్దార్ సాహెబు కుటుంబమా లేక ఢిల్లీలో వీరవిహారం చేస్తున్న నీచులా? ఎవరు ముస్లిం? ఎవరు హిందువు? ఎవరు సిక్కు? ఈ పవిత్రస్థలములో కూడ నువ్వు హిందువువా, ముస్లిమా, సిక్కా అన్న ప్రశ్నే ?!

'నే నెవర్ని? హిందువునా? ముస్లిమునా?'

'రాత్రిం బగళ్లు యీ ప్రశ్న నన్ను బాధించింది. నిద్రపోతున్నప్పుడుకూడ యీ ప్రశ్న భూతాల రూపందాల్చి బల్లాలు పుచ్చుకొని జవాబు పొందటానికి ప్రయత్నించాయి. నేను కలవరింతగా యీ మాట అన్నానేమో. 'నన్ను వదలివెయ్యండి. నేను ముసల్మానునుకాదు. హిందువునూకాదు. సిక్కునూకాదు. ఒక మానవుణ్ణి మాత్రమే!

'బొంబాయిలో కాందిశీకు లకు శిబిరాలున్నాయి. సిక్కులకు ఖాల్సా కళాశాల దగ్గర ఒక శిబిరం ఉంది. హిందువులు రామకృష్ణ ఆశ్రమంలో తలదాచుకో వచ్చును. ముస్లింలు అంజుమన్ ఇస్లాం హైస్కూలుకు పోవచ్చును. కాని నేను ఎక్కడకు వెళ్లను? నాకు తలదాచుకొనేందుకు ఎక్కడా చోటు లేదు.

ముష్టికూడ నా కెవళ్లూ వేసేవాళ్లు కాదు. ముష్టి వేసేందుకు గూడ నేను మతంవాడినో అడిగేవాళ్లు. నేనేం చెప్పేది? నేను ఏ మతానికీ సంబంధించిన వాడిని కాను. అయితే నేను చచ్చిపోవాలన్నమాట. ఊహుఁ. ఆవిధంగా చావలేను. నేనెవరినో తెలుసుకోవాలి. లేకపోతే నేను బతకటానికి అవకాశం లేదు.

డాక్టరు 'సమాని' నా స్మృతిని తెప్పిస్తాడని విని అక్కడకు వెళ్లా. అతడు మందులు, మాకులు వేసి రోగం నుదర్చడు. ఊరికే మాట్లాడి కుదురుస్తాడు. 'నీ మనస్సును కష్టపెట్టుకోకు. నీబుర్రలో ఏమొకిస్తే అంతా చెప్పు. సంబంధ మున్నా సరే లేకపోయినాసరే' అనిచెప్పి తను ఒక కాగితం కలం పుచ్చుకొని నా ముందు కూచున్నాడు. నేను కళ్ళు మూసుకొని నానోటి కొచ్చిందల్లా మాట్లాడా.

'నీలపు ఆకాశం, పచ్చనిచేలు'

'బాగుంది, ఆపబోకు'

'నీలపు ఆకాశం, పచ్చనిచేలు, ఒక నదీ ప్రవాహం. నదిలో పడవలున్నాయి. ఒక కాలువ. కాలువలో పిల్లలు యీదుతున్నారు. ఒకళ్లమీద ఒకళ్ళు నీళ్లు చల్లుకుంటున్నారు.'

'ఎవరీ పిల్లలు ? హిందువులా, ముస్లిములా, సిక్కులా'

'ఏమో, ఎవరో. కానివాళ్ళుమాత్రం పిల్లలు'

'సరే, కానీ'

'పంటపొలం, పండగ. ఆగు! ఆగు!! డోలక్ వాయిద్యం విను. ఆహాఁ. ఎంత బావుందో ఆహాఁ! ఏంపాట. !!!'

'ఎవరు పాడుతున్నా రా పాట?'

'స్త్రీలు'

'సరే. ఎవ రా స్త్రీలు. హిందువులా, ముస్లిములా, సిక్కులా.'

'పంజాబు స్త్రీలు. హిందువులు, ముస్లిములు సిక్కులు'

'ఊఁ'అని నిట్టూర్చాడు డాక్టరు యికలాభం లేదన్నట్టు.

'ఇక నేనేం చెప్పలేను. నాకేం వినిపించటంలా'

'ఏం? ఎందుకని? ఏ మొచ్చింది ?'

'నాతల తిరిగిపోతోంది. ప్రపంచమంతా చీకటిగా ఉంది. భయంకరమైన కేకలు వినిపిస్తుయి.'

'గట్టిగా ప్రయత్నించు. ఇప్పుడేం కనిపించటంలా?'

'కనిపిస్తున్నాయి. ఆకాశాన్నంటే మంటలు. ఇళ్లన్నీ తగలబడి పోతున్నాయి. ఏడుపు స్వరాలు వినిపిస్తున్నాయి.

'సరే, గూండాలు వచ్చారన్నమాట. వీళ్ళే నీ బంధువుల్ని చంపేశారు. వీళ్ళే నీ ఆస్తి అంతా దోచేశారు. వీళ్ళే నీ పెళ్లాం పిల్లల్ని చంపేశారు. నీ మతి పోగొట్టారు...వా ళ్ళేం చెబుతున్నారు?'

నా కేమీ వినిపించటంలా. అంతా గోలగా ఉంది. ఒక్క మాటమాత్రం చెవులో గుద్దినట్లువినిపిస్తోంది.

'చంపు చంపు చంపు.'

'వీళ్ళే నిన్ను సర్వనాశనం చేశారు. వీళ్ల మీద నువ్వు పగతీర్చుకోవాలి.'

నేను హిందువునో, ముసల్మానునో డాక్టరు తెలుసుకో బోతున్నాడు!

నేను ముస్లిముని: సర్దార్ సాహెబు బంధువుల్ని చంపా. అనేకమంది హిందువుల సిక్కుల ప్రాణాలు తీసివేశా.

నేను హిందువుని. హకీం సాహెబు కొడుకుని చంపా. ఇంకా అనేకమంది ముస్లిములను చంపా.

'వద్దు. అక్కర్లేదు. నే నెవరినో నేను తెలుసుకో నక్కర్లా. నేను హిందువుగాని, ముస్లింగాని, సిక్కుగాని అవదల్చుకోలా. నేను ఒక మానవుడిగా మాత్రమే ఉంటా. అంతే! అంతే!!' అని అరుస్తూ డాక్టరు దగ్గరనుండి పారిపోయా.

'నేను హిందువుని. నేను ముస్లిముని.'

'నేను ముస్లిముని హిందువుని'

'నే నెవర్ని. నాకేం పనీ'

'నే నెవర్ని కాదు. నాకేం పని లేదు'

'నేను హిందువుని ముస్లిముని'

ప్లేగునుండి పారిపోయినట్టు డాక్టరు దగ్గరనుండి పారిపోయా. కాని యీ మాటలు మాత్రం నన్ను వదలిపెట్టలా! నేను ఏ వీధిగుండా పరుగెత్తుతున్నానో నాకు తెలియదు. భయంకరంగా వ్యక్తి ఒకడు నన్ను పట్టుకు ఆపాడు.

'అరే సాలా! ఎవర్రా నువ్వు? ఎక్కడికి పోతున్నావ్ ?'

అతడొక ముస్లిం మవాలి. అతని చేతిలో కత్తి ఉంది. 'నేను నా సమస్యతోనే కొట్టుకొంటున్నా. "నేను హిందువుని. నేను ముస్లి.......' 'ముస్లిము' అన్నమాట పూర్తి చేయకముందే నా వీపులో బాకు దిగిపోయింది. అదే వీపులో ఉన్న బాకు పోటు!

'కాఫిర్ కా బచ్చా' అని అంటున్నాడు. నేను పూర్తిగా పడిపోకుండా పారిపోతున్నప్పుడు. నా వెనుక రక్తం కారుతోంది. మీరు నమ్మరు. అయితే నమ్మబోకండి. చచ్చిపోయే ముందు నేను నిజం మాట్లాడుతున్నా నని నాకు మీరేమీ సర్టిఫికేట్ యివ్వనక్కర్లా......

'నేను ముస్లిముని. నేను హిందువుని' అని అనుకుంటూనే పోతున్నా. ఈసారి 'హిందువు' అంటానికి పూర్వం నా డొక్కలో ఒక బాకు దిగింది.

'ఇప్పుడు మీరు గ్రహించా రనుకొంటా, నాకీ రెండు గాయాలు ఎట్లా తగిలాయో. నన్ను హిందువులు, ముస్లిములు యిద్దరూ బాకుతో పొడిచారు. అందుకనే మీరు నన్ను బతికించ లేరని చెప్పింది డాక్టరుగారు.

ఇక్కడ యింత ఆదుర్దాగా చూస్తున్న మీలో ఒక్కడుకూట నన్ను బతికించలేరు. పగ తీర్చుకొంటానికి మాత్రం నా చావును ఆధారంగా తీసుకొంటారు. ఇప్పుడు గనక నేను హిందువునని చెప్పినట్లయితే వెంటనే హిందువులు నాలుగు అమాయకముస్లిం పిల్లల ప్రాణాల్ని ఆహుతి గొంటారు. ముస్లిము నని చెబితే ముస్లిములంతా హిందూ మతాన్ని రూపు మాపేస్తారు.

'నేను నవ్వుతున్న దెందుకంటే, యిప్పుడే తెలిసింది నే నెవరినో? ఇంత కాలానికి యిప్పుడు తెలిసింది. నా పూర్వచరిత్రంతా గుర్తుకొచ్చింది.......అందాల రాణి నాభార్య. నా బిడ్డడి చిలిపి చేష్టలు. ఇద్దరుకూడ నా కళ్ల ఎదటే చంపబడ్డారు. ఆ విధంగా నా మతి దప్పింది. ఆఁ! అవును! అంతా నా కిప్పుడు గుర్తు కొస్తోంది. మా పొలాలు, మా గ్రామం, నా స్నేహితులు, నా యిరుగు పొరుగువాళ్ళు- అంతా యిప్పుడు జ్ఞాపక మొస్తున్నారు. చచ్చిపోయేముందు అన్ని విషయాలు గుర్తుకొస్తాయి. నిజం!

'మీరు నేనేమి చెబుతానో అని యింకా నిరీక్షిస్తున్నారు. కాని లాభం లేదు. నేను చెప్పను నేను హిందువునో, ముసల్మానునో చెప్పను చెప్ప దలచుకోలేదు. నాకు యీ రెండు గాయాలు తగిలించిన హిందువుగాని, ముస్లింగాని నేను తన జాతివాడి నని తెలుసుకోకూడదు. అరే పొరబాటున పొడిచానే అని పశ్చాత్తాపం పొందకూడదు. ఇదే నా పగ. వీ ళ్లిద్దరిమీదే కాదు. నాలాంటి అమాయకప్రాణాలను బలిగొంటున్న వేలకొలది హిందువులమీద, ముస్లిములమీద, సిక్కులమీద వీళ్ళు పుట్టటం మూలంగా, బతకటం మూలంగా ఆత్మీయమైన నా పంజాబుకు తీరని కళంకం వచ్చింది.

'నేను హిందువునా, ముస్లిమునా ?' 'నేను ముస్లిమునా హిందువునా?' ఈ ప్రశ్నే వాళ్లకు కావాల్సింది. ఈ ప్రశ్నే వాళ్లను రాత్రింబగళ్లు వేధించుకు తినేది. పట్టణంలోను, పల్లెలోను, ఫ్యాక్టరీలోను, బస్సులోను, ట్రాములోను ఎక్కడబడితే అక్కడ యిదే ప్రశ్న. 'వాడు హిందువా, ముస్లిమా?' వాళ్లకుగాని వాళ్ల పిల్లలకుగాని, వాళ్ల పిల్లల పిల్లలకుగాని శాంతిఅంటే ఏమిటో తెలియదు.

భయంకరం, ఘోర భయంకరం నా పగ. 'ఇంకా మీకు తెలుసుకోవా లని ఉందా, నే నెందుకు నవ్వుతున్నానో ?'

[అబ్బాస్ కథకు అనువాదం]


ఎలిజబత్ రాకుమారి పెళ్ళి ముచ్చటలు



వివాహానంతరం బకింగ్‌హామ్ భవనంలో రాకుమారి ఎలిజబత్, డ్యూక్ ఆఫ్ ఎడిన్‌బర్గులు.



ఎలిజబత్ రాకుమారికి లండన్ విశ్వవిద్యాలయం గానపట్టభద్ర (Bachelor of Music) బిరుద మిచ్చినప్పటి ఛాయాచిత్రం.



వివాహ సమయములో నానాదేశాలుపంపిన సంబారాలతో తయారు చేసిన వెడ్డింగ్ కేక్.




రాకుమారి వివాహానికి మేళం వాయించిన ట్వికెన్‌హామ్ రాయల్ మిలిటరీ స్కూల్ ఆఫ్ మ్యూజిక్ సంస్థవారు, యథోచిత దుస్తులతో మేళానికి తయారౌతున్న దృశ్యం.





రాకుమారి అత్తమామలు.



రాజకుటుంబమువారు వధూవరుల కిచ్చిన నగలు.

Regd. No. M. 4479

శ్రీమద్భగవద్గీత

వ్యాఖ్యాత: శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావుగారు

చతుర్థ ముద్రణము



సంస్కృత మూలము, తెలుగున టీకా తాత్పర్య విశేషార్థ వివరణములుగల 400 పుటల గ్రంథము. గీతాధ్యయనపరులకు మిక్కిలి ఉపయుక్తమైనది.

ఖద్దరు బైండు.

వెల రు 4-0-0 లు. తపాలాఖర్చు రు. 0-8-0.

ఆంధ్రగ్రంథమాల, పోస్టుబాక్సు 212, మదరాసు

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, No. 7, Thambu Chetty St., G. T. Madras.
Q. H. M. S. No. 857—10,000 Copies.